ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
25-8-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 205 పేజీలు: 10+4 వెల: 6.50

అంతరిక్షంలో సుదూర తీరాలను శోధిద్దాం: ప్రధాని
రష్యా అణువిద్యుత్ ప్లాంట్‌పై ఉక్రెయిన్ డ్రోన్‌దాడి 5

# మెడికల్ హబ్‌గా రాష్ట్రం


ఆదివారం హైదరాబాద్‌లో బయోడిజైన్ సమ్మిట్‌లో ప్రసంగిస్తున్న సిఎం రేవంత్

## లైఫ్ సైన్స్, బయోడిజైన్స్, మెడికల్ టెక్నాలజీ రంగాల్లో తెలంగాణ ముందంజ
### తెలంగాణ రైజింగ్-2047 నినాదంతో ముందుకు
### 2034 నాటికి ట్రిలియన్ ఆర్థికవ్యవస్థగా అభివృద్ధి
### బయోడిజైన్ సమ్మిట్‌లో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు24:** బయోడిజైన్స్, లైఫ్ సైన్సెస్,మెడికల్ టెక్నాలజీ రంగాల్లో తెలంగాణ ఒక ముఖ్యమైన కేంద్రంగా ఎదుగుతోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం గచ్చిబౌలి ఏఐజి ఆసుపత్రిలో ఆసియా-పిసిఫిక్ బయోడిజైన్ ఇన్నోవేషన్ సమ్మిట్-2025 ఘనంగా జరిగింది. ఈ సమ్మిట్‌కు సిఎం ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయోడిజైన్ ఉపయోగించి వైద్య ఉత్పత్తుల ఆవిష్కరణల సదస్సులో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. దేనినైనా మనం రూపొందిస్తే దాని ప్రయోజనం, పనితీరు, రూపం ప్రాథమిక అంశాలుగా ఉంటాయని చెప్పారు. దేవుడు గొప్ప డిజైనర్. ప్రకృతి ఉత్తమ గురువు. మనం మంచి విద్యార్థులమా లేదా అన్నదే ప్రశ్న అని పేర్కొన్నారు. లైఫ్ సైన్సెస్‌లో, వైద్యంలో, ప్రకృతి ఉత్తమ గురువు. మనం ప్రకృతి నుంచి నేర్చుకుంటే చాలా మంచిదన్నారు. కృత్రిమ మేధస్సు బయోడిజైన్‌కు మంచి ఉదాహరణ, మానవులు కృత్రిమ మెదడును సృష్టించడానికి సహజ మెదడును ఉపయోగించారు అని చెప్పారు. మేము తెలంగాణ రైజింగ్ 2047 అనే ప్రయాణాన్ని ప్రారంభించాము, 2034 నాటికి తెలంగాణను1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. దేశం 100 సంవత్సరాల స్వాతంత్ర్యదినోత్సవాన్ని జరుపుకునే 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుస్తామన్నారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్‌కు కేంద్రంగా ఉందన్నారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను సాధించడంలో వైద్య పరికరాలు, మెడ్‌టెక్ కీలకమైనవన్నారు. ఫార్మా, బయోటెక్, లైఫ్ సైన్సెస్, మెడ్‌టెక్ వంటివి హైదరాబాద్‌లో అత్యంత కీలకమైనవన్నారు. తయారీ రంగం నుంచి ఆవిష్కరణలకు కేంద్రంగా తెలంగాణను మారుస్తున్నామన్నారు. సుల్తాన్‌పూర్‌లో 302 ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద మెడికల్ డివైసెస్ పార్క్‌ను ఏర్పాటు చేశాం,ఈపార్క్‌లో పరిశోధన, పరీక్ష, తయారీ కోసం ఉత్తమ మౌలిక సదుపాయాలను అందిస్తున్నామన్నారు. ఇక్కడ 60కి పైగా దేశీయ, >>2

సిఎం రేవంత్‌తో సినీ నిర్మాతలు, దర్శకుల భేటీ 2


ఆదివారం హైదరాబాద్‌లో మంత్రుల కమిటీ భేటీలో మాట్లాడుతున్న డి.సిఎం భట్టి. చిత్రంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్, శ్రీధర్‌బాబు

# 42 శాతం కోటా అమలు ఎలా?
### కసరత్తు ఆరంభించిన మంత్రుల కమిటీ
### అడ్వొకేట్ జనరల్‌తో భేటీ
### పలువురు న్యాయకోవిదుల సలహాలు కూడా తీసుకుంటాం: డి.సిఎం భట్టి

**హైదరాబాద్, అగస్టు 24, ప్రభాతవార్త:** తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై మంత్రుల కమిటీ దృష్టిసారించింది. ఈ నేపథ్యంలో దీనిపై మంత్రుల కమిటీ ఆదివారం సాయంత్రం ప్రజాభవన్‌లో ప్రత్యేకంగా సమావేశమై కసరత్తు చేసింది. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మల్లు బట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన చేశామన్నారు. >>2

# ఓట్ల చోరీ వల్లే బిజెపికి అధికారం
### ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న కాషాయ పార్టీ: కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్


ఆదివారం మాల్కాజిగిరి జిల్లాలో నిర్వహించిన పాదయాత్రలో కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రి వివేక్, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తదితరులు

**మేడ్చల్, ఆగస్టు 24. ప్రభాతవార్త:** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఓట్ల దొంగతనంతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఆరోపించారు. మేడ్చల్ పట్టణంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని ఆదివారం టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. దేశంలో బీజేపీ ఓట్ల దొంగతనం చేసి అధికారంలో కొనసాగుతోందని నటరాజన్ విమర్శించారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయడానికి తమ నాయకుడు రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పాదయాత్ర చేస్తున్నారని, ప్రస్తుతం ఆయన బీహార్‌లో ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీల అమలుతో పాటు, బీజేపీ ఓట్ల చోరీపై ప్రజలను చైతన్యంచేయడానికి తాము పాదయాత్రలు నిర్వహించనున్నామని ఆమె ప్రకటించారు. కరీంనగర్‌లో జరిగే పాదయాత్రలో పాల్గొనడం సంతోషంగా ఉందని అన్నారు. ఎస్సీలలో సబ్ కేటగిరీని అమలు చేసిన ఘనత కేవలం కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఆమె పేర్కొన్నారు. నూతన కార్యాలయం >>2



# ఓట్ల చోరీ జరగనివ్వం
### సిఇసిని వదలం: రాహుల్

**అరారియా, ఆగస్టు 24:** బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు సంబంధించి భారత ఎన్నికల కమిషన్, భారతీయ జనతా పార్టీపై కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీ అదివారం విమర్శల దాడి కొనసాగించారు. విపక్ష పార్టీలకు వ్యతిరేకంగా ఇసిఐ, బిజెపి కలిసి పని చేస్తున్నాయని ఆరోపించారు. బీహార్‌లోని ఆరారియాలో రాష్ట్రీయ జనతాదళ్ నేత తేజస్వియాదవ్‌తో కలిసి మీడియా సంయుక్త సమావేశంలో రాహుల్ మాట్లాడారు. బీహార్‌లో ఓట్ల చోరీ జరగనీయమని అన్నారు. సరైన ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'ఎన్నికల కమిషన్ ప్రవర్తనను >>2

### ప్రభుత్వం, విపక్షాలు సభా నియమాలు పాటించాలి
### అఖిలభారత స్పీకర్ల సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా


ఢిల్లీలో అఖిలభారత స్పీకర్ల సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో స్పీకర్ గడ్డం ప్రసాద్

# చట్టసభలు రాజకీయ లబ్ధికి కాదు..
### ప్రజా సమస్యల చర్చలపైనే దృష్టిపెట్టాలి


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు24:** చట్టసభలు, ప్రజా సమస్యలపై చర్చలు జరపడానికే గానీ, రాజకీయ లబ్ధి పొందేలా వ్యవహరించడానికి కాదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. స్పీకర్ పదవి గౌరవాన్ని, ఆ గౌరవాన్ని కాపాడుకోవడంలోని ప్రాముఖ్యతను విశదీకరించారు. ప్రభుత్వం, ప్రతిపక్షాలు రెండూ సభ నియమాల ప్రకారం కచ్చితంగా సభా కార్యకలాపాలు జరిగేలా చూసుకోవాలని అమిత్ షా నిర్దేశం చేశారు. ఆదివారం ఢిల్లీ అసెంబ్లీలో 2 రోజుల అఖిల భారత స్పీకర్ల సమావేశంలో కేంద్ర మంత్రి అమిత్ షా పాల్గొని మాట్లాడారు. చారిత్రాత్మకంగా, తమ గౌరవాన్ని కోల్పోయిన అసెంబ్లీలు భయంకరమైన పరిణామాలను ఎదుర్కొన్నాయని ప్రస్తావించారు. చర్చలు ప్రజాస్వామ్య బద్ధంగా జరగాలి,ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాలు విపక్షాల కారణంగా సజావుగా జరగలేదు. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, దీని గురించి ప్రజలు,ప్రజాప్రతినిదులు ఆలోచించాలని చెప్పారు. అర్థవంతమైన చర్చలు జరగాలి, స్పీకర్ పదవి గౌరవాన్ని పెంచడానికి నాయకులు కృషి చేయాలని చెప్పారు. స్పీకర్ పదవి గౌరవాన్ని పెంచే దిశగా మనమందరం కృషి చేయడానికి ఇది ఒక అవకాశం. మన దేశ ప్రజల సమస్యలను లేవనెత్తడానికి నిష్పాక్షిక వేదికను అందించడానికి మనం పరితపించాలని చెప్పారు. సభల్లో ప్రభుత్వం, ప్రతిపక్షాలు నిష్పాక్షిక వాదన చేయాలి.సభ పనితీరు, సంబంధిత సభ నియమాల ప్రకారం జరిగేలా చూసుకోవాలి. మన దేశ సుధీర్ఘ చరిత్రలో, అసెంబ్లీలు తమ గౌరవాన్ని కోల్పోయినప్పుడల్లా, మనం భయంకరమైన పరిణామాలను ఎదుర్కోవలసి వచ్చిందని కేంద్ర మంత్రి అన్నారు. కేంద్ర అసెంబ్లీ స్పీకర్‌గా విఠల్‌భాయ్ పటేల్ ఎన్నికై వందేళ్లు అయిన సందర్భంగా ఆమహనీయుడిని అమిత్ షా స్మరించుకున్నారు. శతాబ్ది ఉత్సవాల విశిష్టతను అమిత్ షా నొక్కి చెప్పారు. అప్పటి బ్రిటీష్ కాలంలో 1919 డిసెంబర్ 24న దేశంలో సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ ఏర్పాటైంది. పటేల్ ఆగస్టు 24,1925న కేంద్ర శాసనసభ అధ్యక్షుడిగా (స్పీకర్) ఎన్నికయ్యారు.. కేంద్ర శాసనసభ స్పీకర్ పదవిని నిర్వహించిన మొదటి భారతీయుడు విఠల్‌భాయ్ పటేల్.ఆగస్టు 24 (ఈ రోజు) దేశ శాసనసభ చరిత్ర ప్రారంభమైన రోజు.అది ప్రారంభమైన సభలోనే మనం కూడా ఉన్నాం.ఈ రోజున గొప్ప స్వాతంత్ర్య సమర యోధుడు విఠల్‌భాయ్ పటేల్ కేంద్ర అసెంబ్లీ స్పీకర్‌గా మారడంతో అది ప్రారంభమైందని చెప్పారు. నేడు, దేశ శాసనసభలను నడిపే అందరు స్పీకర్లు, డిప్యూటీ స్పీకర్లు, శాసనమండలి చైర్మన్, డిప్యూటీ చైర్మన్ ఇక్కడ ఉన్నారు. కావున, ఒక విధంగా, స్వర్ణ చరిత్రను సృష్టించిన, స్వర్ణ భవిష్యత్తు కోసం పనిచేస్తున్న మొత్తం శాసన వ్యవస్థ ఇవాళ ఈ చారిత్రాత్మక సభలో ఉంది అని అమిత్ షా అన్నారు. విఠల్‌భాయ్ పటేల్ కేంద్ర అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికై 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ రోజు మనమందరం సమావేశమయ్యామని, >>2


మృతురాలు స్వాతి (ఫైల్)

### భార్యని ముక్కలు ముక్కలుగా నరికి
# మూసీలో పడేసిన కసాయి
### అనుమానం పెనుభూతమై పెళ్లైన రెండు నెలల నుంచే మొదలైన గొడవలు
### మేడిపల్లి పీఎస్ పరిధిలో అమానవీయ ఘటన
### అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం: డిసిపి పద్మజ

**హైదరాబాద్ (మేడిపల్లి), ఆగస్టు 24, ప్రభాతవార్త:** ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను అతికిరాతకంగా హత్య చేసి, ఆపై శరీర భాగాల్ని రంపంతో ముక్కలు ముక్కలుగా నరికి మూసీలో పడేశాడు ఓ కిరాతక భర్త. ఈ అమానవీయ ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బొడుప్పల్ శ్రీనివాసనగర్‌లో శనివారం సాయంత్రం జరగగా, ఆదివారం వెలు గులోకి వచ్చింది.విషయం తెలిసిన స్థానికులు తీవ్రభయాందో ళనకు గురయ్యారు. ఈ మేరకు ఏసీపీ చక్రపాణి, సిఐ గోవిందరెడ్డిలతో కలిసి >>2


నిందితుడు మహేందర్‌రెడ్డి


ఆదివారం హైదరాబాద్‌లో సురవరం భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సిఎం రేవంత్

# సురవరానికి కన్నీటి వీడ్కోలు 3
### ఘనంగా నివాళులర్పించిన సిఎం రేవంత్, డి.సిఎం భట్టి, ఎపి సిఎం చంద్రబాబు, వెంకయ్యనాయుడు, ఎంఎ బేబి, రాజా, కెటిఆర్ ప్రభృతులు
### అధికార లాంఛనాలతో అంతిమయాత్ర
### భౌతిక కాయం గాంధీ ఆసుపత్రికి అప్పగింత

### ప్రభుత్వ స్కూళ్ల అభివృద్ధి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు అప్పగింత




# అటకెక్కిన 'మన ఊరు- మన బడి'!
### పెండింగ్‌లోనే ఉన్న రూ. 380 కోట్ల బిల్లులు
### మొదటి విడతలో 9123 పాఠశాలల్లో పనులు

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 24:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ,స్థానిక సంస్థల పాఠశాలలను బలోపేతం చేయడం, వాటిని కార్పొరేట్ స్కూల్స్‌కి ధీటుగా రూపొందించాలనే ఉద్దేశంతో 2021లో అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం మన ఊరు- మన బడి పథకాన్ని ప్రారంభించాలని నిర్ణయించింది. 2022లో ఈ పథకాన్ని గ్రామాల్లో మన ఊరు- మన బడి పేరుతో ప్రారంభించగా.. పట్టణాలు, నగరాల్లో మన బస్తీ-మన బడి పేరుతో ప్రారంభించింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలను ఒకేసారి కాకుండా దశల వారీగా ఈ పథకంలో భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా మొదటి విడతలో 9123 పాఠశాలలను ఎంపిక చేసింది. ఆ తరువాత 2024లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతోమన ఊరు- మన బడి పథకం రెండో విడత పనుల గురించి మాట్లాడకుండా, రాష్ట్రంలోని ప్రభుత్వ,స్థానిక సంస్థల పాఠశాలల నిర్వహణ కోసం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ(ఏఏపిసి)లను ఏర్పాటు చేస్తున్నట్టు ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వంలో మన ఊరు- మన బడిలో ఎటువంటి పనులు చేపట్టాలని నిర్ణయించారో అవే పనులను ఏఏపిసిలు నిర్వహిస్తాయని ప్రభుత్వం ఉత్తర్వులో స్పష్టం చేసింది. దీంతో మన ఊరు-మన బడి పథకం కాస్త అటకెక్కినట్టు అయింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న మొత్తం ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో ఈ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఈ పథకాన్ని మూడు విడతల్లో రాష్ట్రంలో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా మొదటి విడతలో రాష్ట్రంలోని 9123 పాఠశాలల్లో ఈ పథకాన్ని ప్రారంభించారు. పథకం ముఖ్య ఉద్దేశ్యం, రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలను అభివృద్ధి చేయడం. ఈ పథకం ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగు పరచడం, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం, >>2



### పార్టీ మారిన ఎమ్మెల్యేలు రాజీనామా చేసి గెలవాలి..
### వారు ఓటమి భయంతో ఉన్నారు: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు24:** పార్టీ మారిన ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి, >>2



బీహార్‌లో ఆదివారం జరిగిన ఓటరు అధికార్ యాత్రలో భాగంగా నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

# ఓట్ల చోరీ జరగనివ్వం

>> మార్చడం కోసమే మేము ఒత్తిడి చేస్తున్నాం. వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు. బీహార్ ఎన్నికల్లో ఓట్ల చోరీని జరగనీయం. మీరు మహారాష్ట్రలో దొంగిలించారు. హర్యానాలో ఓట్ల చోరీ చేశారు. కర్ణాటకలో ఓట్ల చోరీ జరిగినట్టు చాలా స్పష్టంగా చూపించాం. ఇక్కడ ఎంతమాత్రం ఓట్ల చోరీ జరగనీయం' అని రాహుల్ స్పష్టం చేశారు. ఓట్ల చోరీ ఆరోపణలపై తామడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడంలో ఇసి విఫలమైందని రాహుల్ అన్నారు. ఎన్నికల సంఘం తటస్థంగా లేదని, ఇసిఐ, ఎన్నికల కమిషనర్, బిజెపి కలిసి పనిచేస్తున్నాయని ఆరోపించారు. రాహుల్‌గాంధీ అఫిడిట్ సమర్పించకుంటే ఆరోపణలు నిరాధారమని భావించాల్సి వచ్చిందని ఇసి చెబుతోందని, అనురాగ్‌ఠాకూర్ ఇదే తరహా ప్రెస్‌కాన్ఫరెన్స్ నిర్వహించినప్పటికీ ఆయనను అఫిడవిట్ సమర్పించమని అడగలేదని ఆయన పేర్కొన్నారు. మహాఘట్‌బంధన్ పోల్ మేనిఫెస్టోపై అడిగినప్పుడు, రైతులకు సంబంధించి చాలా ఐడియాలు ఉన్నాయని, రైతు ప్రయోజనాల పరిరక్షణకు మేనిఫెస్టో కమిటీ కసరత్తు చేస్తోందని చెప్పారు. మహాకూటమిలోని పార్టీలన్నీ బీహార్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు.

# రాజకీయ లబ్ధికి కాదు..

>> ఇది మనందరికీ గర్వకారణమని అమిత్ షా స్పీకర్లను ఉద్దేశించి వ్యాఖ్యా నించారు. విఠల్‌భాయ్ పటేల్ గురించి మాట్లాడేటప్పుడు, గుజరాత్ ప్రజలు గర్వంగా చెప్పుకుంటారు.. రాష్ట్రం ఇద్దరు సోదరులైన సర్దార్ వల్లభాయ్ పటేల్,విఠల్ బాయ్ పటేల్‌ను అందించిందని ఘనంగా చెప్పుకుంటారు. దేశ స్వాతంత్రం కోసం మహాత్మా గాంధీతో కలిసి పగలు,రాత్రి పనిచేసిన వల్లభాయ్, ఇంకా భారతదేశ శాసన సంప్రదాయాలకు పునాది వేసి, నేటి ప్రజాస్వామ్యం పనిచేయడానికి వీలు కల్పించిన విఠల్‌భాయ్ పటేల్‌ను గుజరాత్ రాష్ట్రం ఇచ్చిందని అమిత్ షా అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసంగించే ముందు కేంద్ర మంత్రి షా.. భారతదేశపు మొట్టమొదటి కేంద్ర శాసనసభ స్పీకర్ అయిన విఠల్‌భాయ్ పటేల్ విగ్రహానికి ఘన నివాళులర్పించారు. 1919 భారత ప్రభుత్వ చట్టం ద్వారా స్థాపించబడిన బ్రిటిష్ ఇండియా ద్విసభ శాసనసభలోని దిగువ సభ అయిన సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి స్పీకర్ గా విఠల్ భాయ్ పటేల్ పనిచేశారు. కాగా, ఢిల్లీ అసెంబ్లీ భవనంలో జరిగే ఆల్ ఇండియా స్పీకర్స్ కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

# బిజెపికి అధికారం

>> ఏర్పాటు చేసిన జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిని ఆమె అభినందించారు.

**సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం**

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అనుగుణంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భద్రత వంటి పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. ఎన్నికల్లో వాగ్దానం చేసిన 42 శాతం బీసీ రిజర్వేషన్‌ను అమలు చేయడానికి కృషి చేస్తున్నామని, అయితే బీజేపీ నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ చేపట్టిన ఓట్ చోరీ పాదయాత్రకు మద్దతుగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో డిజిటల్ వాహనాల ద్వారా ప్రచారం చేయడానికి హరివర్ధన్ రెడ్డి సమకూర్చిన ఐదు వాహనాలను అతిథులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, కూన శ్రీశైలం గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం ఇంఛార్జ్ వజ్రేష్ యాదవ్, రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్, మేడ్చల్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, బాల్‌రెడ్డి, చాపరాజు, విజయేందర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సురేందర్, నాయకులు, కార్యకర్తలు, పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 42 శాతం కోటా అమలు ఎలా?

>> ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం మేరకు ఓబీసీ కులగణనను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా చేపట్టినట్లు మంత్రుల కమిటీ తెలిపింది. సోషియో, ఎకనామిక్, ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్, పొలిటికల్ అండ్ కాస్ట్ సర్వేలో వచ్చిన ఎంపిరికల్ డాటాను శాసనసభలో ప్రవేశపెట్టి, స్థానిక సంస్థల్లో ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును శాసనసభలో పెట్టి ఏకగ్రీవంగా ఆమోదింపజేసి గవర్నర్ కు పంపినట్లు తెలిపారు. ఆ బిల్లు గవర్నర్ నుంచి రాష్ట్రపతి వద్దకు వెళ్ళిందని, ప్రస్తుతం రాష్ట్రపతి వద్ద 5 నెలలుగా పెండింగ్‌లో ఉందన్నారు. మరోవైపు సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ఎలాంటి న్యాయపరమైన వివాదాలు ఏర్పడకుండా సలహా ఇవ్వాల్సిందిగా అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి అభిప్రాయం కోరారు. ఇదే అంశంపై సోమవారం జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, ఢిల్లీలో ప్రముఖ న్యాయ కోవిదుల అభిప్రాయం తీసుకోవాలని మంత్రుల కమిటీ నిర్ణయించింది. ఈ సమావేశంలో మంత్రులు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. కమిటీ సభ్యుడైన మంత్రి పొన్నం ప్రభాకర్ ఫోన్‌లో అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డికి తన అభిప్రాయాన్ని తెలియజేశారు.

# నేడు ఢిల్లీకి సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు24:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సోమవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై న్యాయ నిపుణులతో భేటీ కానున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అలాగే,ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసుల అంశంపైనా చర్చించనున్నట్లు వెల్లడించాయి. ఏఐసీసీ ముఖ్యనేతలను సీఎం రేవంత్ కలిసే అవకాశాలు ఉన్నాయి. తర్వాత మంగళవారం ఢిల్లీ నుంచి బిహార్ వెళ్లనున్నారు సీఎం రేవంత్‌రెడ్డి. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పాద యాత్రలో సీఎం పాల్గొంటారు. కాగా, సోమవారం ఉదయం ఓయులో జరిగే కార్యక్రమంలో సిఎం పాల్గొంటారు. తర్వాతే ఆయన ఢిల్లీకి వెళ్తారు.

# మెడికల్ హబ్‌గా రాష్ట్రం

>> అంతర్జాయతీయ కంపెనీలు పనిచేసు న్నాయి,డయాగ్నస్టిక్ పరికరాలు, ఇమేజింగ్ టెక్నాలజీలు, ఇంప్లాంట్లు, శస్త్రచికిత్స పరికరాలు, డిజిటల్ హెల్త్ సొల్యూషన్స్‌లో పెట్టుబడులు వస్తున్నాయన్నారు..స్థానిక స్టార్టప్‌లు, ఎంఎస్‌ఎంఈలు గ్లోబల్ కంపెనీలతో పాటు కలిసి పనిచేస్తున్నాయన్నారు. సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం కోసం పరిశోధనలు నిర్వహిస్తున్న డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి, ఎఐజి హాస్పిటల్‌ను అభినందిస్తున్నట్లు తెలిపారు.చాలా ఏళ్లుగా మన మేథస్సుని ఇతర దేశాల ప్రజల కోసం ఉపయోగిస్తు న్నామన్నారు. ఇప్పుడు మన ప్రజల మంచి కోసం పనిచేయాల్సిన సమయం వచ్చిందన్నారు. మా ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు ఉంటుందని, అవసరమైన సహకారాన్ని అందిస్తామన్నారు. డేటా గోప్యతను పాటిస్తూనే ఇక్కడ ప్రజల వైద్యసహాయం కోసం అవసరమైన డేటాను అందజేస్తామన్నారు.స్కిల్ యూనివర్సిటీ, కార్పొరేషన్లు, విద్యా సంస్థలు, రీసెర్చ్ సెంటర్స్‌తో అనుసంధానం చేస్తామన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో అనిశ్చిత పరిస్థితులు కనిపిస్తున్నాయి, పన్నులు, యుద్ధాలు,వాణిజ్య పరమైన అడ్డంకులు వంటివి ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమయంలో ఆవిష్కరణలు చేయడానికి సరైన వేదిక తెలంగాణ, మానవాళిని మరింత ఆరోగ్యంగా మార్చడానికి మనందరం ప్రయత్నం చేద్దామన్నారు. బయోటెక్నాలజీ,ఫార్మా, మెడికల్ టెక్నాలజీ రంగాల్లో నూతన ఆవిష్కరణలకు అవసరమైన మద్దతును ఇవ్వడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తుందని సిఎం పేర్కొన్నారు. బయోడిజైన్ విధానం ఉపయోగించి వైద్య ఉత్పత్తుల ఆవిష్కరణల విషయంలో ప్రభుత్వం అన్ని విధాలుగా మద్దతునిస్తుందని చెప్పారు. మాన్యుఫాక్చరింగ్ స్థాయి నుంచి నూతన ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందడం శుభసూచకమని అన్నారు. భారతదేశంలో ఆరోగ్య సంరక్షణ ఎదరువుతున్న సవాళ్లను అధిగమించడానికి స్వదేశీ ఆవిష్కరణలు ఎంతో అవసరం,అలాంటి పరిశోధనలకు,ఆవిష్కరణల కోసం తెలంగాణ మద్దతు ఇవ్వడమే కాకుండా వైద్య డేటాను డేటా గోప్యతా ప్రమాణాలకు లోబడి అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ సమ్మిట్‌లో డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డితో పాటు బయోడిజైన్ ఇన్నోవేషన్ సమ్మిట్ చైర్మన్ డాక్టర్ రాజేశ్ కలపల,హాస్పిటల్ డైరెక్టర్ జీవిరావు,సెంటర్ ఫర్ బయోడిజైన్(స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ)డైరెక్టర్ డాక్టర్ అనురాగ్ మైరల్‌లతో పాటు వైద్య పరిశోధనా రంగంలో వివిధ దేశాలకు చెందిన వైద్య నిపుణులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

25-08-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
విదియ మ.12.38
ఉత్తరఫల్గుణి రా.3.50
వర్జ్యం : మ.1.01-2.46
దు.మ.12.35-1.25, 2) మ.3.05-3.55
శుభసమయం:ఉ.9.30-10.15, సా.4.45-5.30
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం** : శుభకార్యాలలో చురుకు పాల్గొని, బంధువర్గంలో కేంద్రబిందువు అవుతారు.

**వృషభం:** స్నేహితులకు మీవంతు సహాయ సహకారాలు అందిస్తారు. నేలవిడిచి సాముచేయరు.

**మిథునం:**నిర్మాణాత్మక, వ్యూహాత్మక విషయ వ్యవహారాలలో ఆచితూచి నిర్ణయాలు తీసుకోండి.

**కర్కాటకం:**అభివృద్ధి కార్యక్రమాలు వెనువెంటనే కాక భవిష్యత్తులో కలిసి వస్తాయి.

**సింహం:**బ్యాంకు లావాదేవీలు అనుకూలిస్తాయి. ఉద్యోగాల వేటలో సఫలత సాధిస్తారు.

**కన్య** : ఏదయినా ఒక అద్భుత కార్యక్రమం చేసి నలుగురిలో అఖండ ఖ్యాతిని ఆర్జించాలనే కోరిక బలపడుతుంది.

**తుల** : బంధువలతో సంబంధ బాంధవ్యాలు పూర్వం కన్నా మెరుగవుతాయి.

**వృశ్చికం:**ముఖ్యమైన విషయాలలో తొందర పడకుండా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం ఎంతో ఉత్తమం.

**ధనుస్సు:** కుటుంబసభ్యుల పురోభివృద్ధికి విశేషంగా కృషిచేస్తారు. వృత్తి వ్యాపారాలలో స్వల్ప మార్పులు.

**మకరం:** ఎదురుచూడని అవకాశాలు కలిసి వస్తాయి వాటిని నేర్పుగా ఉపయోగించి లాభపడండి.

**కుంభం:** సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి.

**మీనం** : ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. పెట్టుబడుల విషయంలో నిదానం అవసరం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# నరికి మూసీలో పడేసిన కసాయి

>> మల్కాజిగిరి డిసిపి పద్మజ ఆదివారం మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. డిసిపి తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా కామారెడ్డిగూడకు చెందిన స్వాతి(21), మహేందర్‌రెడ్డి(27) ఏడాదిన్నర క్రితం కులాంతర వివాహం చేసుకున్నారు. 25 రోజుల క్రితమే హైదరాబాద్‌కు వచ్చి బోడుప్పల్‌లోని ఈస్ట్ బాలాజీనగర్‌హిల్స్‌లో నివాసముంటున్నారు. మహేందర్‌రెడ్డి ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేస్తుండగా.. స్వాతి పంజాగుట్టలోని ఓ కాల్ సెంటర్‌లో పనిచేసేది. కానీ, స్వాతిపై అనుమానంతో జాబ్ మానిపించాడు.

**పెళ్లైన రెండు నెలల నుంచే గొడవలు..**

ప్రేమించి పెద్దలను ఎదిరించి మరీ వివాహం చేసుకున్న జంట పెళ్లైన రెండు, మూడు నెలల నుంచే చిన్న చిన్న విషయాలకే గొడవపడేవాడు. ఒకసారి వీరి పంచాయతీ పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లగా కామారెడ్డిగూడలోనే మహేందర్‌రెడ్డిపై 498ఎ కేసు నమోదైంది. తర్వాత పోలీసుల కౌన్సిలింగ్, పెద్దల సమక్షంలో రాజీపడ్డారు. ఈ క్రమంలో స్వాతిపై ఉన్న అనుమానంతోనే మొదటిసారి గర్భం దాల్చితే తీయించాడు. రెండోసారి గర్భం దాల్చినప్పుడు స్వాతిపై ఉన్న అనుమానం మహేందర్‌రెడ్డికి పెను భూతమైంది. స్వాతి గర్భవతి కాబట్టి మెడికల్ చెకప్‌కు తీసుకెళ్లమని, అలాగే కొద్దిరోజులు ఉండడానికి తన పుట్టింటికి పంపించమని అడిగింది. అయితే ఈ విషయంలో మళ్లీ ఇద్దరి మధ్య గొడవమొదలైంది. దీంతో స్వాతిని హత్య చేయాలని ప్లాన్ వేశాడు. హత్యకు ముందే బోడుప్పల్‌లో హాక్సా బ్లేడ్ కొనుగోలు చేశాడు. అవకాశం కోసం ఎదురుచూసిన మహేందర్‌రెడ్డికి శనివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో ఇంటి యజమానులు బయటకు వెళ్లడంతో పథకం ప్రకారం



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న మల్కాజిగిరి డిసిపి పద్మజ

గొడవ మొదలెట్టాడు. ఇరువురి ఘర్షణలో మహేందర్‌రెడ్డి భార్య స్వాతిని కొట్టడంతో ఆమె స్పృహ కోల్పోయింది. అనంతరం స్వాతి గొంతు నులిమి హత్య చేశాడు. చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత డెడ్‌బాడీని మాయం చేసేందుకు శతవిధాల ప్రయత్నించాడు.

**శరీరాన్ని ముక్కలు ముక్కలుగా కట్ చేసి..**

ముందే కొనుగోలు చేసిన హాక్సా బ్లేడ్‌తో కాళ్లు, చేతులు, మొండెం ఇతర శరీర భాగాలు ముక్కలు ముక్కలుగా కట్ చేశాడు. శరీర భాగాల్ని కవర్‌లో ప్యాక్ చేసి, మూడుసార్లు వెళ్లి కొద్ది కొద్దిగా ప్రతాపసింగారం వద్ద గల మూసీనదిలో విసిరేశాడు. ఇదంతా కప్పిపుచ్చుకునేందుకు మరదలు చంద్రకళకు ఫోన్ చేసి స్వాతి కనిపించడం లేదని చెప్పాడు. అలాగే మేం బాగానే ఉన్నాం.. భోజనం చేశామని శనివారం రాత్రి కూడా స్వాతి ఫోన్ నుంచి ఆమె తల్లికి మేసేజ్ పంపాడు.
వీళ్లిద్దరు ఎప్పుడు గొడవ పడుతుంటారనే అనుమానంతో అసలు ఏం జరిగిందో చూడాలని చంద్రకళ ఈ విషయాన్ని దిల్‌సుఖ్‌నగర్‌లో ఉంటున్న తన మేనమామ కి చెప్పింది. అతడు మహేందర్‌రెడ్డి ఇంటికి వెళ్లగా అతనికి కూడా భార్య స్వాతి కనిపించడం లేదని చెప్పాడు. దీంతో ఇద్దరూ కలిసి శనివారం రాత్రి ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. బోడుప్పల్ బాలాజీహిల్స్ మేడిపల్లి పీఎస్ పరిధిలోకి వస్తుందని తెలపడంతో ఇద్దరు వెళ్లి అక్కడ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు తీసుకునే క్రమంలో మేడిపల్లి పోలీసులు మహేందర్‌రెడ్డిని పలు మార్లు ప్రశ్నించడంతో.. భార్య స్వాతిని చంపింది తానేనని నేరం అంగీకరించాడు. వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మహేందర్‌రెడ్డి ఇంటికి పోలీసులు వెళ్లి చూడగా స్వాతి మొండెం మాత్రమే మిగిలింది. మొండేనికి డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఫోరెన్సిక్ నిపుణులు, క్లూస్‌టీమ్ సాయంతో ఆధారాలు సేకరించారు.
కేసుకు సంబంధించిన సాంకేతిక ఆధారాలన్నీ పకడ్బందీగా సేకరించిన తర్వాత ఛార్జ్ షీట్ దాఖలు చేస్తామని డిసిపి పద్మజ తెలిపారు. నిందితుడి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన పోలీసులు ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం న్యాయమూర్తి ముందు హాజరుపరిచి ఆయన ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కాగా, కేవలం వారం రోజుల వ్యవధిలోనే నగరంలో అత్యంత దారుణంగా ఇద్దరు మృతిచెందడం తీవ్ర కలకలం రేపుతోంది.

**బాడీపార్ట్‌ల కోసం వెతకడం ఆపేసిన పోలీసులు..**

స్వాతి శరీర భాగాల కోసం జీహెచ్ఎంసీ, ఎన్డీఆర్ఎఫ్ బలగాలు మూసీలో సుమారు 10 కిలోమీటర్ల వరకు వెతికారు. అప్పటికీ ఆమె శరీర భాగాలు దొరకకపోవడంతో గాలింపు నిలిపివేశారు. మూసీలో వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో గాలింపు చర్యలు నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు.

# పరిశ్రమలో వ్యవస్థలను నియంత్రిస్తామంటే సహించం

## సినీ నిర్మాతలు, దర్శకులతో సిఎం రేవంత్‌రెడ్డి సమావేశం



ఆదివారం హైదరాబాద్‌లో సినీ దర్శకులు, నిర్మాతలతో భేటీ అయిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు24:** తెలుగు సినిమా పరిశ్రమ అంతర్జాతీయ స్థాయికి వెళ్లిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. సినిమా పరిశ్రమకు మానిటరింగ్ అవసరమని సూచించారు. పరిశ్రమకు ఏం కావాలో ఒక కొత్త పుస్తకాన్ని రాసుకుందామని చెప్పుకొచ్చారు. పరిశ్రమలో వ్యవస్థలను నియంత్రిస్తామంటే తమ ప్రభుత్వం సహించదని.. అందరూ చట్ట పరిధిలో పని చేయాల్సిందేనని స్పష్టం చేశారు.
ఆదివారం సాయంత్రం జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డిని తెలుగు సినిమా నిర్మాతలు, దర్శకులు కలిశారు. వారితో పాటు సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు ఉన్నారు. నిర్మాతలు అల్లు అరవింద్, డి.సురేష్ బాబు, జెమిని కిరణ్, స్రవంతి రవికిశోర్, నవీన్ ఎర్నేని, వంశీ, బాపినీడు, డీవీవీ దానయ్య, వంశీ, గోపీ, చెరుకూరి సుధాకర్, సాహు, అభిషేక్ అగర్వాల్, విశ్వ ప్రసాద్, అనిల్ సుంకర, శరత్ మరార్, ఎన్వీ ప్రసాద్, ఎస్కేన్, రాధామోహన్, దాము, దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్, బోయపాటి శ్రీనివాస్, సందీప్ రెడ్డి వంగా, వంశీ పైడిపల్లి, అనిల్ రావిపూడి, వెంకీ కుడుముల తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.
సినిమా పరిశ్రమలో చక్కటి పని వాతావరణం ఉండాలి. సినిమా కార్మికులను కూడా పిలిచి మాట్లాడుతా. ప్రభుత్వం నుంచి సినిమా పరిశ్రమకు పూర్తి సహకారం ఉంటుంది. పరిశ్రమలోకి కొత్తగా వచ్చే వారికి నైపుణ్యాలు పెంచేలా చర్యలు తీసుకోవాలి. పరిశ్రమలో వివిధ అంశాల్లో నైపుణ్యాల పెంపు కోసం ఒక కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. స్కిల్ యూనివర్సిటీలో సినిమా పరిశ్రమ కోసం కావాల్సిన ఏర్పాట్లు చేస్తాం. తెలంగాణలో ముఖ్యమైన పరిశ్రమ సినిమా పరిశ్రమ. పరిశ్రమలో వివాదం వద్దనే కార్మికుల సమ్మె విరమణకు చొరవ చూపించాను.
పరిశ్రమలో నిర్మాతలు, కార్మికుల విభాగంలో సంస్కరణలు అవసరం. కార్మికుల విషయంలో నిర్మాతలు మానవత్వంతో వ్యవహరించాలి. నిర్మాతలు, కార్మికులు, ప్రభుత్వం కలిసి ఒక పాలసీ తీసుకువస్తే బాగుంటుంది. సినీ కార్మికులను, నిర్మాతలను కూడా మా ప్రభుత్వం కాపాడుకుంటుంది. పరిశ్రమ విషయంలో నేను న్యూట్రల్‌గా ఉంటా. హైదరాబాద్‌లో అంతర్జాతీయ సినిమాల చిత్రీకరణ కూడా జరుగుతోంది. తెలుగు సినిమాల చిత్రీకరణ ఎక్కువగా తెలంగాణ రాష్ట్రంలోనే జరిగేలా చూడాలి. అంతర్జాతీయ స్థాయిలో తెలుగు సినిమా పరిశ్రమను ఉంచడమే నా ధ్యేయం అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# అటకెక్కిన 'మన ఊరు- మన బడి'!

>> స్కూల్స్‌లో విద్యార్థుల సంఖ్యను పెంచడం ప్రధాన లక్ష్యం.మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా పాఠశాల భవనాలను ఆధునీకరించడం, తరగతి గదులను మరమ్మతు చేయడం, మరుగుదొడ్లు, త్రాగునీటి సదుపాయాలను కల్పించడం వంటివి చేస్తారు. నాణ్యమైన విద్యను అందించడంలో భాగంగా, ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టడం, డిజిటల్ విద్యను అందించడం,బోధనాభ్యసన సామగ్రిని సమకూర్చడం వంటివి చేస్తారు. విద్యార్థుల నమోదును పెంచడంలో భాగంగా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి అవసరమైన చర్యలు తీసుకుంటారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేందుకే తెలంగాణ ప్రభుత్వం 2021 బడ్జెట్‌లో మన ఊరు- మన బడి, మన బస్తీ- మన బడి పథకాన్ని ఆవిష్కరించింది. 2022 మార్చి 8న వనపర్తి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వేదికగా అప్పటి ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు చేతుల మీదుగా ఈ పథకాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం కింద నడుస్తోన్న మొత్తం పాఠశాలల సంఖ్య 29,952 కాగా.. వాటిలో 26,065 పాఠశాలలు ప్రభుత్వ, స్థానిక సంస్థల కింద నడుస్తున్నాయి. ఈ పాఠశాలలను ఆధునీకరించేందుకు ఈ పథకాన్ని అమలు చేయనుంది. రాష్ట్రంలోని 26,065 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో చదువుతున్న 19,84,167 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య, నమోదు, హాజరు, కొనసాగింపుతోపాటు దశలవారీగా డిజిటల్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపర్చేందుకు మౌలిక వసతులను కల్పించనుంది.
ఇందుకోసం రూ. 7,289 కోట్లతో 'మన ఊరు-మన బడి' ప్రణాళికకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 2021-22 విద్యా సంవత్సరంలో మొదటి దశలో 65 శాతం (సుమారు 13 లక్షల మంది) విద్యార్థులను కవర్ చేసేలా మొత్తం పాఠశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థుల నమోదు ఎక్కువగా ఉన్న 9,123 (35 శాతం) పాఠశాలల్లో ఈ పథకం ప్రారంభించబడింది. మొదటి దశలో దాదాపు రూ.3,497.62 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించింది.
ఈ పథకానికి నిధుల సమీకరణను ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నియోజకవర్గ అభివృద్ధి నిధుల్లో నుంచి 40 శాతం నిధులను.. పంచాయితీరాజ్, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌లలో కొంత శాతం నిధులను ఈ పథకం కోసం కేటాయించాలని నిర్ణయించారు. కార్పోరేట్ కంపెనీల నుండి విరాళాలు, కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) ప్రోగ్రామ్‌ల ద్వారా నిధులను సమీకరించాలని నిర్ణయించారు.

**ఇప్పటికీ పెండింగ్‌లో మన ఊరు- మన బడి బిల్లులు రూ. 380 కోట్లు**

గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన మన ఊరు- మన బడి పథకానికి సంబంధించి ఇప్పటికీ పెండింగ్ బిల్లులు ఉన్నాయి. సుమారు రూ.380 కోట్ల వరకు ఇప్పటికీ పెండింగ్ బిల్లులున్నాయని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. మన ఊరు- మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ నిర్మాణ, మరమ్మత్తు పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు తమ పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న సచివాలయంలో ధర్నా చేపట్టారు. సచివాలయంలోని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కార్యాలయం ముందు ధర్నా చేసి తమ పెండింగ్ బిల్లులను విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం నుంచి రూ. 380 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రం సమర్పించారు. తెలంగాణలో 2023 నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత.. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, అభివృద్ధి కోసం "అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ" (ఏఏపిసి)లను ఏర్పాటు చేసింది.
మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) సభ్యులతో కూడిన ఈ కమిటీలు, పాఠశాలల మౌలిక సదుపాయాలు, మరమ్మతులు, ఇతర అత్యవసర పనులను నిర్వహించడానికి బాధ్యత వహిస్తాయి, తద్వారా పాఠశాలల నిర్వహణలో మహిళా సాధికారతను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# రాజీనామా చేసి గెలవాలి..

>> దమ్ముంటే ఉప ఎన్నికల్లో పోటీ చేసి తిరిగి గెలవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి తన 20 నెలల పాలనలో తెలంగాణ ప్రజలకు చేసిన మంచిని చూపించి, ఉప ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ఓటమి భయం పట్టుకుందని ఆయన వ్యాఖ్యానించారు. ఆదివారం శేరిలింగంపల్లి నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. నాయకులు మోసం చేసినా, కార్యకర్తలు మాత్రం గులాబీ జెండాను గుండెల్లో పెట్టుకున్నారని కేటీఆర్ ప్రశంసించారు. కాంగ్రెస్ నాయకుల బ్లాక్‌మెయిల్ దందాల కోసమే హైడ్రా పనిచేస్తుందని ఆరోపించారు. హైడ్రా అరాచకాలతోనే హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పూర్తిగా కుప్పకూలిందని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసిన అప్పుల కంటే ఎక్కువ అప్పులను కేవలం 20 నెలల కాలంలోనే చేసిన రేవంత్ రెడ్డికి తాను చేసిన అభివృద్ధిని చెప్పుకునే దమ్ముందా అని కేటీఆర్ నిలదీశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న పదేళ్ల కాలంలో ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమంతో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోయిందని కేటీఆర్ అన్నారు. 2014లో గ్రేటర్ హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌కు కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉండేవారని గుర్తు చేశారు. కేసీఆర్ సీఎం అయిన ఆరు నెలల్లోనే తీవ్ర విద్యుత్ సమస్యను పూర్తిగా పరిష్కరించి, ఇళ్లలో, షాపుల్లో కనిపించే ఇన్వర్టర్లు, జనరేటర్లను కనిపించకుండా చేశారని చెప్పారు. హైదరాబాద్‌ను కులం, మతం, ప్రాంతం పేరు మీద రాజకీయాలు చేయకుండా, అన్నదమ్ములుగా ఏ పంచాయతీ లేకుండా బ్రహ్మాండంగా అభివృద్ధి చేసి చూపించామని అన్నారు. హిందూ ఆడబిడ్డలకు దసరా కానుకలు, ముస్లిం పేదలకు రంజాన్ తోఫాలు, క్రైస్తవులకు క్రిస్మస్ గిఫ్టులు ఇచ్చి పండుగలకు ప్రాధాన్యతనిచ్చినట్టు తెలిపారు.
తెలంగాణకు గుండెకాయగా హైదరాబాద్‌ను కేసీఆర్ మార్చారని, అందుకే 2023లో ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా కాంగ్రెస్‌కు రాకుండా, మొత్తం గులాబీ జెండాకే నగర ప్రజలు ఓట్లు వేశారని అన్నారు. శేరిలింగంపల్లితో పాటు పార్టీ మారిన మిగతా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ప్రజల కోసం కాకుండా, తమ సొంత లాభం కోసమే కాంగ్రెస్‌లోకి వెళ్లారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగానే ప్రజలకు మంచి చేసి ఉంటే, ఉప ఎన్నికల్లో పోటీ చేసి మళ్లీ గెలిచి చూపించాలని సవాల్ విసిరారు.





ఆదివారం హైదరాబాద్‌లో సురవరం భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఏపి సిఎం చంద్రబాబు, డి రాజా, కెటిఆర్, తలసాని, వినోద్ తదితరులు

# సురవరానికి కన్నీటి వీడ్కోలు

**ఘనంగా నివాళులర్పించిన సిఎం రేవంత్, డిసిఎం భట్టి, ఏపి సిఎం చంద్రబాబు, సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కెటిఆర్ ప్రభృతులు, అధికార లాంఛనాలతో అంతిమయాత్ర, భౌతికకాయం గాంధీ వైద్యకళాశాలకు అప్పగింత**




సురవరం సుధాకర్‌రెడ్డి భౌతికకాయాన్ని గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు. నివాళి అర్పిస్తున్న పోలీసులు

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 24:** కమ్యూనిస్టు దిగ్గజం, భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డికి తెలంగాణ, ఏపి ముఖ్యమంత్రులతో పాటు పలువురు రాజకీయ పార్టీల నేతలు నివాళులర్పించారు. తెలంగాణరాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, మాజీ ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ధనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, డాక్టర్ కె.కేశవరావు, సుప్రీంకోర్ట్ మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ, ఎంపిలు అయోధ్య రాంరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర తదితరులు పూలమాలతో సుధాకర్ రెడ్డికి నివాళులర్పించారు. గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సురవరం సుధాకర్ రెడ్డి శుక్రవారం రాత్రి హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. మరణించిన అనంతరం సురవరం మృతదేహాన్ని శనివారం గచ్చిబౌలిలోని ఆయన నివాసంలో ఉంచగా.. ఆదివారం ప్రజల సందర్శనార్థం పార్టీ రాష్ట్రకార్యాలయమైన మగ్దూం భవన్‌కి ఉదయం 10 గంటలకు తీసుకొచ్చారు. భౌతిక కాయాన్ని పార్టీ ఆఫీసుకి తీసుకొచ్చిన అనంతరం పలువురు రాజకీయ నేతలు, పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. మగ్దూం భవన్ వద్ద గౌరవ సూచకంగా పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. నివాళుల అనంతరం ప్రభుత్వ అధికారిక లాంఛనలు పూర్తయిన తరువాత గాంధీ మెడికల్ కాలేజీ వరకు అంతిమ యాత్ర కొనసాగింది. అంతిమయాత్ర ముగిసిన అనంతరం సురవరం భౌతికకాయాన్ని మెడికల్ కళాశాలకు ఆయన కుటుంబసభ్యులు అప్పగించారు. అంతిమయాత్ర పొడవునా కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి అమర్ రహే అంటూ సిపిఐ కార్యకర్తలు, నాయకులు నినాదాలు చేశారు. అంతిమ యాత్రలో సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, జాతీయ కార్యదర్శి నారాయణ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

**రాజీపడని సిద్ధాంతాలతో రాజకీయంగా ఎదిగిన నేత: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి:** సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి పార్థివ దేహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం ముగ్దూం భవన్‌లో పూలమాలతో శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పేదలు, బహుజనుల కోసం పోరాడిన గొప్ప నేత సురవరం సుధాకర్ రెడ్డి అన్నారు. రాజీపడని సిద్ధాంతాలతో రాజకీయాల్లో ఎదిగిన నేత సురవరం అన్నారు. విద్యార్థి దశ నుంచి జాతీయస్థాయి నేతగా ఎదిగారని వెల్లడించారు. పాలమూరు జిల్లాకు వన్నె తెచ్చిన గొప్పనేతల్లో సురవరం ఒకరన్నారు. అధికారం ఉన్నా లేకున్నా తన సిద్ధాంతాలను ఎప్పుడూ వీడలేదన్నారు. సురవరం కుటుంబానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. ఆయన జ్ఞాపకార్థం ప్రభుత్వం ఏదైనా మంచి కార్యక్రమం చేపడుతుందని, దీనిపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. తమ ప్రభుత్వం గొప్ప నేతల పేర్లను పలు సంస్థలకు పెట్టిందని, అదే తరహాలో సుధాకర్ రెడ్డి సేవలనుఅందరూ స్మరించుకునేలా చేస్తామన్నారు.

**గతంలో కలిసి పోరాటాలు చేశాం: ఏపి సిఎం చంద్రబాబు :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సురవరం సుధాకర్ రెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించారు. సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రజల కోసం చేసిన సేవలను చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. సుధాకర్ రెడ్డితో తనకు సుదీర్ఘ రాజకీయ సంబంధాలు ఉన్నాయన్నారు. గతంలో కలిసి పోరాటాలుచేసినట్లు గుర్తు చేశారు. సురవరం దేశ రాజకీయాల్లోనూ ప్రముఖపాత్ర పోషించారన్నారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా సేవలందించారన్నారు. ఢిల్లీలో వివిధ ప్రభుత్వాలు ఏర్పాటు చేసినప్పుడు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేసిన ఉద్యమంలో, ఇతర అనేక సందర్భాల్లో కలిసి పోరాడినట్లు తెలిపారు. తనంటే సుధాకర్ రెడ్డికి ప్రత్యేక అభిమానం ఉండేదని, ఆయన్ను జీవితంలో ఎప్పుడూ మరచిపోలేనన్నారు.

**కెసిఆర్ వారితో ఉన్నఅనుభవాలను గుర్తు చేసుకున్నారు: కెటిఆర్:** సురవరంభౌతికకాయానికి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో తనవంతు పాత్ర పోషించి చిరస్మరణీయ ముద్ర వేసుకున్న సురవరం సుధాకర్ రెడ్డి మరణం తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. విద్యార్థినాయకుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి ఒక జాతీయ పార్టీకి ప్రధాన కార్య దర్శిగా ఏడేండ్ల పాటు బాధ్యతలు నిర్వహించడమంటేసామాన్యవిషయం కాదన్నారు. తెలంగాణ ఏర్పాటుకు సీపీఐ మద్దతులో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. జాతీయస్థాయిలోతెలంగాణకు మద్దతు కూడగట్టడంలో ఆయనతో కలిసి పనిచేసే అవకాశం బీఆర్ఎస్‌పార్టీకి దక్కిందని కేసీఆర్‌వారితోఉన్నఅనుభవాలను గుర్తుచేసుకున్నారని, వారితరపునసురవరంకి నివాళులర్పిస్తున్నామని చెప్పారు. తతత



ఆదివారం సురవరం భౌతిక కాయం వద్ద నివాళి అర్పిస్తున్న హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

## ఆదివాసీ గిరిజన బాలికపై సామూహిక అత్యాచారం?

### ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన
### సంరక్షణ కేంద్రానికి బాలిక తరలింపు

**కొత్తగూడెం క్రైం, ఆగస్టు 24 ప్రభాతవార్త:** ఆటో డ్రైవర్‌ను నమ్మిన ఆ మైనర్ బాలిక మోసపోయింది. ఆదివాసీ బాలికపై సామూహిక అత్యాచారం జరిగిన సంఘటన మూడు రోజుల తర్వాత ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి... చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా దోర్నపాల్ సమీపంలోని బోదగూడెం గ్రామానికి చెందిన 17 సంవత్సరాల మైనర్ బాలిక బోదగూడెం నుంచి కుంటకు బస్సులో రాగా అక్కడ నుంచి శుక్రవాసం సాయంత్రం ఏపీలోని ఏడుగురాళ్లపల్లి సమీపంలో గొల్లగుప్పలో ఉన్న తన పిన్ని ఇంటికి వచ్చింది. తర్వాత తిరుగు ప్రయాణంలో కుంట వద్ద ఆటో ఎక్కింది. ఏడుగురాళ్లపల్లి సమీపంలోని గొల్లగుప్ప క్రాస్‌రోడ్‌లో దింపాలని అక్కడ మా వాళ్లు ఎవరైనా ఉంటారని అక్కడి నుంచి గొల్లగుప్పకు వెళ్తానని బాలిక చెప్పి ఆటో ఎక్కింది. ఈ క్రమంలో ఆటో డ్రైవర్లు మార్గమధ్యలో మైనర్ బాలికకు ఆటో డ్రైవర్లు కొంత దూరం అడవిలోకి తీసుకెళ్లి తనను మద్యం సేవించాలని బలవంతం చేయగా తాను తాగనని నిరాకరించడంతో వారు చేతులు, కాళ్లు పట్టుకొని బలవంతంగా తాగించారని, అప్పుడు తాను మత్తులోకి జారుకున్నానని, తనకు తర్వాత ఏం జరిగిందో కూడా గుర్తు లేదని సదరు బాలిక తెలిపింది. ఆ తర్వాత తాను పెద్దమ్మతల్లి గుడి వద్దకు ఎలా వచ్చిందో కూడా గుర్తు లేదని చెప్తుంది. శుక్రవారం రాత్రి సంఘటన జరిగిన తర్వాత పాల్వంచ పెద్దమ్మతల్లి ఆలయం ముందు డివైడర్‌లో నీరసంగా ఉన్న బాలికను చూసి రాత్రి సమయంలో విధులు నిర్వహించే వాచ్‌మెన్ గమనించి ఆమెను ఆలయ ఆవరణలోకి తీసుకొచ్చి అక్కడ ఆశ్రయం కల్పించారు. శనివారం ఉదయం ఆమె ఒంటిపై ఉన్న గాయాలు, చిరిగిన దుస్తులను చూసి వెంటనే ఇంటికెళ్లి తన కుమార్తె దుస్తులు తీసుకొచ్చి ఉదయం పారిశుధ్య పనులు చేయడానికి వచ్చిన మహిళలతో ఆమెకు దుస్తులు మార్పించారు. అక్కడి మహిళలు ఆమెను అడుగగా తనకు జరిగిన సంగతిని తెలుపుతుంది. దీంతో శనివారం మధ్యాహ్నం పాల్వంచ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి చికిత్స అందించారు. ఆమె తీరును చూసి చైల్డ్ కేర్ సెంటర్‌కు ఫోన్ చేయగా అక్కడి నుంచి సఖి సెంటర్‌కు పంపించారు. సదరు బాలిక తాను ఎక్కడి నుంచి వచ్చింది... ఎక్కడికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ఏం జరిగిందో విషయాలను చెప్తుంది కానీ తనపై జరిగిన అఘాయిత్యం తనకు గుర్తు లేదని, తనను బలవంతంగా మద్యం తాగించారని, ఆ తర్వాత తనకు ఏం జరిగిందో తెలియని, కళ్లు తెరిచి చూసే సరికి ఇక్కడ ఉన్నానని చెప్తుంది. దీనిపై పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలుస్తోంది.

ఈ విషయమై పాల్వంచ డీఎస్పీని వివరణ కోరగా మెడికల్ టెస్టు చేసిన తర్వాత కేసు నమోదు చేస్తామని తెలిపారు.

## సెప్టెంబరు 25న రామగుండం థర్మల్ కేంద్రం ఎన్నికలు

### నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త:** రామగుండం నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ)లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నగారా మోగింది. సెప్టెంబరు 25న గుర్తింపు యూనియన్ ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్, ఎన్టీపీసీ దక్షిణ రీజియన్ సీజీఎం సూర్యనారాయణ్ పాణిగ్రహి, ఎన్నికల అధికారి, రామగుండం ప్రాజెక్టు ఏజీఎం విజయ్ కుమార్ సిక్దర్ వెల్లడించారు. ఈ మేరకు దీనికి సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ ఎన్నికల నిమిత్తం ఇదే నెల 30వ తేదీ లోగా ఎన్టీపీసీలోని ప్రాతినిధ్య కార్మిక సంఘాలు తమ రిజిస్ట్రేషన్ పత్రాలు, వార్షిక నివేదికలను సమర్పించాలని వెల్లడించారు. సెప్టెంబరు 25న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం) ద్వారా పోలింగ్ నిర్వహించనున్నారు. అనంతరం అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు ఉంటుంది. గుర్తింపు సంఘం ఎన్నికల ఫలితాల ఆధారంగా 2 నేషనల్ బైపార్టియేట్ కమిటీ(ఎన్‌బిసి) సభ్యులుగా అవకాశముంటుంది. 60 శాతంకుపైగా ఓట్లు నమోదు చేసి విజయ సాధించిన యూనియన్ లోని ఇద్దరు సభ్యులకు ఎన్‌బిసిలో ప్రాతినిధ్యం కల్పిస్తారు. 60 శాతం కన్నా తక్కువ ఓట్లతో గెలిచిన సంఘానికి ఒకటి, రెండో స్థానంలో నిలిచిన యూనియన్‌కు మరో ఎన్‌బిసి సభ్యత్వం లభిస్తుంది. కాగా మూడేళ్లకు ఒకసారి జరిగే ఎన్టీపీసీ గుర్తింపు సంఘం ఎన్నికలకు సంబంధించి 2022 సెప్టెంబరు 19న ఎన్నికలు జరిగాయి.

## కేంద్రం సరఫరా చేయకపోవడంతోనే కొరత

### 2.64 లక్షల టన్నుల యూరియా లోటు: వ్యవసాయ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త:** కేంద్రం రాష్ట్రానికి కేటాయించిన యూరియాను సరఫరా చేయక పోవడం వల్లే తెలంగాణలో ఆ ఎరువుకు కొరత ఏర్పడిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో కేంద్రం తెలంగాణకు ఈ వానాకాలం సాగు నిమిత్తం 9.80 లక్షల టన్నుల యూరియా కేటాయింపులు చేసిందన్నారు. ఇందులో ఆ నెలాఖరు నాటికి 8.30 లక్షల టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉందని తెలిపారు. అయితే ఇప్పటి వరకూ రాష్ట్రానికి 5.66లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా చేసిందని చెప్పారు. రాష్ట్రానికి ఇంకా 2.64 లక్షల టన్నుల యూరియా సరఫరా కావాల్సి ఉందని వెల్లడించారు. ఫలితంగా తెలంగాణలో యూరియా కొరత నెలకొందని స్పష్టం చేశారు.

ఈ నెలలో రాష్ట్ర వ్యాప్తంగా యూరియా వినియోగం ఎక్కువగా ఉండటం వల్ల అందుకు తగినట్లుగా సరఫరా లేకపోవడంతోనే రైతులు ఆందోళనగా ఉన్నారన్నారు. అయితే రాష్ట్రంలో యూరియా పక్కదారి పట్టిందని కేంద్ర మంత్రులు చేస్తున్న వ్యాఖ్యలు అర్థ రహితమని వ్యాఖ్యానించారు.




ఆదివారం సోషల్ మీడియా-ఐటి సోషల్ మీడియా వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు

## ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతిని ప్రజలకు తెలియజేయాలి

### సరైన సమాచారం చేరేలా చూడడం మనందరి బాధ్యత

**సోషల్, ఐటి సోషల్ మీడియా వర్క్‌షాప్‌లో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు**

**హైదరాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** సోషల్ మీడియా వారియర్లు ప్రతి ఒక్కరూ పార్టీ కార్యక్రమాలు, పార్టీ సిద్ధాంతం, మోడీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమం ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు తెలిపారు. ఆదివారం సోషల్ మీడియా-ఐటి సోషల్ మీడియా వర్క్‌షాప్‌లో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి గురించి ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీ తరఫున వచ్చిన సమాచారాన్ని పంచాలి, రీట్వీట్ చేయాలని, ఇలా చేస్తేనే మన సందేశం ప్రతి ఇంటికి చేరుతుందని, మన బలం పెరుగుతుందన్నారు. సోషల్ మీడియా, యూట్యూబ్ వేదికలను ఉపయోగించి తప్పుడు వార్తలు ప్రచారం చేయడం, పార్టీ కార్యకర్తల్లో విభేదాలు రేపే ప్రయత్నం చేయడం జరగకూడదన్నారు. అలాంటి చర్యలు ఎవరు చేసినా, చేయించినా, పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని, తప్పనిసరిగా క్రమశిక్షణా చర్యలు తీసుకుంటుందన్నారు. మనం పోస్ట్ చేసే ప్రతి విషయం ఎక్కువ మందికి చేరేలా అందరూ రీట్వీట్ చేయడం, షేర్ చేయడం తప్పనిసరి. ఇటీవల కొన్ని యూట్యూబ్ వీడియోలకు తప్పుదారి పట్టించే, ఆకర్షణీయంగా కనిపించే నెగెటివ్ థంబ్‌నైల్స్ జోడించి ప్రజల్లో మిస్‌ఇన్ఫర్మేషన్ పంచుతున్నారు. ఇలాంటి వాటిని నమ్మరాదు, పంచరాదు.


భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులంతా పార్టీ సిద్ధాంతం, నరేంద్ర మోడీ ప్రభుత్వం చేపడు తున్న అభివృద్ధి - సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలన్నారు. ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిల పదవీకాలం ముగిసినా, 19నెలలుగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తేలికగా తీసుకుంటుందని, స్థానిక సంస్థలు అంటే ఈ ప్రభుత్వానికి చిన్నచూపు అన్నారు. రాజ్యాంగంలోని 73వ, 74వ సవరణల ప్రకారం స్థానిక ఎన్నికలు జరపడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత. కానీ ఓటమి భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలను వాయిదా వేస్తుందన్నారు. అలాగే రైతు భరోసా పేరుతో రూ. 15 వేల చొప్పున ఇస్తామని చెప్పి చివరికి కేవలం రూ. 6 వేలే రెండు విడతల్లో ఇచ్చి ప్రజలను మోసం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యూరియా విషయంలో కావాలనే కృత్రిమ కొరత సృష్టించి, మోదీ ప్రభుత్వాన్ని చెడుగా చూపించే ప్రయత్నం చేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతుల పక్షాన నిలిచి రైతు సంక్షేమం కోసం అనేక చారిత్రక నిర్ణయాలు తీసుకుందన్నారు. ఎంపి డా.లక్ష్మణ్ మాట్లాడుతూ దేశమంతా ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంవైపుచూస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి రోజురోజుకు బలపడుతుం దన్నారు.

### నేడు నిజామాబాద్‌లో పర్యటన

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్‌రావు ఆదివారం నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు ఇందలవాయికు చేరుకుంటున్నారు. 10.30 గంటలకు కాళేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తారు దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ర్యాలీలో పాల్గొంటారు. ఈ ర్యాలీ నిజామాబాద్ జిల్లా శ్రీరామ గార్డెన్స్ వరకు జరుగనుంది. ఉదయం 11.30గంటలకు జిల్లా కార్యకర్తల సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. మధ్యాహ్నం 2గంటలకు నూతనంగా నియామం అయిన జిల్లా పదాధికారుల సమావేశంలో పాల్గొంటారని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు.

## గణేశ ఉత్సవాలకు పోలీసు శాఖ ఏర్పాట్లు


### చెరువులు, కుంటల వద్ద ఏర్పాట్లు ముమ్మరం...మట్టి విగ్రహాలకు పెరిగిన డిమాండ్



**హైదరాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గణేశ ఉత్సవాలకు పోలీసు శాఖ భారీ ఏర్పాట్లు చేబట్టింది. ఇతర ప్రాంతాలతో పోలిస్తే గ్రేటర్ పరిధిలో వినాయక ఉత్సవాలు భారీగా జరుగుతుండడం తెలిసిందే. దీని తరువాత ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్, నల్లగొండ జిల్లా లలో ఎక్కువగా ఈ వేడుకలు జరుగుతుంటాయి. ఇప్పటికే గణేష్ విగ్రహాల తయారీకి పేరొందిన ధూల్‌పేట్ సహా ఇతర ప్రాంతా లలో విగ్రహాల కొనుగోలు దారులతో సందడిగా వుండగా మరోవైపు విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ఆయా ప్రాంతాలకు చెందిన నిర్వాహకులు పోలీసుల అనుమతులు పొందుతూ మండపాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇంకోవైపు గణేష్ విగ్రహాల నిమజ్జనం కోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో చెరువులు, కుంటల వద్ద పోలీసు, పౌర విభాగాలు ఏర్పాట్లు చేయ సాగాయి. గణేష్ వేడుకలు మొదలవడానికి ఇంకా మూడురోజులే వుండడం తో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లను మొదలు పెట్టారు. మరోవైపు మట్టి వినాయక విగ్రహాలకు డిమాండ్ బాగా పెరిగింది. విఐపిలు మొదలుకుని సామాన్యుల వరకు అందరు మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు మక్కువ చూపుతున్నారు. రాష్ట్రంలో బొనాల తరువాత అతిపెద్ద పండగా పేరొందిన గణేష్ ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. ఓవైపు పోలీసు, పౌర విభాగాలు మౌలిక వసతులు, బందోబస్తు విషయంలో నిమగ్నమవగా భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సహా ఆయా ప్రాంతాల ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిర్వాహకులు విగ్రహాల ప్రతిష్టకు ముహూర్తాలు ఖరారు చేసుకోసాగారు. ఈ నెల 27వ తేదీన గణేష్ ఉత్సవాలు మొదలవనుండడం తెలిసిందే. 27వ తేదీన ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విగ్రహాల ప్రతిష్ఠ జరిగే వీలుంది. దేశ వ్యాప్తంగా పేరొందిన ఖైరతాబాద్ వినాయకుడు ఇప్పటికే సిద్ధమవగా బుధవారం ఉదయం నాటికి ఈ విగ్రహం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుని పూజలకు సిద్ధమవనున్నాడు. మొత్తం మీద ఎత్తైన విగ్రహాలు రాష్ట్ర వ్యాప్తంగా లక్ష వరకు వుండనుండగా జంట నగరాలు, శివార్లలో 20 వేల వరకు వుండే వీలుంది. తక్కువ ఎత్తులో వున్న విగ్రహాలు మరో రెండు లక్షల వరకు వుండే వీలుంది. దీంతో పాటు చిన్నసైజు విగ్రహాలు, ఇంట్లో ప్రతిష్ఠించే చిన్న విగ్రహాలు మరో లక్ష వరకు వుండే వీలుంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది వినాయక విగ్రహాల ధరలు బాగా పెరిగాయి. విగ్రహాల తయారీకి కావాల్సిన ముడి సరుకుల ధరలు పెరగడం వల్లే విగ్రహాల ధరలు పెంచాల్సి వచ్చిందని తయారీదారులు అంటున్నారు. 20 అడుగుల నుంచి 25 అడుగుల ఎత్తు కలిగిన విగ్రహాల ధరలు రూ.లక్ష నుంచి 2 లక్షల వరకు వుండడం గమనార్హం. నిమజ్జనం నాటికి గ్రేటర్ పరిధిలో 40 వేల మంది పోలీసులు బందోబస్తు కోసం రానుండగా ఇందులో ఇతర రాష్ట్రాల పోలీసులు కూడా వుండనున్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల లో స్థానిక పోలీసులకు తోడుగా స్పెషల్ పోలీసులు, సాయుధ బలగాలను రంగంలో దించనున్నారు.

## నిజామాబాద్ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు24:** ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం రేపింది. జూనియర్, సీనియర్ మెడికోలు ఘర్షణకు దిగారు. ఎమ్‌బిబిఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్న రాహుల్ ను సీనియర్ వేధించారు. ఎదురు తిరిగాడని రాహుల్‌ను సీనియర్లు తీవ్రంగా గాయపరిచారు. కాలేజీ విద్యార్థులు రాహుల్ ను ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స అందిస్తున్నారు. ఆసుపత్రిలో అర్థరాత్రి వరకు పంచాయితీ జరిగింది. రాహుల్ కాలేజీ యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. యాజమాన్యం ర్యాగింగ్ విషయం తెలియకూడదని ప్రయత్నం చేస్తున్నారు. బాధితుడికి న్యాయం చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.



### ఎపి సిఎం సహాయ నిధికి చిరంజీవి రూ.కోటి విరాళం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు24:** ఆంధ్రప్రదేశ్ సిఎం సహాయనిధికి మెగాస్టార్, మాజీ కేంద్ర మంత్రి చిరంజీవి విరాళం అందించారు. హైదరాబాద్‌లో సిఎం చంద్రబాబును ఆదివారం కలిసి రూ.కోటీ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వీరి మధ్య దాదాపు 40 నిమిషాల పాటు చర్చ జరిగింది. సహాయం అందించిన చిరంజీవికి చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. మెగాస్టార్ గతంలోనూ వరదసాయం కింద రూ.కోటీ అందించారని గుర్తు చేశారు.

## ఎసిబి కేసుల్లో నిందితులపై వెంటనే ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వాలి

### ప్రభుత్వానికి ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ డిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎసిబి కేసుల్లో పట్టుబడుతున్న నిందితులపై ప్రభుత్వం వెంటనే ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వాలని, దీనివల్ల అవినీతి అధికారులకు త్వరగా శిక్షలు పడతాయని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి పద్మనాభ రెడ్డి తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వ వైఖరి సవ్యంగా లేదని ఆయన తెలిపారు. ఎసిబి కేసులో అరెస్టవుతున్న వారు బెయిలుపై విడుదలవుతూ తమను ప్రాసిక్యూషన్ చేసే ఉత్తర్వులు రాకుండా సచివాలయంలో పైరవీలు చేసుకుంటూ ఇందులో సఫలం అవుతున్నారని సిఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో పద్మనాభ రెడ్డి తెలిపారు. ఇది సరైన పద్ధతి కాదని ఆయన తెలిపారు. ఎసిబికి పట్టుబడుతున్న వారిపై ప్రాసిక్యూషన్ కోసం ఎసిబి అధికారులు సర్కారును అనుమతి కోరుతుండగా దీనిపై సర్కారు స్పందన సవ్యంగా వుండడం లేదన్నారు. చాలా కేసుల్లో దీర్ఘకాలం పెండింగ్ తరువాత ప్రాసిక్యూషన్‌కు బదులు శాఖపరమైన చర్యలు లేదా కేసు విత్‌డ్రాగా వుంటున్నాయని ఆయన తెలిపారు. ఇలాంటి చర్యల వల్ల ప్రభుత్వ విభాగాల్లో అవినీతి అరికట్టడం ఎలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు. ఈవిషయంలో సర్కారు తన వైఖరిని మార్చుకుని ప్రాసిక్యూషన్‌కుఅనుమతి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

## మరో రూ.2 వేల కోట్ల రుణానికి సర్కార్ ఇండెంట్

### ఈ ఆర్థికంలో రూ.33,900కోట్లకు చేరిన అప్పు

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త :** తెలంగాణ సర్కారు మరో రూ.2 వేల కోట్లు రుణం కావాలని రిజర్వ్ బ్యాంక్‌కు ఇండెంట్ పెట్టింది. దీనికి సంబంధించి ఆమేరకు ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను దాఖలు చేసింది. దీంతో రిజర్వు బ్యాంకు ఈ నెల 26న బహిరంగ మార్కెట్‌లో నిర్వహించే ఈవేలంలో పాల్గొని ఈ మొత్తాన్ని సేకరించనున్నట్లు రిజర్వ్ బ్యాంక్‌కు పెట్టిన ఇండెంట్‌లో పేర్కొంది. ఈ రూ.2 వేల కోట్ల మొత్తానికి గాను మూడు విడతలుగా సెక్యూరిటీ బాండ్లను సమర్పించింది. ఇందులో 26 ఏండ్ల కాలానికి రూ.500 కోట్లు, 28 ఏండ్ల కాలానికి రూ.1,000 కోట్లు, 30 ఏండ్ల కాలపరిమితితో మరో రూ.500 కోట్లు చొప్పన రుణ సమీకరణ కోసం సెక్యూరిటీ బాండ్లు పెట్టింది. ఈ విషయాన్ని రిజర్వ్ బ్యాంక్ ఒక ప్రకటనలో వెల్లడించింది. కాగా ప్రస్తుత 2025-26ఆర్థికసంవత్సరంలో మార్కెట్ రుణాల కింద రూ.54,009 కోట్లు సమీకరిస్తామని రాష్ట్ర సర్కార్ వార్షిక అంచనా బడ్జెట్‌లో ప్రతిపాదించింది. ఇందులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన ఏప్రిల్ నుండి ఐదు నెలలు కూడా గడవకముందే ఈ నెల 12వ తేదీ వరకు రిజర్వ్ బ్యాంక్ నుండి మొత్తం రూ.31,900 కోట్లు రుణాన్ని సమీకరించింది. మళ్లీ తాజాగా ఈ నెల26వ తేదీన తీసుకోనున్న రూ.2 వేల కోట్ల రూపాయలు కలిపితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ రూ. 33,900 కోట్లు మేర రుణం తీసుకున్నట్లు అవుతుంది. ఈ లెక్కన వార్షిక అంచనా బడ్జెట్‌లో ప్రతిపాదించిన రుణసమీకరణలో 60 శాతాన్ని ఇప్పటికే దాటినట్లవుతుంది.

యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ
జాతీయ యువజన అవార్డ్ ఇస్తోంది 2024
అవార్డ్ ముఖ్య ఉద్దేశాలు :
అవార్డ్ వివరణ :
వ్యక్తిగత అవార్డ్-పతకం, ప్రశంసాపత్రం మరియు అవార్డ్ నగదు రూ. 1,00,000/-
దరఖాస్తు చేయటానికి ఆఖరు తేదీ: 31 ఆగస్ట్, 2025
వెబ్‌సైట్ వీక్షించండి : https://awards.gov.in/
cbc 47107/11/0007/2526

వార్త

అనుభవమనేది మనకున్న ఒకే ఒక్క గురువు. మనం జీవితాంతం ఎన్నో విషయాల గూర్చి మాట్లాడవచ్చు. తర్కించవచ్చు. కానీ ఒక సత్యమైన విషయాన్ని అనుభవించేంతవరకు అది అర్థం కాదు.

-స్వామి వివేకానంద

# వీధి కుక్కలకు ముకుతాడు!

వీధికుక్కల బెడదకు సరికొత్త పరిష్కారం దొరికింది. ఢిల్లీ ఎన్సీఆర్ ప్రాంతంలోని వీధి కుక్కలన్నిటినీ షెల్టర్‌లకు తరలించాలన్న తీర్పుపై జంతు ప్రేమింకుల నుంచి వచ్చిన అభ్యంతరాలపై సుప్రీం కోర్టు త్రిసభ్య ధర్మాసనం సమీక్షించి తీర్పును తిరగరాసింది. ఈసారి వీధి కుక్కల బెడద తొలగించుకునేందుకు జాతీయ విధానాన్ని రూపొందించడానికి వీలుగా సర్వోన్నత న్యాయస్థానం పలు మార్గదర్శకాలు సూచించింది. ముందు వీధికుక్కల దాడుల వలన ఢిల్లీ,ఎన్సీఆర్ పరిధిలో రేబిస్ మరణాల సంఖ్య పెరుగుతున్నాయన్న సమాచారాన్ని పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ పార్థీవాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌ల ధర్మాసనం ఎనిమిది వారాల్లోపు వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని ఒక్క కుక్క కూడా రోడ్డు మీద కనపడరాదని ఆదేశించారు. ఈ చర్యలను అడ్డుకునేందుకు ప్రయత్నించే సంస్థలపై కఠిన చర్యలు తప్పవని నిర్దేశించారు. మానవతా దృక్పథమే కాకుండా సాధ్యాసాధ్యాలను కూడా కోర్టు పరిశీలించకపోవడం కరెక్టు కాదని కేంద్ర మాజీ మంత్రి జంతు హక్కుల కార్యకర్త మేనకాగాంధీ భావించారు. ఢిల్లీలో మూడులక్షల కుక్కలుండగా వాటికోసం ఏర్పాటు చేయాల్సిన మూడు వేల షెల్టర్లకు రూ.15వేల కోట్లు ఖర్చు చేసే పరిస్థితి ఢిల్లీ ప్రభుత్వానికి ఉందా? అని ప్రశ్నించారు. ఈ తీర్పు దశాబ్దాలుగా భారతీయులు అనుసరించిన సైన్సు ఆధారిత విధానాల నుంచి వెనుకడుగు వేసినట్లుందని కాంగ్రెస్‌నేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. వీటన్నిటి నేపథ్యంలో మూగజీవుల పట్ల ఎంతో కఠినాత్మక వైఖరి కూడదని జంతు ప్రేమికుల అభ్యర్థనతో త్రిసభ్య ధర్మాసనం పలు మార్గదర్శకాలు సూచించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం కుక్కకాటు వల్ల వచ్చే రేబిస్ మరణాలు ఏటా 18వేల నుంచి20వేలవరకు ఉంటాయి. వీటిలో రేబిస్‌కు గురైన వారి మరణాల వాటాలో భారత్‌లో 38 శాతం. ఒక్క 2024లోనే దేశంలో 37.17లక్షల కుక్కకాటు కేసులు నమోదయ్యాయి. అంటే దేశవ్యాప్తంగా సగటున రోజుకి 10వేల కేసులు. ఇలాంటివి విన్నప్పుడు ఒళ్లు జలదరిస్తుంది. కుక్కకాటుకు గురై చనిపోయిన వారిలో అధికులు చిన్నపిల్లలే. వీధికుక్కల నియంత్రణ పట్ల ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడం వల్లనే ఇలా జరుగుతోందన్నది సర్వవిదితం. స్థానిక సంస్థలు ఈ పద్ధతులను గత కొంత కాలంగా ప్రభుత్వాలు పాటించనందునే ఇప్పుడిలాంటి పరిస్థితి తలెత్తింది. వివిధ రాష్ట్రాల్లో కుక్కల గణాంకాలు చూస్తే బాగా పెరిగిపోయాయి. అప్పుడు నియంత్రణలో నిర్లక్ష్యం వహించి, ఇప్పుడు వీధి కుక్కల వీరంగాన్ని భరించలేని పరిస్థితికి తెచ్చారు. ఈ విషయంలో ప్రభుత్వ యాజమాన్య సంస్థలే బాధ్యత వహించాలి. మూగజీవాల జనన నియంత్రణ (2003) చట్టానికి విరుద్ధమని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ యూనియన్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్, పెటా వంటి సంస్థలు ఆరోపిస్తున్నాయి. వీధికుక్కల బెడద తీవ్రం కావడానికి స్థానిక సంస్థల బాధ్యతారాహిత్యమే ప్రధాన కారణమని సుప్రీం కోర్టు త్రిసభ్య ధర్మాసనంకూడా నిర్ధారించింది. తాజాగా తీరునపలో రేబిస్ వ్యాధికారక శునకాలను మాత్రమే షెల్టర్‌కు తరలించాలని, దేశవ్యాప్తంగా ఇదేవిధానాన్ని అవలంబించాలని ధర్మాసనం పేర్కొంది. జస్టిస్ విక్రమ్‌నాథ్‌నేతృత్వంలో జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజరియాలు వీధికుక్కల బెడదపై సమీక్షించారు. వీధి కుక్కలకు బహిరంగ ప్రదేశాల్లో ఆహారం అందించడం చట్ట విరుద్ధమని ధర్మాసనం స్పష్టంచేసింది. వీధికుక్కల సంరక్షణలో పలు సూచనలు ఆచరణాత్మకంగా పేర్కొన్నారు. వీధి శునకాలకు టీకాలు ఇవ్వడంతోపాటు సంతాననిరోధక చికిత్సల తర్వాతనే బయటకు వదలాలని ఆదేశించింది. దీని వలన వీధికుక్కల వలన ఏర్పడే సమస్యలను తగ్గించవచ్చునని అభిప్రాయపడింది. నియంత్రణ లేకుండా శునకాలకు ఆహారం ఇవ్వడమే జనావాసాల్లో అవాంఛనీయఘటనలకు కారణమని ధర్మాసం అభిప్రాయపడింది. కుక్కలను పెంచుకోవాలనుకునే వారు వాటిని తమ ఇంటిలోనే ఉంచుకొని మునిసిపల్ అధికారుల అనుమతి తీసుకోవాలి. వీధికుక్కలకైతే నిర్దేశిత ఫీడింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి వాటికి ఆహారం అందించే శాశ్వత ప్రాతిపదికన స్థలాలను గుర్తించే బాధ్యత మునిసిపాలిటీలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రతి మునిసిపల్ వార్డులోనూ వీధిశునకాలకు ఆహారం అందించే ఆహార కేంద్రాలు ఏర్పాటు చేసి వాటి బయట బోర్డులు పెట్టాలని ఢిల్లీమునిసిపల్ కార్పొరేషన్‌ను ధర్మాసనం ఆదేశించింది. వీధికుక్కల దత్తత కోసం ప్రత్యేక ప్రమాణాలు పాటించాలని జంతు ప్రేమింకులకు సలహా ఇవ్వడం విశేషం. ఆయా కుక్కల సంరక్షణ బాధ్యత పూర్తిగా వారిపైనే ఉంటుంది. తీర్పుసవరణపై జంతు హక్కుల పరిరక్షణ సంస్థ 'పెటా' ప్రత్యేకించి ' ప్రతి కుక్కకూ ఓ రోజొస్తుంది' అనే వ్యాఖ్యను ప్రకటించారు. దేశంలో జంతు హక్కుల కోసం 'పెటా' పోరాడుతోంది. వీధికుక్కల కోసం మంచినీటిని, మంచి ఆహారాన్నే అందించాలన్న నినాదం వారిది. తాజా తీర్పువలన అటు ప్రజలకు కానీ, వీధికుక్కలకు కానీ ఎలాంటి అపకారం జరుగదని 'పెటా' ప్రకటిస్తోంది. వీధి కుక్కల బెడదను నివారించేందుకు తాము మధ్యంతర ఉత్తర్వులలో పలుసూచనలు, జాగ్రత్తలు వివరించినప్పటికీ ప్రత్యేక జాతీయవిధానం అవశ్యకతఉందని, అందుకోసం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన పశు సంవర్ధక శాఖల కార్యదర్శులకు ఆయా స్థానిక పరిస్థితుల మీద ఆధారపడి సూచనలు చేయమని ధర్మాసనం అవకాశంకల్పిస్తూ నోటీసులు పంపింది. స్థానిక సంస్థలు నిరంతర పర్యవేక్షణలో లోటుపాట్లకు ఆస్కారం లేకుండా ధర్మాసనం మార్గదర్శకాలను పాటిస్తే వీధికుక్కల వీరంగాలను నియంత్రించగలిగే అవకాశముంది.

చెడుని చాలా తేలికగా వదిలించుకోవచ్చు. ఎందుకంటే చెడుకు కాళ్లే లేవు. కాళ్ల మీద అది తనకు తానుగా నిలబడటానికి.



మహాత్మా గాంధీ

సులువుగా 20 మందికి సలహాలు ఇవ్వగలను. వాటిని పాటించవలసిన వారిలో ఒకణ్ని కావడమే కష్టం.



షేక్‌స్పియర్

## ప్రజావాక్కు



### సమన్వయంతో ముందుకు రావాలి

సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకర పోస్టులను అరికట్టేందుకు మార్గదర్శకాలురూపొందించాలన్న సుప్రీంకోర్టు ఆలోచన సమాజ ప్రయోజనాల దృష్ట్యా ఆహ్వానించదగినది. సోషల్‌మీడియా వేదికలు వాస్తవానికి ప్రజాస్వామ్య చర్చలకు, ఆలోచనల మార్పిడికి ఉపయోగపడాలి. కానీ ఇవి నేడు విభేదాలను రెచ్చగొట్టే, ప్రైవసీని ఉల్లంఘించే వేదికలుగా మారడం ఆందోళనకరం. భావ స్వేచ్ఛ అనేది ఇతరులను అవమానించడానికిలేదా మతభావాలను దెబ్బతీయడానికి అనుమతి ఇవ్వదు. కానీ, తప్పుడు ప్రచారం, ద్వేషపూరిత పోస్టులు, వ్యక్తిగత దాడులు సామాజిక సమతుల్యతను భంగం చేస్తున్నాయి. కాబట్టి ఈ సమస్యను ఎదుర్కోవడానికి ప్రభుత్వం,చట్టవ్యవస్థ,సోషల్ మీడియా సంస్థలు సమన్వయంతో ముందుకు రావాలి.

- సి హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### ఆరోగ్యమే మహాభాగ్యం

ప్రపంచంలో ఊబకాయంతో బాధపడుతున్న వాళ్లు కోకొల్లలు. మనదేశంలో కూడా తక్కువేమీకాదు. ఈ ఒబెసిటికి ప్రధాన కారణం వ్యాయామలేమి. జంక్‌ఫుడ్ ఎక్కువ తీసుకోవడం అని నిపుణులు చెబుతుంటారు. మంచి ఆరోగ్యం పొందాలంటే చిరుతిళ్లు నిద్ర ముఖ్యంగా మానసిక ప్రశాంతత ఎంతోఅవసరం. రోజుకు కనీసం పది నిమిషాల పాటు ధ్యానం చేయాలి. కష్టాలు కలకాలం ఉండవని గ్రహించాలి. నీరు ఎక్కువగా తాగాలి. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలి. పొగతాగడం, మందు వగైరాలకు వెంటనే స్వస్తి పలకాలి.

- కె.రామారావు, నల్గొండ

### క్రమశిక్షణ అవసరం

టి.వి.లలో ప్రసారమయ్యే డిబేట్లలో అన్ని పార్టీల ప్రతినిధులు, రాజకీయ విశ్లేషకులు పాల్గొంటారు. యాంకర్లు అడిగే ప్రశ్నలకు వారు సమాధానం చెప్పాలి. కానీ వారిలో క్రమశిక్షణ లోపిస్తోంది. ఒకరు మాట్లాడుతుంటే మరోకరు అనవసరంగా కలగజేసుకుని గట్టిగా మాట్లాడుతుంటారు. అప్పుడప్పుడు మూడో వ్యక్తి కూడా తన అభిప్రాయాన్ని వెలుబుచ్చుతుంటారు. ఒకరి తరువాత ఒకరు మాట్లాడాలని తాను వారికి మరల అవకాశమిస్తానని యాంకర్లు మర్యాదగా మందలిస్తున్నా వినిపించుకోరు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### ఆధిపత్య ధోరణి పనికిరాదు

ఉక్రెయిన్ యుద్ధం కావొచ్చు ఇరాన్ ఇజ్రాయేల్ యుద్ధం కావొచ్చు బలమైన ఆర్థిక వ్యవస్థలు అని చెప్పుకున్న దేశాలు తోకముడిచాయి. ఎందుకని ఉక్రెయిన్ తో వారికి నిత్యావసరాల అవసరం ఉంది. ఇరాన్‌తో ఇంధన అవసరాలు ఉన్నాయి. చిన్న దేశాలను బెదిరించి తమ గుప్పిట పెట్టుకోవడమే లక్ష్యంగా పెద్ద దేశాలు పావులు కదుపుతున్నాయి కాకపోతే వాటిపైన దాడి ఒక్కోసారి కొంచెం హెచ్చు స్థాయిలోనో కొంచెం తక్కువ స్థాయిలోనో ఉంటున్నాయి. ఈ యుద్ధాలు ఇలాగే కొనసాగితే ఆర్థిక మాంద్యాలు, ధరల పెరుగుదలలు, సరఫరా వ్యవస్థలు దెబ్బతినడం అన్నింటికీ మించి మానవ హననం జరుగుతుంది అనేది ఒక వాస్తవమే. ఇక్కడ ఇంకోటి కూడా గమనించాలి ఈనాడు చిన్న దేశాలు పెద్ద దేశాలకు బయపడడం లేదు. ఇదే ఇప్పుడు ప్రపంచం ముందు ఉన్న చిత్రం. ఇక ఎంత మాత్రం ఆధిపత్య ధోరణి పనికి రాదు.

- భారత అవినాష్, జనగామ

### బదలీలకు షెడ్యూల్ ప్రకటించాలి

ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న ప్రిన్సిపల్స్, పీజీటీలు, టీజీటీల బదిలీలను నిర్వహించాలని మరియు దీనికి సంబంధించిన షెడ్యూల్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని టీచర్స్ కోరుతున్నారు. డీఎస్సీ 2025 నిర్వహణకు ముందు బదలీ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని, డీఎస్సీ 2018 ద్వారా నియమితులైన మోడల్ స్కూల్స్ సిబ్బందికి ఈ అవకాశాన్ని కల్పించాలి. ఇదివరకే అనేకసార్లు ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో, ఇప్పటికైనా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- టి. సురేష్, ఆంధ్రప్రదేశ్

### మాదకద్రవ్యాలపై నియంత్రణ అవసరం

మద్యం, మాదకద్రవ్యాలు ఊరూరా విచ్చలవిడిగా లభిస్తూ నవతరాన్ని దారితప్పిస్తున్నాయి. వీటిని అణచివేసేందుకు ఉక్కుపాదం మోపాలి. నవతరాన్ని కాపాడాలి. మద్యం, మాదకద్రవ్యాలు యువతకు అందకుండా ప్రభుత్వం నిఘా ఏర్పాటు చేయాలి. రాష్ట్రంలోకి మత్తు పదార్థాలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. కాలేజీలు, స్కూళ్ల వద్ద నిఘాను ఏర్పాటు చేయాలి. ఎవరైనా వీటిని అమ్మినట్లు తెలిసినా, చూసినా వారిని వెంటనే అదుపులోకి తీసుకొని కఠిన శిక్షలు విధించాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలపై నిఘా ఉంచాలి.

-డి. వెంకటరెడ్డి, ఊరదాళ్ళపాలెం ప.గోజిల్లా

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# చదువే కాదు.. పరిశుభ్రత కూడా హక్కే!

ప్రభుత్వంవిద్యా హక్కు గురించి పదేపదే చెప్పడం అందరికీ తెలిసిందే. అయితే ఆ హక్కులో భాగంగా పరిశుభ్రత కూడా ఒక భాగంగా పరిగణించాలి. చదువు నేర్చుకునే వాతావరణం పరిశుభ్రంగా ఉండకపోతే, విద్యార్థి ఏ విధంగా ఆధ్యయనం పై దృష్టి పెట్టగలడు? అలాంటి వాతావరణాన్ని కల్పించడానికి అవసరమైన ప్రాథమిక విషయాలను కూడా పట్టించుకోకపోతే, విద్యా వ్యవస్థపై నమ్మకం ఎలా కలుగుతుంది? తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పాఠశాలల్లో చేర్పించడ మంటే, వారికి ఉత్తమమైన భవిష్యత్తు కల్పించాలనే ఆకాంక్ష. కానీ వారు కనీస పరిశుభ్రత కోసం కూడా ప్రభుత్వం కళ్లు చూసి కూర్చోవాల్సిన పరిస్థితి చాలా బాధాకరం. ఈ చిన్న మొత్తాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంవల్ల లక్షలాది విద్యార్థుల ఆరోగ్యం, గౌరవం, అభివృద్ధి సంకటంలో పడుతోంది. ఇది కేవలం ఆర్థికంకాదు, ఇది మానవతా అంశం. ప్రభుత్వం ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలి. బడ్జెట్‌లో కేటాయించిన నిధులు సకాలంలో విడుదలయ్యేలా పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటుచేయాలి. విద్యార్థులకు అవసరమైన నిత్యవసరాలు ప్రతి నెలా సమయానికి అందేలా చూడాలి.



అప్పన్న గొనప

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలు సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఏర్పాటు చేయబడ్డ ముఖ్యమైన విద్యాసంస్థలు. రాష్ట్రంలో రెసిడెన్షియల్ స్కూళ్లు, సాంఘిక సంక్షేమ గురుకులాలు, గిరిజన సంక్షేమ గురుకులాలు వంటి అనేక శ్రేణుల్లో ఈ విద్యాసంస్థలు పని చేస్తున్నాయి. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా విద్య, వసతి, భోజనం, యూనిఫాం వంటి సదుపాయాలు లభిస్తున్నా, వ్యక్తిగత పరిశుభ్రతకు అవసరమైన మౌలిక సదుపాయాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత కోసం ప్రభుత్వం నెలకు ఒక్కో విద్యార్థికి 100 చొప్పున కాస్మెటిక్ ఛార్జీ కేటాయించేది. ఈ మొత్తం ద్వారా టూత్ పేస్ట్, బ్రష్, సబ్బు, నూనె,షాంపూ వంటి నిత్యావసరాలను కొనుగోలు చేయాల్సి ఉంది. కానీ గత ఐదేళ్లుగా ఈ నిధులు విడుదల కాకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యావసర వస్తువుల కొరత వల్ల విద్యార్థులు పరిశుభ్రతను పాటించలేకపోతున్నారు. ఇది శారీరక ఆరోగ్యంపైనే కాకుండా, మానసిక స్థితిపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతోంది. చిన్న వయస్సులో ఉన్న పిల్లలు పరిశుభ్రమైన వాతావరణంలో జీవించాలి. వారు ఆరోగ్యంగా ఉండాలంటే, వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి. కానీ ఈ సామాన్ల కొరత వల్ల విద్యార్థులు చర్మ వ్యాధులు, దంత సమస్యలు, జుట్టు తడిపోవడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇంకా ఎక్కువగా బాధ్యత కలిగినది. ఈ పరిస్థితి వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయడం. ఇతర విద్యార్థులతో కలిసిమెలిసి ఉండాల్సిన సమయంలో, తాము పరిశుభ్రంగా లేకపోవడం వల్ల అనేక మంది విద్యార్థులు వెనుకబడిపోతున్నారు. ఇది వారి వ్యక్తిత్వ వికాసాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తోంది. ఈ నిధులు బడ్జెట్‌లో కేటాయించినప్పటికీ, అవి విద్యార్థుల వరకూ చేరడం లేదు. మధ్యస్థాయిలో ఉన్న అధికారుల నిర్లక్ష్యం, సరైన పర్యవేక్షణలేకపోవడం వల్ల ఈ నిధులు నిలిచిపోతున్నాయి. ప్రభుత్వం ప్రకటనలు చేస్తూ ఉండడం ఒక వైపు అయితే, వాటి అమలు స్థాయిలో పూర్తిగా విఫలమవుతోంది. పాఠశాల యాజమాన్యాలు కూడా సరైన చర్యలు తీసుకోకపోవడం వల్ల విద్యార్థులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది అధికారుల కృషి ఉన్నా, వ్యవస్థ మొత్తం పటిష్టంగా పనిచేయకపోవడం వల్ల సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఇటీవల ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరం నుంచి కాస్మెటిక్ కిట్లు అనే కొత్త కార్యక్రమాన్ని ప్రకటించింది. ఇందులో బ్రష్, టూత్‌పేస్ట్, షాంపూ, ఆయిల్, సబ్బు, బాడీ లోషన్, క్రీమ్ వంటి 12 నిత్యావసర వస్తువులను విద్యార్థులకు ఉచితంగా అందించనున్నట్లు తెలిపింది. మొదటి విడతగా 4800 మందికి ఈ కిట్లు పంపిణీ చేయనున్నట్లు సమాచారం. కానీ రాష్ట్రంలోని గురుకుల పాఠశా



లల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య దాదాపు 1.5 లక్షల మంది. అలాంటి పరిస్థితిలో ఇది నామమాత్రపు పరిష్కారంగా మాత్రమే మిగిలిపోతోంది. ఈ కిట్ల పంపిణీలో సమగ్రత లేదు. అన్ని పాఠశాలలకు, ప్రతి విద్యార్థికి సమానంగా అందించాలన్న నిబద్ధత స్పష్టంగా కనిపించడం లేదు. పైగా, ఇవి తాత్కాలిక చర్యలుగా కాకుండా శాశ్వత పథకంగా కొనసాగించాలన్న దిశగా ప్రభుత్వంలో స్పష్టత లేదు. కేవలం కొందరి వరకు పరిమితమైన కార్యక్రమం మూలంగా విద్యార్థులలో అసమానతలు కలుగుతాయి. సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించాలంటే, ప్రతి విద్యార్థికి నెలవారీగా నిధులు నేరుగా అందేలా చేయాల్సిన అవసరం ఉంది. ప్రతి విద్యార్థికి నెలకు100 చొప్పున నిధులు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ ద్వారా నేరుగా జమయ్యే విధంగా వ్యవస్థను రూపొందించవచ్చు. లేదా ప్రతి పాఠశాల స్థాయిలో నిత్యవసర వస్తువుల కొనుగోలుకు ప్రత్యేకంగా నిధులను కేటాయించి, ఆ పంపిణీకి పర్యవేక్షణ ఏర్పాటు చేయాలి. విద్యార్థుల పేరు మీద ఆయా పాఠశాలలు నమోదై ఉండే విధంగా సమాచార వ్యవస్థను నిర్మించవచ్చు. ఒక చిన్న చర్య అయినా, విద్యార్థుల జీవితాల్లో ఇది చాలా పెద్ద మార్పును తీసుకురాగలదు. పరిశుభ్రత కేవలం ఆరోగ్యానికి సంబంధించిన అంశం కాదు. అది ఒక వ్యక్తి గౌరవానికి, ఆత్మవిశ్వాసానికి, అభివృద్ధికి సంబంధించిన అంశం. ఒక బాలబాలిక పరిశుభ్రంగా ఉండే అవకాశం కలిగినప్పుడు, అతని మనోవృత్తిలో కూడా మార్పు వస్తుంది. పరిశుభ్రమైన జీవనశైలి అతని ఆలోచనలను, వ్యవహార శైలిని, నైతిక విలువలను తీర్చిదిద్దుతుంది. అలాంటి పరిస్థితిని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఈ బాధ్యతను నిర్లక్ష్యం చేయడం వల్ల విద్యార్థులు మానసికంగా హీనభావనకు లోనవుతున్నారు. ప్రభుత్వ నిధులు ఉన్నా అవి విద్యార్థుల వరకూ చేరకపోవడం అనేది చాలా దురదృష్టకరం. ప్రభుత్వంవిద్యా హక్కు గురించి పదేపదే చెప్పడం అందరికీ తెలిసిందే. అయితే ఆ హక్కులో భాగంగా పరిశుభ్రత కూడా ఒక భాగంగా పరిగణించాలి. చదువు నేర్చుకునే వాతావరణం పరిశుభ్రంగా ఉండకపోతే, విద్యార్థి ఏ విధంగా ఆధ్యయనం పై దృష్టి పెట్టగలడు? అలాంటి వాతావరణాన్ని కల్పించడానికి అవసరమైన ప్రాథమిక విషయాలను కూడా పట్టించుకోకపోతే, విద్యా వ్యవస్థపై నమ్మకం ఎలా కలుగుతుంది? తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పాఠశాలల్లో చేర్పించడ మంటే, వారికి ఉత్తమమైన భవిష్యత్తు కల్పించాలనేఆకాంక్ష. కానీ వారు కనీస పరిశుభ్రత కోసం కూడా ప్రభుత్వం కళ్లు చూసి కూర్చోవాల్సిన పరిస్థితి చాలా బాధాకరం. ఈ చిన్న మొత్తాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంవల్ల లక్షలాది విద్యార్థుల ఆరోగ్యం, గౌరవం, అభివృద్ధి సంకటంలో పడుతోంది. ఇది కేవలం ఆర్థికంకాదు, ఇది మానవతా అంశం. ప్రభుత్వం ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలి. బడ్జెట్‌లో కేటాయించిన నిధులు సకాలంలో విడుదలయ్యేలా పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటుచేయాలి. విద్యార్థులకు అవసరమైన నిత్యవసరాలు ప్రతి నెలా సమయానికి అందేలా చూడాలి. ఈ చర్యలు చిన్నవిగా కనిపించవచ్చు, కానీ విద్యార్థుల జీవితాల్లో ఇది అద్భుతమైన మార్పుని తీసుకురాగలవు. ఇది విద్యార్థుల స్వస్థతకే కాకుండా, ఒక సమాజంగా మన బాధ్యతను చూపించే అవకాశం కూడా. ఒక్క చిన్న మార్పుతో వేల మందికి ఆశను పంచవచ్చు. చిన్ననిధితో పెద్ద మార్పు సాధ్యమవుతుంది. విద్యార్థులు పరిశుభ్రమైన జీవితాన్ని గడపడం వాళ్ల హక్కు. ఆ హక్కును కాపాడాలన్న నిబద్ధత ప్రభుత్వంలో ఉండాలి. వారు ఆశగా ఎదురుచూస్తున్నది కేవలం టూత్‌పేస్ట్, బ్రష్‌లు మాత్రమేకాదు వారి గౌరవంకోసం. అదివారికి తిరిగి ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ●

# జనాభా తగ్గుదలతో కార్మిక శక్తి బలహీనం

తరిగోపుల నారాయణస్వామి

భారతదేశం విస్తారమైన దేశం. అనేక శతాబ్దాలుగా జనాభా పెరుగుదలతో పాటు ఆర్థిక,సామాజిక, సాంస్కృతిక మార్పులను అనుభవించింది. అయితే నేటి తరుణంలో దేశంలోని కొన్నిరాష్ట్రాలు, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు, జనాభా వృద్ధిలో పడిపోయిన ధోరణిని మనం గమనిస్తున్నాం. ఒకవైపు జనాభా పెరుగుదల వలన సవాళ్లు ఎదురవుతుంటే, మరోవైపు జనాభా తగ్గుదల వలన కూడా పలు సమస్యలు తలెత్తుతున్నాయి. సమాజంలో జరిగే ఈ మార్పులు పాలనాధికారుల వైఖరిని, ప్రభుత్వ విధానాల లోపాలను, జీవన ప్రమాణాల ఖరీదును ప్రతిబింబిస్తున్నాయి. దక్షిణ భారతదేశంలోని రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, తెలంగాణ, కర్ణాటక విద్యాస్థాయి పెరుగుదల, పట్టణీకరణ,మహిళల ఉపాధి అవకాశాలు, కుటుంబ నియంత్రణపై అవగాహన, వైద్యరంగంలో పురోగతివంటి కారణాల వలన జనన రేటు గణనీయంగా తగ్గింది. కుటుంబం చిన్నదిగా ఉండాలి అనే భావన, జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకోవాలనే తపనతో కలిపి, పెద్ద కుటుంబాలను ఏర్పాటు చేసేందుకు చాలా మంది వెనకడుగు వేస్తున్నారు. అంతే కాకుండా ఆధునిక జీవన శైలి, ఆర్థిక అస్థిరత, భవిష్యత్ భయాలు కూడా దంపతులను తక్కువ పిల్లలకే పరిమితం చేస్తున్నాయి. ఇదే సమయంలో ప్రభుత్వ వైఫల్యాలు కూడా ఈ పరిస్థితిని మరింత పెంచుతున్నాయి. ఒకవైపు యువతకు స్థిరమైన ఉద్యోగ అవకాశాలు లేకపోవడం, మరొకవైపు ఉన్న అవకాశాలు కూడా కాంట్రాక్టు విధానంలో మిగిలిపోవడం వలన కుటుంబ ఆర్థిక భద్రతపై భయం నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం నష్టాల్లో ఉండడం, పట్టణాల్లో జీవన వ్యయం అధికం కావడం, నివాసం, వైద్యం, విద్య వంటి అవసరాలు ఖరీదైనవిగా మారడం వలన సాధారణ కుటుంబం ఒకరు లేదా ఇద్దరు పిల్లలకు మించిన బాధ్యత తీసుకోవడం కష్టమవుతోంది. ఈ సమస్యలకు పరిష్కారం చూపడంలో పాలకులు నిర్లక్ష్యం ప్రదర్శించడంస్పష్టమవుతోంది. ప్రభుత్వం వివిధ స్థాయిలలో జనాభా పెంపు కోసం కొన్ని ప్రోత్సాహకాలు ప్రకటించినా అవిసరైన స్థాయిలో అమలవడం లేదు. ఉదాహరణకు, రెండో సంతానాన్ని కలిగించే కుటుంబాలకు ఆర్థిక ప్రోత్సాహకాలు ఇవ్వడం, మహిళలకు ప్రసూతి సదుపాయాలు కల్పించడం, చిన్నారుల పోషణకు నిధులు అందించడం వంటి కార్యక్రమాలు పరిమిత స్థాయిలోనే జరుగుతున్నాయి. వీటిలో అనేకం మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో లేవు. పైగా ప్రస్తుత పాలకులు దీన్ని ఒక ప్రాధాన్యత విషయంగా పరిగణించడం లేదని స్పష్టమవుతోంది. జనాభా పెరుగుదల తగ్గడంఒకవైపు కుటుంబాలకు సౌకర్యాన్ని కలిగించినా, దేశ స్థాయిలోచూస్తే ఇది భవిష్యత్తులో కార్మిక శక్తి కొరతను తెచ్చేప్రమాదంఉంది. వృద్ధుల సంఖ్య పెరుగుతుండగా, పని చేయగల వయసు గల జనాభా తగ్గిపోతే ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని పాలకులు ముందస్తు చర్యలు తీసుకోవాలి. విద్యావంతులైన యువతకు స్థిరమైన ఉద్యోగాలు కల్పించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తరించడం, మహిళలకు ఉపాధి సౌకర్యాలు కల్పించడం వంటి విషయాలలో ప్రభుత్వం నిజాయితీగా కృషి చేయాలి. జీవన ప్రమాణాలు రోజురోజుకీ ఖరీదు అవుతున్న తరుణంలో ప్రజలు మరింత భద్రత కోసం చిన్న కుటుంబాలను ఎంచుకోవడంసహజమే. అయినప్పటికీ పాలకులు ఈ పరిస్థితిని వదిలిపెట్టకుండా, ప్రజల జీవనవ్యయాలను తగ్గించేవిధానాలు, సామాజిక భద్రతా పథకాలు, ఉద్యోగ సృష్టి కార్యక్రమాలను సక్రమంగా అమలు చేస్తే జనాభా వృద్ధి, దేశ అభివృద్ధి రెండూ సమన్వయంకావచ్చు. అందుకే పాలకులు ప్రజల అసలు సమస్యలను అర్థంచేసుకొని ఆచరణాత్మక నిర్ణయాలు తీసుకోవడం అత్యవసరంగా మారింది. దేశంలోని కొన్ని ప్రముఖ రాష్ట్రాలలో జనాభా వృద్ధిశాతం తగ్గుదల గణనీయంగాఉంది. విద్యావ్యవస్థ, మహిళా సాధికారత, కుటుంబ నియంత్రణ పద్ధతులు ప్రజా ఆరోగ్యంపై పెట్టుబడులు పెట్టడం ద్వారా ఈస్థాయిలో జనాభావృద్ధిని నియంత్రించగలిగాయి. అయితే ఈపరిణామం భవిష్యత్తులో కార్మిక శక్తి కొరత, వృద్ధాప్య భారం పెరగడం, అభివృద్ధి వ్యయాలు అధికమవడం వంటి సమస్యలను తెచ్చే అవకాశముంది. అందువల్ల ప్రభుత్వం దీనిని ఒకవిజయంగా భావించకుండా సమన్వయ దృక్పథంతో చూడాలి. ఈ సమస్యను ఎదుర్కోవడానికి పాలకులు కేవలం గణాంకాలను పరిశీలించడం సరిపోదు. జీవన వ్యయాన్ని తగ్గించేవిధానాలు, ఉద్యోగ అవకాశాలను విస్తరించే నిర్ణయాలు, చిన్నారుల సంరక్షణ, మహిళలకు సౌకర్యవంతమైన ఉపాధి విధానాలు, గ్రామీణ అభివృద్ధికి ప్రత్యేక కృషి వంటి చర్యలు అత్యవసరం. ●

# భారత ప్రజాస్వామ్యమా! నీ దారెటు?

డా. ఎ. భాగ్యరాజ్

డెబ్బైతొమ్మిదోవ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకున్న భారతదేశం ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యం అని గర్వంగా చెప్పుకుంటాం. 1947లో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ప్రజల ఓట్లతో ప్రభుత్వాలను ఎంచుకుంటూ వస్తున్నాం. నెహ్రూ సారథ్యంలో భారత ప్రజాస్వామ్యం బలంగా పునాదులు వేసుకోగలిగింది. అయితే, ప్రజాస్వామ్యం నేడు ఏ దిశలో నడుస్తోంది? అన్న ప్రశ్న ప్రతి ఒక్కరినీ కలవరపెడుతోంది. ప్రతి ఐదేళ్లకోసారి ఎన్నికలు వస్తున్నాయి. ప్రజలు ఓటు వేస్తున్నారు. కానీ ఆ ఓటు విలువను రాజకీయ పార్టీలు మతం, డబ్బు, మద్యం, కులం ఆధారంగా కొంటున్న వాస్తవం బాధాకరం. ప్రజాస్వామ్య పండుగ వాస్తవానికి మార్కెట్లో కొనుగోలు చేసే వస్తువుగా మారిపోయింది. ప్రజాస్వామ్యం అంటే ప్రజలచే, ప్రజల కోసం, ప్రజల పాలన. ప్రతి ఒక్క పౌరుడు తన ఓటుతో నాయకత్వాన్ని ఎంచుకోవడం, తమ సమస్యలను ప్రతినిధుల ద్వారా వ్యక్తం చేయడం, న్యాయం,సమానత్వం పొందడం దీని అసలు ఆత్మ. ప్రజల కోసం, ప్రజల చేత, ప్రజల పాలన అనే అబ్రహాం లింకన్ మాటలు మనకు వర్తించాలి. కానీ నేడు ఒక ప్రశ్న ప్రతి పౌరుడి మనసులో మెదిలేది ఇది ప్రజా ప్రభుత్వాలా లేక కార్పొరేట్ ప్రభుత్వాలా అని. మన ప్రజాస్వామ్యం ఎటు దారితీస్తోంది? మొన్న ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంపై లేవనెత్తిన ప్రశ్నలకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తమకు ఏ పార్టీ అయినా ఒకటే అని, ఓట్ల చోరీ వంటి పదాలు ఉపయోగించడం రాజ్యాంగాన్ని అవమానపరచడమే అని, కోటిమంది అధికారులు పది లక్షల మంది బూత్ స్థాయి అధికారులు,ఇరవైనాలుగు లక్షలమంది పోలింగ్ ఏజెంట్లు ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటారని, ఇంత మందిలో ఓట్లచోరీ సాధ్యమేనా అని, అఫిడవిట్ సమర్పించాలని ఎదురు ప్రశ్నలు అడుగుతున్నారు. ఎన్నికల కమిషన్, 2024 లో జరిగిన సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ కాంగ్రెస్ అధికారంలోకివస్తే రామమందిరాన్ని బుల్డోజర్తో కొట్టేస్తారు అని, మహిళల పుస్తెలతో రాజకీయం చేస్తారని చెప్పడం ఎన్నికల అధికారులకు వినిపించలేదేమో. ఇంకా మతపరమైన ప్రచారాలు జరిగాయి. అప్పుడు ఎన్నికల కమిషన్‌కు చెవులు, కళ్ళు, నోరు పనిచేయలేదేమో. విపక్షాలకు మాత్రమే వారి అధికారాలు పనిచేస్తాయేమో ఇలా ఎన్నో ఉన్నాయి. 90లలో ఉల్లిపాయలు, ఇంధన ధరలు పెరిగితేనే ప్రభుత్వాలు అధికారాలను నిలబెట్టుకోలేక పోయేవి కాని ఇప్పుడు అన్ని వస్తువుల ధరలు, కార్పొరేట్లకు దోచిపెట్టడం, అవినీతి ఇలా అన్నివున్నా కూడా ఎలా విజయం సాధిస్తారో ఎన్నికల కమిషన్ వివరించాలి. ఎన్నికలు జరిగిన తరువాత స్పష్టంగా చెప్పవలసిన ఓట్ల శాతాన్ని చెప్పకుండా, ఒకరోజు తరువాత నమ్మశక్యంకాని పెరుగుదల విలువను చెబుతారు. ప్రజాస్వామ్యం నిలబడే నాలుగు స్థంభాలైన శాసనసభ,న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక విభాగం,



మీడియా. శాసనసభలో చర్చలు తగ్గిపోతూ ఒకపక్ష నిర్ణయాలు పెరుగుతున్నాయి. న్యాయవ్యవస్థపై రాజకీయ ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. మీడియా పెద్దగా పబ్లిక్ వాయిస్ కాకుండా పవర్ వాయిస్ అవుతోంది. 2024లోక్‌సభ ఎన్నికలలో ఓటింగ్ శాతం 67మాత్రమే. అంటే మూడవ వంతు ప్రజలు ఇంకా ప్రజాస్వామ్యంలో చురుకుగా పాల్గొనలేదు. 2023 ప్రజాస్వామ్య సూచిలో భారత్ లోపభూయిష్టమైన ప్రజాస్వామ్య జాబితాలో 41వ స్థానంలో ఉంది. అవినీతి, అసమానత, సామాజిక విభజన ప్రజాస్వామ్య బలాన్ని తగ్గిస్తున్నాయి. ట్రాన్స్పరెన్సీ ఇంటర్నేషనల్ నివేదిక ప్రకారం అవినీతి సూచికలో భారత్ ఇంకా 85వ స్థానంలో ఉంది. విపక్షాలు లేవనేత్తుతున్న ప్రశ్నలకు సమాధానం, వివరణ కాకుండా విపక్షాలపై కేసులు పెట్టి బెదిరించడం, భావ ప్రకటనా స్వేచ్ఛపై ఆంక్షలు, ప్రజాస్వామ్య బద్ధంగా నిరసనలను అణచివేయడం ఇవన్నీ ప్రజాస్వామ్య ఆత్మను, వ్యవస్థను దెబ్బతీస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితిలో ఎన్నికల రాజకీయాలు డబ్బు, మద్యం, జాతిమత ప్రలోభాలతో ఓట్లు కొనే సంస్కృతి పెరుగుతోంది. పార్లమెంట్, న్యాయ వ్యవస్థ, మీడియా వంటి ప్రజాస్వామ్య స్తంభాలు రాజకీయ ఒత్తిడికి లోనవుతున్నాయి. కార్పొరేట్ ప్రయోజనాలకు ప్రాధాన్యం పెరిగి, సామాన్య ప్రజల సమస్యలు వెనకబడుతున్నాయి. భావ ప్రకటనా స్వేచ్ఛపై నిర్బంధాలు, విపక్షాలపై ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. ప్రజాస్వామ్యం అంటేప్రజల హక్కులు, అవకాశాలు, సమానత్వం, స్వేచ్ఛను కాపాడటం. కాబట్టి మన దేశ భవిష్యత్తు ఒకే ప్రశ్నపై ఆధారపడి ఉంది. ప్రజాస్వామ్యం మన కోసం ఉందా, లేక కేవలం కాగితాల పైనే మిగిలిపోయిందా? ఇక మీడియా గురించి ఎంత తక్కువగా మాట్లాడితే మంచిది. అవినీతి అనేది కేవలం దొంగతనం కాదు అది ప్రజాస్వామ్యం హృదయాన్ని(వ్యవస్థ) బలహీనపరిచే వ్యవస్థ. జవాబుదారీతనం పారదర్శకత కలిగిన సమ్మిళితమైన సంస్థలు ఏర్పడితే, మన దేశం ప్రజాస్వామ్య సామర్థ్యాన్ని నిజంగా సాకారం చేసుకోగలుగుతుంది. ప్రజాస్వామ్యం బలపడాలంటే ప్రజలు మేలుకోవాలి,చైతన్యం పెరగాలి. ప్రతి ఓటరు తన హక్కులను,బాధ్యతలను గుర్తించాలి. ఓటు వేసే సమయంలో ప్రలోభాలకు లోనుకాకుండా సరైన అభ్యర్థులను ఎంచుకోవాలి. స్వతంత్ర సంస్థలైన ఎన్ని కల సంఘం, న్యాయవ్యవస్థ, మీడియా నిజమైన స్వతంత్రతను కాపాడుకోవాలి. ప్రజల డబ్బుతో నడిచే ప్రభుత్వం ప్రతి నిర్ణయానికి బదులిచ్చేలా ఉండాలి. కుల,మత, లింగ వివక్ష లేకుండా అందరికీ సమాన అవకాశాలుకలగాలి. ప్రజాస్వామ్యంలో మనం ఓటువేసినవారికే వెళ్లిందని నమ్మకమేంటి? ఒకవేళ ఈవీఎం వున్నా వాటి ద్వారా వచ్చిన వివి ప్యాట్ మీద ఓటరు సంతకమో లేదా వేలిముద్రో ఉంటే అప్పుడు ఓట్ల దొంగతనం ఉండదు కదా. భారత ప్రజాస్వామ్యం చరిత్రలో ఎన్నో పరీక్షలను ఎదుర్కొని నిలబడింది. కానీ ఇప్పుడు అది చాలా పరిస్థితులను ఎదుర్కొంటోంది. ప్రజాస్వామ్యం నిజంగా ప్రజలకోసం ఉందా? లేక కేవలం శాసన పుస్తకాల్లోనో, అధికారుల ప్రసంగాల్లోనో మాత్రమే మిగిలిపోయిందా? ఈప్రశ్నకు మనమే జవాబు ఇవ్వాలి. మనచైతన్యం, మన ఓటు, మన గొంతుతో. భారత ప్రజా స్వామ్యం గొప్ప చరిత్ర కలిగిన వ్యవస్థ. కానీ అది కేవలం ఎన్నికలతోనే పరిమితం కాకూడదు. ప్రజాస్వామ్యంలో వ్యవస్థలు సరిగా పని చేయనప్పుడు ప్రజా ఉద్యమమే సరైన మార్గం. ●

# రష్యాపై విరుచుకుపడ్డ ఉక్రెయిన్..

## అణువిద్యుత్ ప్లాంట్‌పై డ్రోన్ దాడి

**మాస్కో ఆగస్టు 24:** రష్యా పశ్చిమ ప్రాంతంలోని కుర్స్క్‌లోని అణు విద్యుత్ ప్లాంట్‌పై ఉక్రెయిన్ డ్రోన్లతో దాడులు చేసిందని మాస్కో ఆదివారం ఆరోపించింది. ఉక్రెయిన్ ఆదివారం 34వ స్వాతంత్ర్య వేడుకలు జరుపుకోవడం విశేషం. రాత్రి సమయంలో అనేక ఇంధన, విద్యుత్ ప్లాంట్లపై దాడులు చేసినట్లుగా రష్యన్ అధికారులు పేర్కొన్నారు. కుర్స్క్‌లోని ప్లాంట్‌లో మంటలు చెలరేగాయని.. సకాలంలోనే మంటలను అదుపులోకి తీసుకువచ్చినట్లు పేర్కొంది. ఈ దాడుల్లో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని పేర్కొంది. డ్రోన్ దాడిలో ప్లాంట్ ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతిన్నదని.. రేడియేషన్ లెవల్స్ సాధారణంగానే ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ సంఘటన గురించి తమకు సమాచారం అందిందని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ తెలిపింది. అణు స్థావరాల భద్రతను అన్ని విధాలుగా నిర్ధారించాలని ఏజెన్సీ చీఫ్ రాఫెల్ మరియానో గ్రాస్సీ పేర్కొన్నారు. ఈ సంఘటనపై ఉక్రెయిన్ స్పందించలేదు. ఆదివారం రాత్రికి 95 ఉక్రెయిన్ డ్రోన్‌లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. రష్యా కూడా ఉక్రెయిన్‌పై 72 డ్రోన్‌లు, ఒక క్రూయిజ్ క్షిపణిని ప్రయోగించింది. వాటిలో 48 ఉక్రెయిన్ వైమానిక దళం నాశనం చేసింది. రష్యాలోని లెనిన్‌గ్రాడ్ ప్రాంతంలోని ఉస్ట్‌లుగా ఓడరేవులో మంటలు చెలరేగాయి.

ఉక్రెయిన్ డ్రోన్ శకలాలు ఇక్కడి ఇంధన ఎగుమతి కేంద్రంపై పడడంతో మంటలు చెలరేగాయి. కీవ్‌లోని ఇండిపెండెన్స్ స్క్వేర్ నుంచి విడియో సందేశంలో అధ్యక్షుడు జెలెన్‌స్కీ దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. భద్రత, శాంతియుత జీవితం సాధ్యమయ్యే భవిష్యత్తును ఉక్రెయిన్ నిర్మిస్తోందని పేర్కొన్నారు.

మన భవిష్యత్తు మన చేతుల్లోనే ఉందని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన అమెరికా రష్యా అలాస్కా సమావేశాన్ని ప్రస్తావిస్తూ.. ప్రపంచం ఉక్రెయిన్‌ను గౌరవిస్తుందని, దానిని సమానంగా చూస్తుందని ఆయన అన్నారు. కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ సైతం కీవ్‌కు చేరుకుని జెలెన్‌స్కీని కలిశారు. ఉక్రెయిన్‌కు నార్వే ఏడు బిలియన్ క్రోనర్ల (సుమారు 695 మిలియన్ డాలర్లు) కొత్త సైనిక సహాయాన్ని ప్రకటించింది. తూర్పు భాగంలోని డొనెట్స్క్ ప్రాంతంలోని రెండు గ్రామాలను తమ సైన్యం స్వాధీనం చేసుకుందని రష్యా పేర్కొంది.



# అంతరిక్షంలో సుదూర తీరాలను శోధిద్దాం

## శాస్త్రవేత్తలకు ప్రధాని మోడీ పిలుపు

**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** మానవాళి భవిష్యత్తును మరింత ప్రకాశవంతం చేసేందుకు అంతరిక్షంలో సుదూర తీరాలను శోధించేందుకు సిద్ధం కావాలని శాస్త్రవేత్తలకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపునిచ్చారు. బవిష్యత్తులో చేపట్టనున్న అంతరిక్ష మిషన్లకోసం పెద్ద ఎత్తున వ్యోమగాములను సిద్ధం చేస్తున్నామని, యువత ఇందులో భాగం కావాలని సూచించారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగాఉన్న అంతరిక్ష శాస్త్రవేత్తలు, విద్యార్థులు, విధానకర్తనుద్దేశించి ప్రసంగించారు. మనం చంద్రుడు, అంగారకుడిని చేరుకున్నాం. ఇప్పుడు అనేక రహస్యాలు దాగున్న రోదసిలోని సుదూర తీరాలపై పరిశోధనలు చేయాల్సి ఉంది. దానివల్ల భవిష్యత్తు తరాలకు మరిన్ని వెలుగు ప్రసాదించే అవకాశం దక్కుతుంది. అంతరిక్ష రంగంలో ఒకదాని తర్వాత మరో విజయం మనకు, మన శాస్త్రవేత్తలకు ఆనవాయితీగా మారిపోయింది. ఏ సరిహద్దు చివరిది కాదని మనకు విశ్వం చెబుతోంది అని మోడీ పేర్కొన్నారు. 2040లో భారత్ సొంతంగా చేపట్టే అంతరిక్ష యాత్రలో భారత వ్యోమగామి చంద్రుడిపై అడుగుపెట్టి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి వికసిత్ భారత్ ఖ్యాతిని చాటుతారని పునరుద్ఘాటించారు. భవిష్యత్తులో ఏడాదికి 50 రాకెట్లను ప్రయోగించే స్థితికి మనం చేరుకోగలమా అని అంతరిక్ష శాస్త్రవేత్తలను ఆయన ప్రశ్నించారు. శాస్త్రవేత్తలు చేస్తున్న కృషితో త్వరలో గగన్‌యాన్ మిషన్‌ను ప్రారంభించనున్నామని, మరి కొన్నేళ్లలో సొంత అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుంటామని పేర్కొన్నారు. అంతరిక్ష రంగ అభివృద్ధికి ప్రైవేటు రంగం మరింతగా ముందుకు రావాలని సూచించారు. అంతరిక్ష విజన్‌లో భాగంగా తదుపరి తరం సంస్కరణలను తెచ్చేందుకు ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు.

# గగన్‌యాన్ మిషన్..

## ఎయిర్ డ్రాప్ టెస్ట్ విజయవంతం



**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** భారత్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గగన్‌యాన్ అంతరిక్ష ప్రాజెక్టుఒ ఇస్రో మరో ముందడుగు వేసింది. క్రూ మాడ్యూల్‌కు సంబంధించి తొలి ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్టును విజయవంతంగా నిర్వహించింది. వాయుసేన, నౌకాదళం, డిఆర్డీఒ, కోస్ట్‌గార్డ్‌ల సంయుక్త సహకారంతో ఈ పరీక్షలు చేపట్టింది. ఈ ప్రయోగంలో భాగంగా మాడ్యూల్ నమూనాను హెలికాప్టర్ సాయంతో నింగిలోకి తీసుకెళ్లి కిందకి జారవిడిచారు. పారాచూట్ల సాయంతో ఆ మాడ్యూల్ వేగాన్ని తగ్గించుకుంటూ సముద్ర జలాల్లో సురక్షితంగా దిగింది. మానవసహిత అంతరిక్ష ప్రయోగాల సమయంలో వ్యోమగాములు భూమికి సురక్షితంగా తిరిగి వచ్చేందుకు దీన్ని ఉపయోగిస్తారు. మాడ్యూల్ భూవాతావరణంలోకి ప్రవేశించిన అనంతరం దాని వేగ నియంత్రణ, ల్యాండింగ్ విషయంలో పారాచూట్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుంది. సంక్లిష్టమైన ఈ వ్యవస్థ పనితీరును పరీక్షించడమే లక్ష్యంగా ఈ ప్రయోగం చేపట్టినట్లు సమాచారం. భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపే లక్ష్యంతో చేపట్టిన గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా ఇస్రో అనేక పరీక్షలు నిర్వహిస్తోంది. జులైలో సర్వీస్ మాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టమ్‌కు సంబంధించిరెండు హాట్ టెస్టులను విజయవంతంగా చేపట్టింది. 2027లో తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర నిర్వహించనున్నట్లు కేంద్రమంత్రి జితేంద్రసింగ్ ఇటీవల వెల్లడించారు.

# నోయిడాలో భార్యను చంపిన కిరాతకుడిపై పోలీసు కాల్పులు

**హైదరాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త:** యుపిలోని నోయిడాలో కట్టుకున్న భార్యను చిత్రహంసలకు గురిచేసి పెట్రోల్ పోసి కాల్చి చంపిన కిరాతకుడు ఆదివారం ఉదయం పోలీసులపై దాడిచేసి తప్పించుకునే క్రమంలో జరిగిన కాల్పుల్లో గాయపడ్డాడు. కాల్పుల్లో గాయపడ్డ నిందితుడిని పోలీసులు వెంటనే ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. వివరాలు ఇలావున్నాయి. నోయిడాలో నిక్కి భాటి అనే మహిళను ఆమె భర్త విపిన్ శ నివారం నాడు చిత్రహింసలకు గురిచేసి పెట్రోల్ పోసి కాల్చడం తెలిసిందే. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఆమె ఆసుపత్రిలో మరణించింది. తన తల్లిని తండ్రి హింసించి చంపినట్లు హతురాలి కుమారుడు పోలీసులకు వాంగ్మూలం ఇవ్వడంతో ఈ కేసు సంచలనంగా మారింది. కాగా ఈ ఘటన పై వెంటనే స్పందించిన నోయిడా పోలీసులు విపిన్ సహా అతని కుటుంబ సభ్యులను అరెస్టు చేశారు. విచారణలో భాగంగా విపిన్‌ను ఆదివారం ఉదయం అతని ఇంటికి తీసుకువెళ్లి భార్యను ఎలా చంపాడనే దానిపై సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. ఈ సమయంలో విపిన్ పోలీసులపై దాడికి దిగి వారి వద్ద వున్న తుపాకి లాక్కుని కాల్పులకు దిగాడు. అయితే దీనిపై పోలీసులు వెంటనే స్పందించి ఎదురు కాల్పులకు దిగి విపిన్ కాలిపై కాల్చారు. ఈ కాల్పుల్లో విపిన్ ఎడమ కాలికి బుల్లెట్ గాయం అయ్యింది.

విపిన్ జరిపిన కాల్పుల్లో పోలీసులకు ఎలాంటి గాయాలు తగలలేదు.

# భారత్! ట్రంప్‌ను సీరియస్‌గా తీసుకో!

## అమెరికా రిపబ్లికన్ నిక్కీ హేలీ



**వాషింగ్టన్, ఆగస్టు 24:** రష్యా నుంచి చమురు కొనుగోళ్ల విషయంలో ట్రంప్ లేవనెత్తిన అభ్యంతరాన్ని భారత్ సీరియస్‌గా తీసుకోవాలని అమెరికా రిపబ్లికన్ నిక్కీ హేలీ సూచించారు. భారత్‌కు మంచి మిత్రురాలిగా ఆమెకు పేరున్న విషయం తెలిసిందే. న్యూఢిల్లీ-వాషింగ్టన్ మధ్య తాజా విభేదాలను ఉద్దేశించి ఆమె ఎక్స్‌లో పోస్టు చేశారు. 'రష్యా నుంచి చమురు విషయంలో ట్రంప్ లేవనెత్తిన అభ్యంతరాలను భారత్ సీరియస్‌గా తీసుకోవాలి. దాని పరిష్కారం కోసం వీలైనంత త్వరగా శ్వేతసౌధంతో కలిసి పనిచేయాలి. దశాబ్దాలుగా రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల మధ్య ఉన్న స్నేహం, విశ్వాసమే.. ప్రస్తుత ఒడుదొడుకులను దాటేందుకు బలమైన పునాదిగా ఉపయోగపడుతుంది. వాణిజ్యంలో, రష్యా చమురుపై అభిప్రాయభేదాలు వంటివి పరిష్కరించుకోవాడానికి బలమైన చర్చలు, సంప్రదింపులు అవసరం. చైనాను ఎదుర్కోవడానికి అమెరికాకు న్యూఢిల్లీలో మిత్రులు ఉండాలన్న అంశం చాలా ముఖ్యమైంది. దానిని ఏమాత్రం విస్మరించకూడదు' అని ఆమె పోస్టు చేశారు. ఆంక్షలు విధించి భారత్‌ను అమెరికా దూరం చేసుకోవడంపై నిక్కీ హేలీ గతంలోనూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చైనాను ఎదుర్కోవాలన్న వ్యూహాత్మక లక్ష్యాల సాధనకు ట్రంప్ నిర్ణయాలు విపత్కరంగా మారాయని ఇటీవల ఆమె పేర్కొన్నారు. ఇటీవల ఓ పత్రికకు రాసిన కాలమ్‌లో ఆమె స్పందిస్తూ 'ప్రపంచంలో ఆరోవంతు జనాభాకు కేంద్రం భారత్. అత్యంత యువ జనాభాతో చైనాను దాటేసింది. మరోవైపు డ్రాగన్ జనాభాలో వృద్ధుల సంఖ్య గణనీయంగా పెరుగోంది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థ భారత్' అని పేర్కొన్నారు. మరోవైపు భారత్ వంటి మిత్రదేశాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూరం చేసుకోవడంపై మాజీ విదేశాంగ మంత్రి జాన్ కెర్రీ కూడా ఆందోళన వ్యక్తం చేశారు. నిజమైన దౌత్య ప్రయత్నాలు జరగకుండా, అల్టిమేటంలు జారీ చేయడం సరికాదని అభిప్రాయడ్డారు. భారత్, అమెరికా మధ్య పోరు దురదృష్టకరమని అభివర్ణించారు. 'అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని మోడీ మధ్య ఈ పోరాటం దురదృష్టకరం. సాధారణ వ్యాపార విధానంలో దౌత్య ప్రయత్నం లేకుండా గొప్ప దేశాలు ఎల్లప్పుడూ ప్రజలకు అల్టిమేటం ఇవ్వడం ద్వారా గొప్పతనాన్ని ప్రదర్శించవు. మాజీ అధ్యడు బరాక్ ఒబామా పాలనలో చర్చలు, పరస్పర సహకారం, గౌరవం ద్వారా జరిగాయి. కానీ, ఇప్పుడు కొంచెం ఎక్కువ ఆదేశాలు, ఒత్తిడితో జరుగుతున్నాయి' అని జాన్ కెర్రీ తెలిపారు. రష్యా నుంచి భారత్ దిగుమతి చేయడంపై అమెరికా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఉక్రెయిన్ యుద్ధానికి ఈ చమురు సొమ్ము ఉపయోగపడుతోందని.. భారత్ అవసరం వెతుక్కోని వ్యాపారం చేస్తోందని ట్రంప్ సలహాదారుడు పీటర్ నవారో తీవ్ర ఆరోపణలు చేశారు. ట్రంప్ 25 శాతం పెనాల్టీలను భారత్ దిగుమతులపై విధించారు. ట్రంప్ కార్యవర్గం కీలకం నాయకులు న్యూఢిల్లీపై తరుచూ నోటికొచ్చినట్లు ఆరోపణలు చేస్తున్నారు. మరోవైపు చమురు ధరలు పెరిగితే 150 కోట్ల మంది ప్రజలు ఇబ్బంది పడతారని భాతర్ వాదిస్తోంది.

# డికె శివకుమార్ బాటలో మరో ఎమ్మెల్యే.. ఆరెస్సెస్ గీతాలాపన!

**బెంగళూరు, ఆగస్టు 24:** కర్ణాటక అసెంబ్లీలో ఇటీవల డిప్యూటీ సిఎం డికె శివకుమార్ఆరెస్సెస్ గీతాన్ని ఆలపించి చర్చకు తెరలేపారు. తాజాగా ఆయన బాటలోనే మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్‌డి రంగనాథ్ ఆరెస్సెస్ గీతాలాపన చేశారు. అంతేకాదు ఆ గీతాన్ని ఆలపించడంలో తప్పేముందని వ్యాఖ్యానించారు. తుమకూరు జిల్లా కునిగల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రంగనాథ్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా ఆయన ఆరెస్సెస్ గీతం నమస్తే సదా వత్సలను ఆలపించారు. ఈ గీతం చాలా బాగుంది. డిప్యూటీ సిఎం డికె శివకుమార్ అసెంబ్లీలో ఆలపించిన తర్వాత నేనూ విన్నాను. దాని అర్థం కూడా తెలుసుకున్నాను. జన్మభూమికి వందనం చేయాలి అనే అర్థముంది. అందులో నాకేమి తప్పుగా అనిపించలేదు. కాంగ్రెస్ లౌకిక పార్టీ. మేం ఇతరుల నుంచి మంచిని స్వీకరిస్తాం. ఆ గీతాన్ని ఆలపించడంలో తప్పేముంది అన్నారు.

# దుబాయిలో ఆటోమేటెడ్ స్మార్ట్ పోలీస్‌స్టేషన్

## మానవ జోక్యం లేకుండానే పోలీసు సేవలు!

**అబుదాబి, ఆగస్టు 24:** ప్రజా సేవలకు ఆధునిక సాంకేతికతను జోడించే విషయంలో దుబాయ్ మరో ముందడుగు వేసింది. మానవ జోక్యం లేని పూర్తి ఆటోమేటిడ్ స్మార్ట్ పోలీస్ స్టేషన్‌ను డ్రాగన్ మార్ట్‌లో ప్రారంభించింది. దీంతో కృత్రిమ మేధ ఆధారిత పాలనలో దుబాయ్ ప్రపంచ నాయకత్వ స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. పౌరులు, పర్యాటకులు ఇప్పుడు 24 గంటలూ పూర్తిగా ఆటోమేటెడ్, మానవ జోక్యం లేని పోలీసు సేవలు 27 ప్రదేశాల్లో అందుబాటులోకి వచ్చాయి. మధ్య ఆసియాలో స్మార్ట్ పోలీస్ స్టేషన్లు తొలిసారి తీసుకొచ్చిన దుబాయ్.. విప్లవాత్మక ఆవిష్కరణకు తెరతీసింది. ఈ స్టేషన్లు పోలీసు సిబ్బంది లేకుండానే స్వీయ ఆధారిత సేవలు అందిస్తూ రోజుకు 24 గంటలు, వారం పొడవునా అందుబాటులో ఉంటుంది. సాంప్రదాయ పోలీస్ స్టేషన్లకు బదులుగా వేగవంతమైన, సురక్షితమైన, సంపూర్ణంగా డిజిటల్ ప్రత్యామ్నాయాన్ని అందిస్తాయి. ప్రతి స్మార్ట్ పోలీస్ స్టేషన్‌లో దుబాయ్ పౌరులకు ఎమిరైట్స్ ఐడీ, పర్యాటకులకు పాస్‌పోర్ట్‌తోనూ మొబైల్ నెంబర్‌కు ఎస్ఎంఎస్ పంపి గుర్తింపును ధ్రువీకరిస్తారు. స్కార్లు, ప్రింటర్ల వంటి సౌకర్యాలతో పత్రాలను పూర్తిచేసి, అవసరమైతే వీడియో ఇంటర్‌ఫేస్ ద్వారా విధుల్లో ఉన్న పోలీస్ అధికారిని కలవచ్చు, ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఎస్ఎంఎస్ ద్వారా రిఫరెన్స్ నెంబరు, రిసిప్ట్ వస్తుంది. తదుపరి చర్య కోసం ఫిర్యాదను తగిన పోలీసు విభాగాలకు పంపి, సులభంగా ట్రాక్ చేయడానికి వీలు కల్పిస్తుంది. అరబిక్, ఇంగ్లిష్, స్పానిష్, ఫ్రెంచ్, జర్మన్, రష్యన్, చైనా వంటి ఏడు భాషల్లో సేవలు అందుబాటులో ఉంటాయి. నాలుగు ప్రధాన విభాగాల్లో మొత్తం 45 డిజిటల్ సేవలు అందజేయనున్నాయి. 1. క్రిమినల్ సర్వీసులు చెక్ బౌన్సులు, కార్మిక సమస్యలు, అక్రమ రవాణా వంటి క్రిమినల్ వ్యవహారాలపై ఫిర్యాదు. నివాస భద్రత పర్యవేక్షణ కోసం రిక్వెస్ట్‌లు, అనుమానిత చర్యలపై సమాచారం వంటివి ఇందులో ఉంటాయి. 2. ట్రాఫిక్ సర్వీసులు రోడ్డు ప్రమాదాల నివేదిక, వాహనం రంగు మార్పు కోసం దరఖాస్తు, ట్రాఫిక్ స్టేటస్ సర్టిఫికెట్లు, ట్రాఫిక్ ఛలానాల చెల్లింపు. 3. సర్టిఫికెట్లు పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్లు, రాత్రివేళలో పనులు, రహదారి మూసివేతపై అనుమతులు తదితరాలు. 4. కమ్యూనిటీ సర్వీసులు: పర్యాటకుల లేదా ఈవెంట్ భద్రత సేవలకు అనుమతి కోసం దరఖాస్తు, 'లీడర్ ఎట్ యువర్ సర్వీస్' ద్వారా కమ్యూనిటీ ఫీడ్‌బ్యాక్ దుబాయ్ పోలీస్ శాఖలో ఉద్యోగావకాశాలు. గుండె సంబంధిత రోగులకు అత్యవసర సహాయం పోగొట్టుకున్న లేదా చోరీకి గురైన వస్తువులపై ఫిర్యాదు లేదా దొరికిన వస్తువులు అప్పగించడం. వ్యూహాత్మక విస్తరణ, అంతర్జాతీయ గుర్తింపు.. 2017లో సిటీ వాక్ వద్ద మొట్టమొదటి స్మార్ట్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన దుబాయ్.. క్రమంగా వీటిని విస్తరించింది. ప్రస్తుతం 27 పోలీస్ స్టేషన్లను నగర, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్నాయి. 2018లో అరేబియన్ రాంచెస్‌లో వాక్‌ఇన్ మోడల్ స్మార్ట్ పోలీస్ స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. 2023 నాటికి వరల్డ్ ఐలాండ్స్‌లో ఫ్లోటింగ్ ఎస్పీఎస్ కోసం ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఈ మోడల్ ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల దృష్టిని ఆకర్షించింది. ఈ ప్రాజెక్ట్ దుబాయ్ జాతీయ కృత్రిమ మేధ వ్యూహానికి నేరుగా మద్దతు ఇస్తోంది. ప్రభుత్వ వ్యవస్థలను భవిష్యత్తుకు సిద్ధం చేయడం, డిజిటల్ సంసిద్ధత, ప్రజాసేవల సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యం. దుబాయ్ పోలీస్ కమాండర్ ఇన్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ అబ్దుల్లా ఖలీఫా అల్ మర్రీ ఆధ్వర్యంలో ఈ కేంద్రాల విస్తరణ జరుగుతోంది. ప్రస్తుతం ఈ పోలీస్ సేవలు 89.6 శాతం డిజిటల్‌లో జరుగుతున్నాయి.

# ఉక్రెయిన్‌కు మరో 3350 అమెరికా క్షిపణులు

## ఆరువారాల్లో కీవ్‌కు చేరుకోనున్న ఆయుధాలు



**వాషింగ్టన్, ఆగస్టు 24:** ఉక్రెయిన్ గగనతల రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు మరో 3,350లకు పైగా ఎక్స్‌టెండెడ్ రేంజ్ అటాక్ మ్యూనిషన్ (ఇఆర్ఎఎం) క్షిపణులను ఆ దేశానికి అందించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ ఆమోదం తెలిపినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఆయుధ ప్యాకేజీకి యూరోపియన్ దేశాలు నిధులు సమకూరుస్తున్నట్లు తెలిపాయి. దాదాపు ఆరు వారాల్లో ఈ క్షిపణులు కీవ్‌కు చేరుకుంటాయని సమాచారం. అయితే 240 నుంచి 450 కి.మీ. పరిధి కలిగిన ఇఆర్ఎఎం క్షిపణులను రష్యాపైకి ప్రయోగించాలంటే ఉక్రెయిన్ పెంటగాన్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని అమెరికా అధికారులు పేర్కొంటున్నట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్‌కు మరిన్ని ఆయుధాలను సరఫరా చేసే విషయాన్ని అమెరికా ప్రభుత్వం అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. మరోవైపు రష్యా భూభాగంలోని లక్ష్యాలను ఛేదించడానికి అమెరికా రూపొందించిన లాంగ్‌రేంజ్ ఆర్మీ టాక్టికల్ మిస్సైల్ సిస్టమ్స్ (ఎటిఏసిఎంఎస్)ను వినియోగించకుండా పెంటగాన్ అడ్డుకుంటున్నట్లు పలు నివేదికలు సూచిస్తున్నాయి. మాస్కో చేపడుతున్న దాడులకు దీటుగా ఆయుధాలను ఉపయోగించకుండా కీవ్ సామర్థ్యాన్ని పరిమితం చేస్తోందని పేర్కొన్నాయి. యుద్ధం ముగింపునకు తాను ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఇరుదేశాల నేతలు ముందడుగు వేయకపోవడంతో ట్రంప్ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో కీవ్‌కు సహాయంగా అగ్రరాజ్యం పలుమార్లు పెద్ద మొత్తంలో ఆయుధ సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. ఉక్రెయిన్ 32.2 కోట్ల డాలర్ల విలువైన ఆయుధాలు, అత్యాధునిక క్షిపణులు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు అమెరికా విదేశాంగ శాఖ ఇటీవల ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని అమెరికా చట్ట సభకు తెలియజేశామని తెలిపింది. ఇందులో 15 కోట్ల డాలర్లు అమెరికా ఇప్పటికే అమ్మిన ఆర్మర్డ్ వాహనాల నిర్వహణకు, 17.2 కోట్ల డాలర్లు ఉపరితలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణి వ్యవస్థల కొనుగోలుకు వినియోగిస్తారు. ఉక్రెయిన్ దారుణమై దాడులకు గురవుతున్న కారణంగా కీవ్‌కు మరిన్ని ఆయుధాలు పంపుతున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో మరోసారి క్షిపణులను అందజేస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి.



# ఆధునిక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను విజయవంతంగా పరీక్షించిన డిఆర్‌డిఒ

**భువనేశ్వర్, ఆగస్టు 24:** అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్ (ఐఎడిడబ్ల్యుఎస్) తొలి విమాన పరీక్షలను రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ) విజయవంతంగా నిర్వహించింది. దేశీయంగా అభివృద్ధి చేసిన వాయు రక్షణ వ్యవస్థను శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఒడిశా తీరంలో పరీక్షించింది. వివిధ పొరలతో కూడిన వాయు రక్షణ వ్యవస్థ ఐసిడబ్ల్యుఎస్.. ఉపరితలం నుంచి గగనతలానికి క్షిపణులు, వాయు రక్షణ వ్యవస్థ క్షిపణులు, అధిక శక్తిగల లేజర్ ఆధారిత డైరెక్ట్ ఎనర్జీ వెపన్స్ వ్యవస్థను కలిగి ఉంది. ఈ నేపథ్యంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ డిఆర్‌డిఒ, సాయుధదళాలను ఎక్స్ వేదికగా అభినందించారు. ఐఎడబ్ల్యుఎస్‌ను ఈ నెల 23న 12:30 గంటలసమయంలో ఒడిశాతీరంనుంచి డిఆర్‌డిఒ విజయవంతంగా పరీక్షించిందని చెప్పారు.

# రాహుల్‌గాంధీకి ముద్దు పెట్టిన యువకుడు

### భద్రతాసిబ్బంది పట్టుకుని దేహశుద్ధి!

**పాట్నా, ఆగస్టు 24:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన ఓట్ చోర్ యాత్రలో కీలక ఘటన చోటు చేసుకుంది. బైక్ నడుపుతున్న రాహుల్ గాంధీకి ఒక యవకుడు ఆకస్మాత్తుగా వచ్చి ముద్దు పెట్టాడు. ఈ ఊహించని పరిణామంతో.. రాహుల్‌గాంధీతో పాటు ఆయన భద్రత సిబ్బంది ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. భద్రతా సిబ్బంది వెంటనే తేరుకుని.. ఆ ముద్దుపెట్టిన వ్యక్తిని గట్టిగా పక్కకులాగి.. రెండు కొట్టారు. అయితే యువకుడు ముద్దు పెట్టినా.. రాహుల్ గాంధీ మాత్రం తన బైక్‌ను ఆపకుండా ముందుకు సాగిపోయారు. ఈ ఘటన ఆదివారం పుర్ణియా జిల్లాలో చోటుచేసుకుంది. ఓట్ చోర్ యాత్ర పేరుతో రాహుల్ గాంధీ బిహార్‌లో యాత్ర చేపట్టిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలో ఈ యాత్రకు విధుల్లో భాగంగా భద్రత కల్పిస్తున్న పోలీసులతోపాటు ప్రజలు సైతం తీవ్రంగా గాయపడుతున్నారు. ఈ నెల 16న ప్రారంభమైన ఈ యాత్ర.. సెప్టెంబరు 1న పాట్నాలో ముగియనుంది.

# సంక్షిప్తంగా..

## శ్రీలంక మాజీ అధ్యక్షుడు విక్రమసింఘేకు రిమాండ్

**శ్రీలంక, ఆగస్టు 24:** ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి సంబంధించిన కేసులో శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘేను సిఐడి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. 2023 సెప్టెంబరులో లండన్‌లో జరిగిన తన సతీమణి స్నాతకోత్సవం కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఆయన ప్రభుత్వ ఖర్చులతో ప్రయాణించారని ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో కొలంబో క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ ఆయనను ఈ నెల 22న అరెస్ట్ చేసి, కొలంబో ఫోర్ట్ మెజిస్ట్రేట్ కోర్టుముందు హాజరుపరిచింది. వాదనలువిన్న కోర్టు ఆయనకు బెయిల్ నిరాకరించి, రిమాండ్ నిమిత్తం మ్యాగజైన్ జైలుకు తరలించాలంటూ ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ముందు బెయిల్ ఇచ్చేందుకు అవసరమైన అంశాలను ఉంచడంలో న్యాయవాదులు విఫలమైనట్లు న్యాయస్థానం పేర్కొంది. అయితే, జైల్లో ఉన్న సమయంలో విక్రమసింఘేకు బిపి, షుగర్ స్థాయిలు పెరగడం వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. దీంతో ఆయనకు వైద్య పరీక్షల అనంతరం కొలంబో నేషనల్ హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో ఐసియులో చేర్చినట్లు అధికారులు తెలిపారు.

## బీహార్: ఓటర్ల జాబితాలో ఇద్దరు పాకిస్థానీలు



**పాట్నా, ఆగస్టు 24:** దేశ రాజకీయాల్లో ప్రస్తుతం బీహార్ ఎన్నికలు చర్చనీయాంశంగా మారాయి. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్ ఆరోపిస్తుండగా అంతా సవ్యంగానే ఉందని ఎన్నికల సంఘం చెబుతూ వస్తోంది. అయితే తాజాగా బీహార్‌లో ఇద్దరు పాకిస్తానీ మహిళలకు ఇటీవల ఓటరు కార్డులు జారీ కావడంతో కేంద్ర హోంశాఖ చర్యలకు ఉపక్రమించింది. వారి పేర్లను వెంటనే తొలగించాలని యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. ఇమ్రానా ఖానమ్ అలియాస్ ఇమ్రానా ఖాటూన్, ఫిర్దోషియా ఖానమ్ అనే ఇద్దరు మహిళలకు ఇటీవల ఓటరు కార్డులు జారీ అయ్యాయి. దీంతో కేంద్రం హోంశాఖ విచారణ చేపట్టింది. ఫిర్దోషియా 1956లో మూడు నెలల వీసాపై, ఇమ్రానా మూడేళ్ల వీసాపై భారత్‌కు వచ్చి, భాగల్పూర్ జిల్లాలోని భికన్‌పూర్‌లో స్థిరపడ్డారు. వీరికి ఓటర్ కార్డులు ఉండటాన్ని గుర్తించిన కేంద్రం విచారణ జరపాలని, ఓటర్ల జాబితాలో పేర్లు తొలగించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. దీంతో విచారణ ప్రారంభించినట్లు కలెక్టర్ డాక్టర్ నావల్ కిశోర్ చౌదరి చెప్పారు. ఆ ఇద్దరు మహిళలకు నోటీసులు పంపనున్నట్లు వెల్లడించారు.

## ఢిల్లీలో రూ.25 కోట్ల గంజాయి స్వాధీనం

**హైదరాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా గంజాయి స్మగ్లింగ్‌పై పోలీసు విభాగాలు ఉక్కుపాదం మోపుతున్నా స్మగ్లర్లు మాత్రం యధేచ్చ గా తమ వ్యాపారం కొనసాగిస్తూనే వున్నారు. భారత్‌కు చెందిన ఓ యువకుడు బ్యాంకాక్ నుంచి సింగపూర్ మీదుగా ఢిల్లీలోని ఇందిరా గాంధీ అం తర్జాతీయ విమానాశ్రయంలో ఈ నెల 21వ తేదీన రాత్రి సమయంలో దిగాడు. అతను విమానం దిగగానే మూడవ నంబర్ టర్మినల్ నుంచి బయ టకు వచ్చి గ్రీన్ ఛానల్ మార్గం ద్వారా బయటకు వెళ్లేందుకు యత్నించగా భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. అతని లగేజ్ బ్యాగ్‌లో 25 నలుపు రం గు పాలిథిన్ కవర్లలో అనుమానాస్పద వస్తువులు కనిపించడంతో భద్రతా సిబ్బంది తనిఖీలు చేయగా ఇది విదేశీ గంజాయిగా నిర్ధారణ అయ్యింది. వీటిని జప్తు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా తన నేరాన్ని అంగీకరించాడు. బ్యాంకాక్ నుంచి తాను దీనిని ఖరీదు చేసి భారత్‌లో విక్రయించేందుకు తెచ్చినట్లు నిందితుడు చెప్పాడని ఢిల్లీ పోలీసులు వెల్లడించారు.

## కాంగ్రెస్, బిజెపి ఉచ్చులో పడకండి: ప్రశాంత్ కిశోర్

**పాట్నా, ఆగస్టు 24:** బీహార్ ప్రజలను కాంగ్రెస్, బిజెపి పార్టీలు తప్పుదోవ పట్టిస్తున్నాయని ఎన్నికల వ్యూహకర్త, జన్ సూరజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ విమర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న నిజమైన సమస్యలను వదిలేసి 'ఓట్ చోరీ'పైనే పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయని అన్నారు. ఆర్జేడి పార్టీ సూచనల ప్రకారమే రాహుల్‌గాంధీ నడుచుకుంటున్నాడు తప్ప బీహారీల సమస్యలపై ఆయన దృష్టి పెట్టడంలేదని మండిపడ్డారు. ఎన్నికల వేళ రాహుల్ గాంధీని నరేంద్ర మోడీ, నరేంద్ర మోడీని రాహుల్ గాంధీ పరస్పరం విమర్శించుకుంటున్నారని చెప్పారు. ఆ పార్టీల ఉచ్చులో పడొద్దంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. బీహార్‌లో అసలైన సమస్యలు పేదరికం, నిరుద్యోగం, వలసలు, సరైన విద్యా సౌకర్యాలు లేకపోవడం.. వంటి వాటిని ప్రధాన పార్టీలు గాలికి వదిలేశాయని ప్రశాంత్ కిశోర్ఆరోపించారు. ప్రజలసమస్యలు పరిష్కరించేందుకు, ప్రధాన పార్టీలకు ప్రత్యామ్నాయంగా ప్రజలకోసం 'జన్‌సూరజ్ పార్టీ' ఆవిర్భవించిందని ప్రశాంత్ కిశోర్ పేర్కొన్నారు.




దీక్షలో నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

# సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలుచేయాలి

## పిఆర్‌టియు వ్యవస్థాపక అధ్యక్షుడు గలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి విజ్ఞప్తి

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఆగస్టు 24, ప్రభాతవార్త:** 2003లో అప్పటి కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని పీఆర్‌టీయు వ్యవస్థాపక అధ్యక్షులు గలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ధర్నాచౌక్‌లో పీఆర్‌టీయూ తెలంగాణ ఆధ్వర్యంలో సీపీఎస్ రద్దు కోరుతూ దీక్ష చేపట్టారు. ఈ దీక్షనుద్దేశించి హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ 2014లో కొత్త రాష్ట్రం ఏర్పడిన తరువాత పాత పెన్షన్ విధానం అమలవుతేన అవకాశం ఉన్నప్పటికీ, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ జీవో నెంబర్ 28 తీసుకువచ్చి, మళ్లీ సీపీఎస్ విధానాన్ని అమలులోకి తెచ్చారని గుర్తు చేశారు. నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం సీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ అమలుచేయాలని కోరారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఇచ్చిన మాట ప్రకారం సీపీఎస్ రద్దు చేశారని, సీపీఎస్ రద్దు చేయటం వల్ల ప్రభుత్వానికి కూడా ప్రతి ఉద్యోగి నుంచి 10శాతం నిధులు వస్తాయి కాబట్టి, అది ప్రభుత్వానికి కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. 1980ల పూర్వము ఇటువంటి పరిస్థితి ఉండేదని, 189 ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక సంఘాలు దేశ వ్యాప్తంగా 72రోజుల పాటు నిరవధిక సమ్మె జరిపినందున అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ జీవో నెంబర్ 88 తీసుకువచ్చి, పెన్షన్ విధానం అమలుచేశారని గుర్తు చేశారు. 2003లో ఎన్డీఏ ప్రభుత్వం, 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులను మోసం చేసి, సీపీఎస్ రద్దు చేయకపోవటంవల్ల ఉద్యోగులకు పెన్షన్ లేక ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ముదిరెడ్డి చెన్నయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.చంద్రశేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శి బానల రత్నాకర్‌రావు, గౌరవాధ్యక్షులు జి.ఉమాకర్‌రెడ్డి, ఎం. అనంతారెడ్డి, ఎస్.యుగంధర్‌రెడ్డి, కృష్ణ ప్రియ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో గుజ్జ సత్యం, నీల వెంకటేష్ తదితరులు

# పార్టీ పరంగా వద్దు, చట్టపరంగా బిసి రిజర్వేషన్లు కల్పించాలి

## రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), ఆగస్టు 24 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు పార్టీపరంగా కాకుండా చట్టబద్దంగా, రాజ్యాంగ బద్దంగా కేటాయించాలని 18బిసి సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. బిసిల రిజర్వేషన్‌ల విషయంలో ప్రభుత్వం ఊగిసలాడుతున్నదని, గత 8 నెలలుగా జాప్యం చేస్తూ వస్తున్నదని, బిహార్, జార్ఖండ్, తమిళనాడు ప్రభుత్వాలు అనుసరించిన విధానాన్ని ప్రభుత్వం ఎందుకు అవలంభించడం లేదని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. బిసి రిజర్వేషన్‌ల అమలుపై ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 18 బిసి సంఘాల సమావేశం జరిగింది. ఈసమావేశంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బిసిల రిజర్వేషన్‌ల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న ఏఒక్క విధానం సక్రమంగా లేదని, అసెంబ్లీలో బిల్లు పాసైన తరువాత గవర్నర్ అమోదం పొంది, జివొ జారీచేసి ఎన్నికల నోటిఫి కేషన్ ఇస్తే సరిపోయేదని, అప్పుడు ఎవరైన కోర్టుకు వెళితే, కోర్టులో గెలిస్తే ఎన్నికలను నిర్వ హించవచ్చునని, గెలవకపోతే రాజ్యాంగ సవరణ కోసం పోరాటం చేయవచ్చునని చెప్పారు. అలా చేయకుండా ప్రభుత్వం రాష్ట్రపతి అని, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్డ్‌లో చేర్చాలని, రకరకాల వాదనలతో ప్రజలను తప్పుత్రోవ పట్టించి కేంద్రంపై నెట్టి జాప్యం చేసి ప్రజలను మైకంలో ఉంచి చివరకి పార్టీ పరంగా రిజర్వేషన్‌లు కల్పిస్తామని మొదటికి వచ్చిందన్నారు. ఇది సరైన పద్దతి కాదని, ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించమన్నారు.

**నేటి సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలి**

బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు చట్టప్రకారం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయం 10గంటలకు ఇందిరాపార్కు వద్ద 'సత్యాగ్రహ దీక్ష'ను చేపట్టాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఇందులో బిసిలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతంచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం కృషి చేయాలి

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు ఎవిఎన్ రెడ్డి, మల్కకొమరయ్య

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 24:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు ఎవిఎన్ రెడ్డి, మల్కకొమరయ్య పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాదులోని కేశవ మెమోరియల్ పాఠశాలలో జరిగిన తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర కార్య నిర్వాహక వర్గ సమావేశంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు ఎవిఎన్ రెడ్డి, మల్క కొమరయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశంలో ఏబీఆర్ఎస్ఎం జాతీయ ప్రతినిధులు పాలేటి వెంకట్రావు, డాక్టర్ సూరం విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అలుగుపల్లి పాపిరెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిలు బండి రమేష్, తెలకలపల్లి పెంటయ్య వివిధ జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. ఏబిఆర్ఎస్ఎం దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 1న జరగబోయే హమారా విద్యాలయ్ హమారా స్వాభిమాన్ పోస్టర్లను ఎమ్మెల్సీలు, తపస్ రాష్ట్ర అధ్యక్షులు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల విద్యారంగ సమస్యలపై ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తూ ప్రాతినిధ్యం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్యలపై చొరవ చూపించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ మల్క కొమురయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హామి ఇచ్చిన విధంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్(సిపిఎస్) విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వివిధ రకాలైన బిల్లులన్నింటినీ వెంటనే మంజూరు చేయాలని కోరారు.

ప్రభుత్వ పాఠశా లలను కాపాడుకోవడం మన ఉపాధ్యా యుల బాధ్యత అని తపస్ నేతలు గుర్తు చేశారు. సెప్టెంబర్ 1వ తేదీన జరిగే హమారా విద్యాలయ్ హమారా స్వాభిమాన్ కార్యక్రమం విజయవంతం చేసి అత్యధిక పాఠశాలల్లో కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు.

# గురుకులాల్లో చేరే విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

## ఈ యేడాది నుంచే అమలు..ప్రణాళిక సిద్ధం

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 24:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు గురుకులాల్లో చేరాలనుకుంటే.. అటువంటి వారికి ప్రత్యేక శిక్షణను ఇవ్వాలని పాఠశాల విద్య శాఖ నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన శిక్షణను ఈ ఏడాది నుంచే అమలు చేయనుంది. వచ్చే ఏడాది 2026-27 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే టిజి సెట్-2026కి ఇప్పటి నుంచే ప్రత్యేకంగా శిక్షణను ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూల్స్‌లో చదువుతూ వచ్చే ఏడాది గురుకులాల్లో చేరాలనుకునే వారిని గుర్తించాలని జిల్లా విద్యాశాఖాధికారులకు పాఠశాల విద్య డైరెక్టర్ కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. రాష్ట్రంలో 26,120 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు ఉన్నాయి. వాటిలో సుమారు 19.50 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వారిలో ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న వారు వచ్చే ఏడాది 5వ తరగతిలో ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీ, సాధారణ గురులాల్లో 5వ తరగతిలో చేరాలని భావించే వారికి ఈ శిక్షణను ఇవ్వాలని పాఠశాల విద్య శాఖ అధికారులు నిర్ణయించారు. అయితే వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడమంటే.. ప్రభుత్వం నిర్వహించనున్న తెలంగాణ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టిజి సెట్)-2026లో ఎలాంటి ప్రశ్నలు వస్తాయి.. వాటిని ఎలా సాల్వ్ చేయాలో విద్యార్థులకు ప్రత్యేకంగా వివరించనున్నారు. అయితే గురుకులాలకు వెళ్లాలని భావించిన వారికి మాత్రమే శిక్షణను ఇవ్వనున్నారు. 2015లో తెలంగాణ రాష్ట్రంలో వివిధ గురుకులాలను ఎక్కువ సంఖ్యలో ప్రారంభించారు. ప్రధానంగా బిసి సంక్షేమ శాఖలో అధ్వర్యంలో ఎక్కువగా సుమారు 268కి పైగా కొనసాగుతున్నాయి. అన్ని గురుకులాల్లో కలిపి సుమారు 1000కిపైగా గురుకుల స్కూల్స్ ఉన్నాయి. వాటిలో 5వ తరగతిలో నేరుగా అడ్మిషన్లను తీసుకోనుండగా.. 6 నుంచి 10వ తరగతి వరకు ప్రతి ఏడాది ఏర్పడే ఖాళీలకు కూడా ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నారు. ప్రధానంగా 5వ తరగతిలో చేరడం కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షలో అర్హత సాధించేలా శిక్షణను ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. ప్రతి జిల్లాలో కూడా గురుకులాల్లో చేరాలనకునే వారిని గుర్తించి.. వారికి ప్రత్యేక్షంగా శిక్షణను ఇప్పించనున్నారు.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

## పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క




ఆదివారం స్వాతంత్ర్య బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 24:** రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆబిడ్స్‌లో ఉన్నత స్వాతంత్ర్య బాలికల ఉన్నత పాఠశాలలో స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (ఎస్‌టియు టిఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్ రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్ అధ్యక్షతన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, ఎస్‌టియు ఏపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథ్ రెడ్డి, తెలంగాణ పాఠశాల విద్య అడిషనల్ డైరెక్టర్ కె. లింగయ్య, ఆర్జెడి సత్యనారాయణ, సంఘ రాష్ట్ర నాయకులు ఆట సదయ్య, ఎల్. ఎం. ప్రసాద్, జుట్టు గజేందర్, ఎవి సుధాకర్, రవి, నర్సింహారెడ్డి, శంకర్ మాతంగి, పోల్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, కృష్ణా రెడ్డితోపాటు 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. విద్యారంగ అభివృద్ధిలో ఎస్‌టియు కీలక పాత్ర పోషించిందని మంత్రి సీతక్క అన్నారు. పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులను ప్రభుత్వం దశల వారీగా క్లియర్ చేయనుందని తెలిపారు. తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఎస్‌టియు టిఎస్ పాత్రను గుర్తు చేశారు. ఉపాధ్యాయ సంక్షేమానికి పర్వత్ రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడవెంకట్ రెడ్డి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యము రాక పూర్వమే ఏర్పడి,ప్రభుత్వంచే గుర్తింపు పొందిన తొలి ఉపాధ్యాయ సంఘం ఎస్‌టియు అని గుర్తుచేశారు. రాష్ట్రంలో తొలి పిఆర్‌సి ఏర్పాటు, పెన్షన్ రూల్స్ సాధన,అప్రెంటిస్ విధానం రద్దుకొరకు ఎస్‌టియు సంఘం చేసిన కృషిని కొనియాడారు.

# యేడాదిలో పనులు పూర్తి చేయాలి

## పాఠశాల ప్రాంగణం ఆకర్షణీయంగా ఉండాలి

## భవన నిర్మాణానికి 50 కోట్లు మంజూరు

## సమీక్షా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



ఆదివారం సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

**ప్రభాతవార్త, నడిగూడెం,(సూర్యాపేట):** కోదాడలో నాణ్యమైన విద్యా సదుపాయాలు కల్పించేందుకు పనులు వేగవంతం చేయాలని నీటి పారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కోదాడలో కొత్తగా మంజూరైన జవహర్ నవోదయ విద్యాలయ నిర్మాణంపై పురోగతిని సమీక్షించారు. నవోదయ విద్యాలయ సమితి రెండు సంవత్సరాల గడువులో నిర్మాణం పూర్తి చేయాలని నిర్ణయించినప్పటికీ, మంత్రి ఒకే సంవత్సరంలో పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ మంత్రి క్యాంప్ ఆఫీస్‌లో జరిగిన ఈ సమావేశంలో భవన డిజైన్లు, ఆర్కిటెక్చరల్ లేఅవుట్లు తుది నిర్ణయాలు, నిర్మాణ కాలపట్టికల వేగవంతంపై చర్చించారు. భవనాల ఎలివేషన్ నాణ్యమైన వాస్తు శిల్పం ప్రతిబింబించాలని, ప్రాంగణం విద్యార్థులకు ఆకర్షణీయంగా ఉండాలని మంత్రి తెలిపారు. 19.12 ఎకరాల స్థలాన్ని విద్యా భవనాలు, హాస్టళ్లు, సిబ్బంది నివాసాలు, వినోద వేదికల కోసం సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి భవన ప్రణాళికల్లో విద్యార్థులకు అనుకూలమైన మార్పులు చేయాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యం, భద్రత, శ్రేయస్సు దృష్ట్యా ప్రతి సౌకర్యం ఉండాలని అధికారులకు సూచించారు. ప్రతిష్ఠాత్మక జవహర్ నవోదయ విద్యాలయం, కోదాడలోని కెఆర్‌ఆర్ డిగ్రీ కాలేజీ సమీపంలో 19.12 ఎకరాల విస్తీర్ణంలో స్థాపించబడనుంది. కేంద్ర ప్రభుత్వం రూ.50 కోట్లను మంజూరు చేసింది. టెండర్లు కూడా ఫైనల్ అయ్యాయి. ఒక సంవత్సరం లోపల పాఠశాల ప్రారంభించేందుకు మంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ లాజిస్టిక్ సపోర్ట్ అందిస్తున్నారని, అవసరమైన భూసమీకరణ, సామగ్రి ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. జవహర్ నవోదయ విద్యాలయాలను 1986లో అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ గ్రామీణ ప్రతిభావంతుల విద్యార్థులకు ఉచిత, నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రారంభించారని విద్యా మంత్రిత్వశాఖ పరిధిలోని నవోదయ విద్యాలయ సమితి వీటిని నిర్వహిస్తుందని దేశవ్యాప్తంగా 650కి పైగా పాఠశాలలు నడుస్తున్నాయని జె ఎన్ వి ఎస్ టి పరీక్ష ద్వారా ఆరో తరగతి నుండి ప్రవేశాలు కల్పిస్తారు. జిల్లా కలెక్టర్ విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్‌గా ఉంటారని. కోదాడ జవహర్ నవోదయలో ఆరో తరగతి నుండి 12వ తరగతి వరకు సీబీఎస్ఈ సిలబస్‌లో ఆంగ్ల మాధ్యమంలో ఉచిత విద్య అందించబడుతుందని. ప్రతి సంవత్సరం 80 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారని వసతి, భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, షూస్, స్కూల్ బ్యాగులు, స్టేషనరీ ఉచితంగా అందజేయబడతాయని విద్యార్థులు సిబ్బందికి పూర్తి స్థాయి నివాస సదుపాయం ఉంటుందని తెలిపారు. పాఠశాల రోజువారీ కార్యక్రమంలో ఉదయం ప్రార్థనా సభ, విద్యా తరగతులు, మధ్యాహ్నం రీమిడియల్ సెషన్లు, సాయంత్రం పర్యవేక్షిత అధ్యయన సమయాలు ఉంటాయని విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధి లక్ష్యంగా ఈ షెడ్యూల్ రూపొందించబడిందని జిల్లా కలెక్టర్ అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి పాఠశాల నిర్మాణం సమర్థవంతంగా సాగేందుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎన్ వి ఎస్ హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ అభిజిత్ బెరా, జే ఎన్ వి ఖమ్మం ప్రిన్సిపల్ కే. శ్రీనివాసులు, ఎన్ బీసీసీ (హైదరాబాద్) డీజీఎం అబ్దుల్ రహీమ్ ఇతర సీనియర్ అధికారులు సమావేశానికి హాజరయ్యారు.

# సాధారణ స్థితిలోనే మంజీరా గేట్లు

## బ్యారేజీని సందర్శించిన జలమండలి అధికారులు

**హైదరాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరానికి మంచినీరు సరఫరా చేస్తున్న మంజీరా బ్యారేజీ గేట్లు పనిచేయడం లేదని వివిధ మాధ్యమాల్లో ప్రచారం అవుతున్న నేపథ్యంలో మంజీరా బ్యారేజ్‌ను జలమండలి అధికారులు సందర్శించారు. మంజీరా గేట్లు అన్నీ సక్రమంగా పనిచేస్తూ కార్యనిర్వహణ స్థితిలో ఉన్నాయని, ప్రస్తుతం మంజీరా నుండి 2 క్రస్ట్‌గేట్లు మరియు 1 స్కవర్ వెంట్ ద్వారా 15,130 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సింగూర్ నుండి ప్రవాహం 9,226 క్యూసెక్కులు ఉండగా, 13 నుంచి ఆదివారం రోజు ఉదయం 6:00 గంటల వరకు గేట్లలో ఎటువంటి అంతరాయం లేకుండా సగటున 46,000 క్యూసెక్కులతో మొత్తం 28.09 టిఎంసిని విడుదల చేశామని తెలిపారు. మంజీర బ్యారేజ్‌కి గాని, గేట్ల గాని ఎలాంటి ముప్పు కలగలేదని జలమండలి అధికారంగా ప్రకటించారు.

# 28 నుంచి గేట్ దరఖాస్తులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు24:** దేశంలోని ఐఐటీలు సహా పలు ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో ఎం.టెక్, పిహెచ్‌డి కోర్సుల్లో వచ్చే ఏడాది ప్రవేశాలకు నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్ 2026) పరీక్షకు సంబం ధించినఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల తేదీల్లో మార్పు చోటుచేసుకుంది. నోటిఫికేషన్‌లో పేర్కొన్న ప్రకారం సోమవారం (ఆగస్టు25) దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉండగా తాజా నిర్ణయం ప్రకారం ఈ నెల 28నుంచి సెప్టెంబర్ 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించన్నట్లు ఐఐటీ గువాహటి ప్రకటనలో వెల్లడించింది. ఆలస్యరుసుంతో అక్టోబర్ 9వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

# ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ లెక్చరర్లకు పదోన్నతులు కల్పించాలి

## ప్రభుత్వానికి గవర్నమెంట్ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం విజ్ఞప్తి

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 24:** రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న లెక్చరర్లకి అర్హతల మేరకు పదోన్నతులు కల్పించాలని తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపక సంఘం డిమాండ్ చేసింది.

డిగ్రీ కళాశాలల్లో వెం టనే పదోన్నతులు కల్పించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోపి రాష్ట్రప్రధాన కార్య దర్శి డాక్టర్ సురేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రం లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో చాలా కాలంగా పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ నెల 31తో ప్యానల్ ఇయర్ ముగుస్తున్నందున వెంటనే పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేసే జూనియర్ లెక్చరర్స్ నుండి డిగ్రీ లెక్చరర్ పదోన్నతులు, డిగ్రీ లెక్చరర్ నుండి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పదోన్నతుల కొరకు 2024-25 ప్యానల్‌కి సంబంధించి గత సెప్టెంబర్, అక్టోబర్ లోనే కళాశాల విద్యాశాఖ కమిషనర్ సర్క్యులర్ జారీ చేసినప్పటికీ ఇప్పటివరకు పదోన్నతుల ప్రక్రియ పూర్తికాలేదన్నారు. ప్రస్తుత ప్యానల్ ఈ నెల 31తో ముగుస్తున్నందున వెంటనే పదో న్నతుల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.

రాష్ట్రం లోని ప్రభుత్వ డిగ్రీకాలేజీల్లో 2500 వరకు డిగ్రీ లెక్చరర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వాటితో పాటు డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పోస్టులు సుమారు 50వరకు ఖాళీలున్నాయని వాటిని కూడా వెంటనే అర్హత కలిగిన వారితో పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

# సంపాదించడం, పంచడమే మనసంస్కృతి

## సమాజానికి పనికి వచ్చే ఆలోచన విద్యార్థులు చేయాలి: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు




ఆదివారం విద్యార్థులకు డిగ్రీపట్టాలు అందజేస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, దత్తాత్రేయ

**హైదరాబాద్ (బేగంపేట), ఆగస్టు 24,ప్రభాతవార్త:** భారతదేశ సంస్కృతి సంపాదించడం,పంచడం అన్నారు.దేవనార్ ద్వారా డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు సమాజానికి పనికి వచ్చే ఆలోచన చేయాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపు నిచ్చారు.మరుగున పడిపోయిన భారతీయ అసలైన చరిత్రను తెలుసుకోవాలని,తద్వారా అప్పటి త్యాగమూర్తులైన వీరుల నుంచి స్ఫూర్తిని పొంది ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు.బేగంపేట దేవనార్ అంధుల పాఠశాలలో ఆదివారం డాక్టర్ సాయిబాబాగౌడ్ ఇంగ్లీషులో రాసిన ఆయన ఆత్మకథ పుస్తకాన్ని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో దేవనార్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు వెంకయ్యనాయుడు సర్టిఫికెట్లు అందించారు.ఈ కార్యక్రమంలో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాజీ విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్ వీ సుబ్రమణ్యం,సత్యవాణీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిధి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ఇది ఎంతో మంచి కార్యక్రమమని, ఇందులో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.సాయిబాబాగౌడ్ ఆటో బయోగ్రఫీ అందరికీ ఇన్సిపిరేషన్ కావాలన్నారు. సమాజానికి ఆయన అందించే సేవలు ఆదర్శం అన్నారు.సేవాభావం అనేది భారతీయుల స్వభావం అని అందరూ కూడా సేవాభావాన్ని అలవర్చుకోవాలన్నారు.ప్రతి ఒక్కరూ ఇతరులతో పంచుకోవా లన్నారు.ఆపరేషన్ సింధు దాడి కాదని ప్రతి చర్య మాత్రమేనన్నారు.దేవనార్ ఫౌండేషన్ ఛైర్మన్ డా.సాయిబాబాగౌడ్, జ్యోతిగౌడ్‌లు ఇష్టపడి అంధుల పాఠశాలను ప్రారంభించి సేవచేస్తున్నారని అన్నారు.భారత దేశంలో పుట్టిన వారు మాతృభాషను ప్రేమించాలని పేర్కొన్నారు.ఎన్ని భాషలు నేర్చుకుంటే అంత మంచిదన్నారు.గుడ్ మార్నింగ్,గుడ్ ఆఫ్టర్‌నూన్,గుడ్‌ఈవెనింగ్,గుడ్‌నైట్ వద్దు. నమస్కారం అని పలుకరించడం భారతీయుల సంస్కారం అన్నారు.సేవ చేస్తే లభించే సంతృప్తి కంటే మరొకటి లేదన్నారు.ఆర్ఎస్ఎస్ ద్వారా తాను సేవాభావాన్ని నేర్చుకుని చేస్తున్నానన్నారు. హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ దశబ్దాలుగా దేవనార్ వ్యవస్థాపకులు డా.సాయిబాబాగౌడ్, జ్యోతిగౌడ్‌లు తనకు పరిచయస్తులన్నారు.వారు చేస్తున్న సేవలను తాను ఎల్లప్పుడూ అభినందిస్తానన్నారు. దేవనార్‌లో విద్యను అభ్యసిస్తున్న అంధ విద్యార్థులందరనీ ఉన్నత స్థానంలో చూడాలని అభిలషిస్తున్నానన్నారు.

# నేటి నుంచి ఐ సెట్ కౌన్సెలింగ్‌లో వెబ్ ఆప్షన్లు

## ఇప్పటి వరకు 18వేల మందికిపైగా దరఖాస్తు

## 7500 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి హాజరు

## సెప్టెంబర్ 2న సీట్ల కేటాయింపు

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 24:** రాష్ట్రంలోని ఎంబిఏ, ఎంసిఏ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ఐ సెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా నేటి(సోమవారం) నుంచి వెబ్ ఆప్షన్లు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 20 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇప్పటి వరకుకు సుమారు 18వేల మందికిపైగా ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. ఈ నెల 28 వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. శుక్రవారం నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రారంభం కాగా ఇప్పటి వరకు 7500 మంది హాజరయ్యారు. ఈ నెల 29 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరగనుంది. అయితే ఈ నెల 27న వినాయక చవితి కావడంతో ఆ రోజు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉండదని అధికారులు ప్రకటించారు. నేటి(సోమవారం) నుంచి వెబ్ ఆప్షన్లకి అవకాశం కల్పించారు. ఈ నెల 30 వరకు ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశమిచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి సెప్టెంబర్ 2న సీట్ల కేటాయింపు చేయనున్నారు.

# 'జనహిత'లాజిస్టిక్ కమిటీ కన్వీర్‌గా బొంతు రాంమోహాన్

**హైదరాబాద్, ఆగస్టు 23,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మహేష్ కుమార్, తెలంగాణ ఏఐసిసి ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ చేపట్టిన జనహిత పాదయాత్ర, శ్రమదానంకు అరెంజ్‌మెంట్ అండ్ లాజిస్టిక్ కమిటీ కన్వీనర్‌గా బొంతు రాంమోహన్‌ను టిపిసిసి కన్వనర్ కుమార్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. కో కన్వీనర్‌గా మొగుల్లా రాజిరెడ్డి, సభ్యులుగా అనిల్ కుమార్ గౌడ్,ఎండి అవిజోద్దిన్,ఎంఏ అన్సారీ, మిద్దెశ్రీనివాసులు నియమించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శ్రీ మహేష్ కుమార్ గౌడ్ చేపట్టిన జనహిత పాదయాత్ర శ్రమదానం రెండో విడత ఆదివారం సాయంత్రం 5 గంటలకు కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం ఉప్పర్ మల్యాల నుంచి ప్రారంభమైంది. వరంగల్ జిల్లా వర్ధన్నపేట వద్ద ముగియనుంది. ఈ పాదయాత్రకు ముఖ్య అతిథిగా ఏఐసీసీ ఇంచార్జ మీనాక్షి నటరాజన్ పాల్గొన్నారు. రెండో విడత జనహిత పాదయాత్ర తొలి రోజు ఉప్పర్ మల్యాల నుంచి కురిక్యాల మీదుగా గంగాధర - మధురనగర్ చౌరస్తా (ఎక్స్ రోడ్) వరకు కొనసాగింది.

# స్థానిక సంస్థల ఎన్నికలు ప్రభుత్వ పనితీరుకు రిఫరెండమ్

## ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్, ఆగస్టు 24,ప్రభాతవార్త:** స్థానిక సంస్థలు మా ప్రభుత్వ పనితీరుకు రెఫరెండం, కెటిఆర్ నీకు దమ్ము ఏమిటో స్థానిక సంస్థల ఎన్నికలలో గెలిచి చూపించు అని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ సవాల్ విసిరారు. సిఎల్‌పి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ పార్టీ పిరాయింపులపైన కెటిఆర్ మాట్లాడటం అంటే వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు వెళ్ళినట్లు ఉందని ఎద్దేవా చేశారు. పదేళ్ల పాటు అత్యంత నిర్లజ్జగా పార్టీ ఫిరాయింపులు చేసిన కెటిఆర్ ఇప్పుడు దొంగ ఏడుపులు ఏడుస్తున్నాడనీ విమర్శించారు. పార్టీ మారిన ఎంఎల్ ఏలు రాజీనామా చేయాలని అడిగే నైతిక హక్కు కెటిఆర్‌కులేదఅన్నారు. పదేళ్ళలో 60మందికి ఎంఎల్‌ఏలు,ఎంఎల్సీ లను చేర్చుకున్నప్పుడు ఎందుకు రాజీనామా చేయించలేదు? అని నిలదీశారు. ఎందుకు పార్టీలకు పార్టీలను బిఆర్ఎస్‌లో విలీనం చేసుకున్నావ్?ఆనాడు ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా ఉప ఎన్నికలు వచ్చినా గెలిపించే దమ్ము మా సిఎం రేవంత్ రెడ్డికి ఉంది అని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను రెఫరెండంగా మేము భావిస్తాం నీకు దమ్ము ధైర్యం ఉంటే ఛాలెంజ్ చేయి అని అన్నారు. భవిషత్‌లో నీకు,నీ అయ్యకు రాజకీయ సన్యాసం ఖాయం అని జోస్యం చెప్పారు.

# అన్నదాతకు యూరియా కష్టాలు

### గంటల తరబడి క్యూల్లో చెప్పులు, పిల్లలు

### తీవ్రతరం అవుతున్న ఆందోళనలు

### ఉద్రిక్తతకు దారి తీస్తున్న కొరత




**హైదరాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అన్నదాతలను యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి. పంటలకు కావాల్సిన యూరియా లభ్యం కాకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. ఉదయం 5 గంటల నుండే రైతులు పలు సహకార సంఘాల వద్దకు చేరుకొని యూరియా కోసం ఎదురుచూస్తున్నారు. పెద్ద సంఖ్యలో రైతులు బారులు తీరుతూ క్యూ లైన్లనో చెప్పులు పెడుతున్నారు. రోడ్లపైకి వచ్చి రాస్తా రోకోలు చేస్తున్నారు. అయ్యా యూరియా అంటూ అధికారుల ముందు ధీనంగా వేడుకుంటున్నారు. గంటల తరబడి క్యూల్లో ఉంటున్నా యూరియా దొరకని పరిస్థితి ఏర్పడింది. నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ నియోజకవర్గం హాలియాలోని కొత్తపల్లి సహకార సంఘంలో బడికి వెళ్లే తన ఏడేండ్ల కుమారుడిని తీసుకొచ్చి ఓ రైతు క్యూలో నిలబెట్టారు. కొందరు కూలీలను తీసుకువచ్చి రోజుకు రూ.50 చొప్పున చెల్లించి లైన్లో నిలబెడుతున్నారు. మరికొన్ని జిల్లాల్లో యూరియా కోసం వెళ్లిన రైతులపై పోలీసులు లాఠీలతో ప్రతాపం చూపిన ఘటనలు కలకలం రేపుతున్నాయి. అన్నింటినీ భరిస్తూ అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. మండుటెండలు, భారీ వర్షాలను కూడా లెక్క చేయకుండా తమ వంతు వచ్చే వరకూ నిరీక్షిస్తూ తంటాలు పడుతున్నారు. సింగిల్ విండోలు, ఆగ్రోస్, ప్రైవేటు ఫెర్టిలైజర్ల వద్ద బారులు తీరుతున్నారు. కనీసం బ్లాక్‌లో కూడా యూరియా దొరక్కపోవడంతో రొడ్డెక్కుతున్నారు. దీంతో రాష్ట్రంలోని అధిక జిల్లాల్లో యూరియా కోసం రైతులు ఆందోళనల బాట పట్టారు. యూరియా ఎందుకు ఇవ్వడంలేదంటూ ఆందోళనలు, రాస్తారోకోలు నిర్వహిస్తున్నారు. కరీంనగర్ జిల్లాలో ఇందుర్తి సొసైటీ యూరియా కేంద్రం వద్ద రైతులు శనివారం రాత్రి నుండి పెద్ద ఎత్తున చేరుకొని క్యూలో చెప్పులు పెట్టి పడి కాపులు కాశారు. ఆదివారం తెల్లవారుజామున నుండి సుమారు 800 మందికి పైగా రైతులు కేంద్రానికి చేరుకొని బారులు తీరారు. ఒక్కలోడు 400 బస్తాలకు కాను 800 మందికి పైగా రైతులు బారులు తీరారు. కేంద్రం వద్ద యూరియా కోసం రైతులు పోటీ పడడంతో నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. వెన్కెపల్లి సొసైటీకి 230 బస్తాలు రాగా, 500 మందికి పైగా రైతులు అక్కడకు చేరుకున్నారు. మహిళలు, వృద్ధులు క్యూలో నిరసించారు. సహకార సిబ్బంది ఒక్కక్కరికి ఒక బస్తా చొప్పున టొకెన్లు ఇచ్చారు. మహబూబాబాద్ జిల్లాలో యూరియా వస్తుందని తెలుసుకున్న రైతులు వ్యవసాయ సహకార సంఘం తీయకముందే ఆధార్ కార్డులు లైన్‌లో పెట్టి గంటల తరబడి వేచి ఉన్నారు. గత కొద్దిరోజులుగా జిల్లాలో ఇదే పరిస్థితి నెలకొనగా సిద్దిపేట జిల్లా రైతులు విసిగిపోతున్నారు. ఇలా అయితే పని అయ్యేలా లేదని అల్వాల్ గ్రామ రైతులు రైతు వేదికలో ఇద్దరు వ్యవసాయ అధికారులను కార్యాలయం లోపల వేసి బయటకు తాళం వేశారు. అల్వాల గ్రామంలో శనివారం రెండు లారీలా యూరియాను పంపిణీ చేసారు. ఇంకా కొంతమంది రైతులకు యూరియా తక్కువ పడటంతో ఆగ్రహించిన రైతులు వ్యవసాయ అధికారులను రైతు వేదిక భవనంలో బంధించి తాళం వేసారు. అక్కడే ఉన్న పోలీసులు ఎంత నచ్చజెప్పినా కూడా రైతులు వినలేదు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో యూరియా కోసం రైతులు రోడ్డెక్కి నిరసన తెలిపారు. మూడు రోజులుగా యూరియా దొరకడం లేదంటూ రోడ్డుపై బైఠాయించి, రాకపోకలను అడ్డుకున్నారు. మహబూబాబాద్ జిల్లాలో లైన్‌లో నిలబడ్డా యూరియా దొరకలేదు. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్‌కు పది రోజుల క్రితం 300 బ్యాగులు రావడంతో ఆ గ్రామానికి గతంలో అనుబంధంగా ఉండి, ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పడిన పోతిరెడ్డిపల్లి గ్రామస్థులకు యూరియా బస్తాలు ఇచ్చేది లేదని వెంకటాపూర్ రైతులు నిరాకరించారు. రైతుల మధ్య కొంత ఘర్షణ చోటుచేసుకోగా, అందులో కొందరికి మాత్రమే యూరియా బస్తాలు అందాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎరువుల విక్రయ కేంద్రం వద్ద క్యూలో గంటల తరబడి నిలబడటంతో ఒక మహిళా రైతు నీరసించి కళ్లు తిరగడంతో కింద పడిపోయింది.

# గణేశ్, దుర్గామాత మండపాలకు ఉచిత విద్యుత్

### అనుమతి ఉన్న మండపాలకే సౌకర్యం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు24:** తెలంగాణలో పండుగ వాతావరణం నెలకొంటున్న వేళ, రాష్ట్ర ప్రభుత్వం ఉత్సవ నిర్వాహకులకు ఆదివారం సాయంత్రం ఒక తీపికబురు అందించింది. వినాయక చవితి, దసరా నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసే గణేశ్, దుర్గామాత మండపాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందని, అయితే నిర్వాహకులు తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతి పొంది ఉండాలని స్పష్టం చేసింది. ఈ నెల 27వ తేదీ నుంచి గణేశ్ చతుర్థి ఉత్సవాలు ప్రారంభం కానుండటంతో ప్రభుత్వ నిర్ణయంపై నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రాజధాని హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో మండపాల ఏర్పాటు పనులు ముమ్మ రంగా సాగుతున్నాయి. ముఖ్యంగా, తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రసిద్ధి చెందిన ఖైరతాబాద్ మహాగణపతి విగ్రహ నిర్మాణ పనులు తుది ఘట్టానికి చేరుకున్నాయి. ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను ప్రకటించడంతో ఈ ఏడాది ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు వీలు కలుగుతుందని భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయంతో మండపాలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గనుంది.

# రాష్ట్రాలను మున్సిపాలిటీల స్థాయికి దిగజార్చుతున్నారు

### దేశంలో ఫెడరల్ స్ఫూర్తికి తీవ్ర ముప్పు వాటిల్లుతోంది

### తమిళనాడు పాలన దేశానికే ఆదర్శమంటూ ప్రశంసలు

### మద్దతు ఇచ్చిన స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలిపిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు24:** దేశంలో ప్రస్తుతం సమాఖ్య స్ఫూర్తికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని, రాష్ట్రాల అధికారాలను హరించి వాటిని కేవలం మున్సిపాలిటీల స్థాయికి తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రతిపక్ష ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఉపరాష్ట్రపతిగా ఎన్నికైతే రాజ్యాంగాన్ని పరిరక్షించడమే తన ప్రథమ కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం చెన్నైలో జరిగిన ఓ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. .దేశంలో అధికారాన్ని కేంద్రీకరించే ప్రయత్నాలు నానాటికీ పెరుగుతున్నాయి. ఇది రాజ్యాంగ మౌలిక స్వరూపానికి గొడ్డలిపెట్టు లాంటిది. జీఎస్టీ విధానంలో మార్పులు తీసుకురావడం, రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని దెబ్బతీసేలా విధానాలు రూపొందించడం వంటి చర్యలు సమాఖ్య వ్యవస్థను తీవ్రంగా బలహీనపరుస్తున్నాయి. ఈ ప్రయత్నాలు ఇలాగే కొనసాగితే, రాష్ట్రాలు తమ ప్రాముఖ్యతను కోల్పోయి కేవలం మున్సిపాలిటీలుగా మిగిలిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దేశమంటే రాష్ట్రాల సమాహారం అనే విషయాన్ని అందరూ గుర్తించాలని జస్టిస్ రెడ్డి నొక్కి చెప్పారు. భారతదేశ బలం భిన్నత్వంలో ఏకత్వంలోనే ఉంది. మన రాజ్యాంగం కూడా రాష్ట్రాల ఐక్యతకే పెద్దపీట వేసింది. ఈ ప్రాథమిక సూత్రాన్ని కాపాడుకున్నప్పుడే ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. సమాఖ్య హక్కుల కోసం తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ గట్టిగా పోరాడుతున్నారని ప్రశంసించారు. తన న్యాయవాద వృత్తిని గుర్తుచేసుకుంటూ, గత 52 ఏళ్లుగా న్యాయమూర్తిగా నేను రాజ్యాంగాన్ని నిలబెట్టాను. ప్రజలు నాకు అవకాశం ఇస్తే, భవిష్యత్తులో కూడా రాజ్యాంగాన్ని కాపాడటానికి, దాని విలువలను పరిరక్షించడానికి కట్టుబడి ఉంటాను. నాపై నమ్మకం ఉంచిన ప్రజలను గానీ, రాజ్యాంగాన్ని గానీ నేను ఎప్పటికీ నిరాశపరచనని పేర్కొన్నారు. అంతకుముందు, పాలనలో తమిళనాడు దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఆయన కొనియాడారు. ఆరోగ్యం, విద్య, సామాజికఆర్థిక అభివృద్ధి వంటి రంగాల్లో తమిళనాడు అద్భుతమైన దార్శనికతతో ముందుకు సాగుతోంది. మానవాభివృద్ధిలో ఈ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా ఉందని పేర్కొన్నారు. తన అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపిన ముఖ్యమంత్రి స్టాలిన్‌తో పాటు ఇండియా కూటమిలోని ఇతర నేతలందరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై వారు ఉంచిన నమ్మకానికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని, రాజ్యాంగ పరిరక్షణకు తన జీవితాన్ని అంకితం చేస్తానని ఆయన పునరుద్ఘాటించారు.

# చెరువులో చేరిన నీరు..పదిలమేనా?

### శిథిలమైన తూములు, వాటి రక్షణ రాతిగోడలు

### నీటి నియంత్రణ చేసే రాడ్స్‌కూడా దెబ్బతిన్నవైనం



**హైదరాబాద్,ఆగస్టు 24,ప్రభాతవార్త:** తెలంగాణలో వరుసగా కురుస్తున్న భారీవర్షాలతో చెరువులో చేరిన నీరు పదిలమేనా అనే ప్రశ్న తలెత్తుతోన్నది. చెరువుల మరమ్మతు కట్టలు,తూముల పటిష్టతకు అరకొరగానిధులు విడుదల కావడంతో రాష్ట్రంలో చెరువుల పరిస్థితి అనిశ్చితికి గురిచేస్తున్నది. గత కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు రాష్ట్రంలో చెరువులకు అక్కడక్కడ గండ్లు పడ్డాయి. కట్టలు బలహీనంగా ఉండటం,తూములు దెబ్బతిన్నా వాటికి శాశ్వతంగా మరమ్మతులు చేపట్టకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. రాష్ట్రంలో 34,740 చెరువులు ఉండగా అందులో 12,023 చెరువులు పూర్తి స్థాయిలో నిండాయి. రాష్ట్రంలో సగటు వర్షపు రోజులు 47 నమోదైకాగా, సాధారణం కంటే 60శాతం అధిక వర్షం కురిసింది. సాధారణ రాష్ట్ర సగటు వర్షాపాతం 525.1మి.మికాగా 611 మి.మి వర్షాపాతం నమోదైంది.నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, యాదాద్రి భువనగిరి,రంగారెడ్డి జిల్లాలో అతి అత్యధికవర్షాపాతం నమోదైంది.12జిల్లాలో అధిక వర్షాపాతం, మిగితా జిల్లాలో సాధారణ వర్షాపాతం నమోంది. భారీ వర్షాలు కురిసినాప్రధాన వాగులు పొంగి పొర్లుతున్న జిల్లాలో కూడా నీరులేక వట్టిపోయి కనిస్తున్నాయి. మరోవైపు సాధారణ వర్షాపాతం నమోదైన జిల్లాలో కూడా నీటి వనరులు దెబ్బతిన్నాయి. 2వారాలుగా కురుస్తున్న వర్షాలకు చెరువుల కట్టలు తెగడం, కాల్వలుధ్వంసం, లిఫ్ట్‌లు దెబ్బతినడం వంటి 177 సంఘటనలు జరిగాయి.నీటివనరుల తాత్కాలిక మరమ్మతులకు రూ.335కోట్ల రూపాయలు కేటాయించినట్లు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.చెరువుల పటిష్ఠతకు సంబంధించి గతేడాది అనుకున్న విధంగా నిధులు మంజూరు కాలేదు. రెండేళ్ల కిందట కురిసిన భారీ వర్షాలతో రాష్ట్రంలోని చాలా చెరువులకు గండ్లు పడ్డాయి. అక్కడక్కడా గ్రామస్థులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి నీటిని కాపాడుకున్నారు. తెలంగాణ వ్యాప్తంగా గత వర్షాకాలం దెబ్బతిన్న చెరువుల మరమ్మతుకు పంపిన ప్రతిపాదనలకు నిధులు విడుదల కాలేదు.తెలంగాణలోని మొత్తంచెరువులు, కుంటలకు దాదాపు 300 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యముండటంతో వాటి పరిధిలో 50లక్షల కుపైగా ఎకరాల ఆయకట్టు ఉంది. తెలంగాణ ఏర్పాటైన కొత్తలోమిషన్ కాకతీయలో భాగంగా చెరువులు పునరుద్ధరించారు. తరువాత మరమ్మతులు, ఆధునికీకరణ పనులు పట్టించుకున్నవారు లేరు.శిథిలావస్థలో ఉన్న చెరువు తూము వద్ద మరమ్మతుల కోసం నిధులు అరకొరగా ప్రతిపాదించి చేపట్టిన మరమ్మతు పనులకు ఆలస్యంగా నిధులు కేటాయించారు. వాస్తవానికి ఎండాకాలం వరకే టెండర్లు పూర్తయి పనులు జరిపించాలి. కానీ వర్షాకాలం ముందర పనులు చేపట్టారు. వానాకాలం పంటల కోసం భూగర్భజలాలు కాకుండా భూఉపరితల జలాలు ప్రాజెక్టులు,చెరువులు కుంటలు వాగుల వంటి జలాశయాల నుంచి 300టిఎంసిల నీరును తెలంగాణలో రైతులు ఉపయోగిస్తారు.యాదాద్రి భువనగిరి జిల్లాలో అతి అత్యధిక వర్షాపాతం నమోదైనప్పటికి అక్కడ చెరువులు పూర్తిగా నిండని పరిస్థితి నెలకొంది.చౌటుప్పల్, లక్కారంలోని చెరువుల్లోకి చుక్క నీరు చేరలేదు. భారీ వర్షాలు కురిసి వాగులు పారితే మల్కాపురం, కైతాపురం, లక్కారం, చౌటుప్పల్ వరకు గొలుసు చెరువులు నిండి అలుగు పోస్తాయి. ఇప్పటి వరకు ఆపరిస్థితి లేదు.రాజపేట మండలంలో అతి పెద్ద చెరువులైన కుర్రారం ఊర చెరువు, పాముకుంట వెంకటాద్రి చెరువు, రాజపేట గోపాల్ చెరువు.సింగారం రెడ్డి చెరువు, బొందుగుల, నెమిల గ్రామాల్లోని ఊర చెరువుల పరిస్థితి దయనీయంగా ఉంది. సిద్దిపేట జిల్లా దామెరచెరువు కాలువకు గండి పడింది. రాజన్నసిరిసిల్ల జిల్లాలోఎగువమానేరు మత్తడి పారుతున్నా సముద్ర లింగపూర్ సింగసముద్రం చెరువు, రాచర్లబొప్పాపూర్ జక్కులచెరువకు నీరుకు కాలువలు మరమ్మతు చేయకపోవడంతో నీరు రావడంలేదు.మంచిర్యాల జిల్లాలో 634 చెరువులలో సగానికి పైగా కట్టెలు బలహీనంగా ఉన్నాయి. దండేపల్లి మండల కేంద్రంలోని ఎర్రగుంట చెరువు తరహాలో అనేక చెరువుల తూములు వాటి పక్కనే ఉండే రక్షణ గోడలు శిథిలం కావడంతో వరదలు వస్తే ప్రమాదం పొంచి ఉంది.తూము నుంచి నీటి విడుదల నిలుపుదల నియంత్రణ చేసే రాడ్స్ కూడా దెబ్బతిన్నాయి.

నెన్నెల మండలం కోనంపేట గ్రామంలోని కొత్తచెరువు ఇటీవల కురిసిన వరాలకు కట్ట తెగి నీరు కిందికి పోయింది. కట్ట బలహీనంగా ఉండటంతో ఇలా జరిగింది. ప్రస్తుతం దీనికి తాత్కాలిక మరమ్మతులు కొనసాగుతున్నాయి. జిల్లాలో సుమారుగా 50 చెరువులకు మరమ్మతులు అవసరం ఉన్నా ఎక్కువగా ఇబ్బంది ఉన్న 8 చెరువులను గుర్తించి వీటి కోసం ప్రతిపాదనలు పంపారు. భీమిని మండలంలో 3, నెన్నెలలో 2, తాండూరు, కన్నెపల్లి, బెల్లంపల్లిలో ఒక్కోటి చొప్పున మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపారు. పూడిక నిండటం మరమ్మతు లేకపోవడం వల్ల ఆయకట్టు 62138ఎకరాల నుంచి 39 218 ఎకరాలకు కుంచించుకు పోయింది.

# యెమెన్ రాజధాని సనాపై భారీగా వైమానిక దాడులు

### హౌతీ తిరుగుబాటుదారులే ఇజ్రాయెల్ లక్ష్యం



**సనా, ఆగస్టు 24:** యెమెన్ రాజధాని సనాపై ఇజ్రాయెల్ ఆదివారం భారీగా వైమానిక దాడులు నిర్వహించింది. ఇరాన్ మద్దతు గల హౌతీ తిరుగుబాటుదారులను లక్ష్యంగా చేసుకొని దాడులకు దిగింది. కొన్ని రోజుల క్రితం హౌతీ తిరుగుబాటుదారులు ఇజ్రాయెల్ వైపు క్లస్టర్ బాంబులను ప్రయోగించిన విషయం తెలిసిందే. గత కొంతకాలంగా రెడ్‌సీలో , అడెన్ గల్ఫ్‌లో వాణిజ్య నౌకలపై హౌతీలు దాడులు పెంచిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరపడం ప్రాధాన్యం సంతరించుకుంది. వాస్తవానికి హైతీ దాడులు ఇజ్రాయెల్‌కు నౌకల భద్రతకు తీవ్ర ముప్పుగా మారింది. యెమెన్ రాజధాని సనాలోని కీలక ప్రాంతాల్లో, అలాగే హైతీల ఆధీనంలో ఉన్న ప్రాంతాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగినట్లుగా యెమెన్ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. పేలుడు శబ్దాలు, పొగ దట్టంగా వ్యాపించింది. అయితే, హౌతీ తిరుగుబాబుదారులు ఇప్పటి వరకు జరిపిన దాడులతో జరిగిన ఆస్తి నష్టం, ప్రాణనష్టంపై ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. తమ దేశ అంతర్గత వ్యవహారాల్లో ఇజ్రాయెల్ జోక్యం చేసుకుంటోందని హౌతీ అధికార ప్రతినిధులు మండిపడ్డారు. ఈ దాడుల గురించి ఇజ్రాయెల్ సైన్యం నుంచి సైతం ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల కాలేదు. తమ ప్రయోజనాలు, నౌకల భద్రతకు ముప్పు వాటిల్లిన సమయంలో కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించిన విషయం తెలిసిందే. హైతీ తిరుగుబాటుదారులు చాలాకాలంగా ఇజ్రాయెల్‌వైపు డ్రోన్లు, క్షిపణులను ప్రయోగిస్తున్నారు. ఎర్రసముద్రంలో ఓడలపై దాడి చేశారు. ముఖ్యంగా గాజాస్ట్రిప్‌లో యుద్ధం మొదలైనప్పటి నుంచి పాలస్తీనియన్లకు మద్దతుగా తాము ఈ చర్యలకు దిగినట్లు పేర్కొన్నారు. ఇజ్రాయెల్ వైమానిక రక్షణవ్యవస్థ చాలా మిసైళ్లను, డ్రోన్లను గాల్లోనే ధ్వంసం చేయగా తాజాగా క్లస్టర్ బాంబులతో హౌతీలు విరుచుకుపడ్డారు. హైతీ తిరుగుబాటుదారులనియంత్రణలో ఉన్న అల్-మసిరా టివి ఛానల్ ఆదివారం జరిగిన వైమానిక దాడి ఈ నెల 17 తర్వాత జరిగిన మొదటి దాడి అని పేర్కొంది. దీనికి ముందు ఇజ్రాయెల్ ఇంధన మౌలిక సదుపాయాలతో అనుసంధానించబడిన, తిరుగుబాటుదారులు ఉపయోగిస్తున్న స్థావరాలపై దాడి చేసింది. అయితే, ఆదివారం జరిగిన దాడిని ఇజ్రాయెల్ అధికారికంగా ధ్రువీకరించలేదు. గాజా యుద్ధం ప్రభావం ఇజ్రాయెల్-పాలస్తీనాకే పరిమితం కాలేదు. యెమెన్ సహా పలు ప్రాంతాలకు విస్తరించింది.

# అమెరికా ఒత్తిడికి తలొగ్గే ప్రసక్తే లేదు

### ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ



**టెహ్రాన్, ఆగస్టు 24:** ఇస్లామిక్ రిపబ్లిక్‌ను లొంగ దీసుకునేందుకు అమెరికా ప్రయత్నిస్తోందని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ అన్నారు. దీనిని ఎదుర్కోవడానికి యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ అవసరమని పిలుపునిచ్చారు. రాజధాని టెహ్రాన్‌లోని ఒక మసీదులో తాజాగా ఖమేనీ ప్రసంగించారు. ఇటీవల తమపై ఇజ్రాయెల్, యుఎస్‌లు చేసిన దాడి కీలకమైన అణుకేంద్రాలే లక్ష్యంగా జరిగాయన్నారు. ఇస్లామిక్ రిపబ్లిక్‌ను అస్థిరపరచడానికే ఈ చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. అమెరికా ఎల్లప్పుడూ దానికి విధేయుడిగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఒత్తిడికి ఇరాన్ తలొగ్గదని స్పష్టం చేశారు. కాగా, ఇరాన్ మంగళవారం బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీలతో అణుచర్చల కోసం సమావేశం కానుంది. ఈ నేపథ్యంలో ఖమేనీ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

# మాజీ సిఎం చంపాయ్ సోరెన్ గృహనిర్బంధం

**రాంచీ, ఆగస్టు 24:** ప్రభుత్వ ఆస్పత్రి కోసం భూసేకరణ చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ గిరిజన సంస్థలు నిరసనలకు పిలుపునివ్వడంతో.. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి చంపాయ్ సోరెన్‌ను ఆదివారం గృహనిర్బంధంలో ఉంచారు. రాంచీకి వెళ్తుండగా మార్గమధ్యంలోనే చంపాయ్ సోరెన్ కుమారుడు బాబూలాల్ సోరెన్, అతని మద్దతుదారులను కూడా నిర్బంధంలోకి తీసుకున్నారు. గిరిజన సంస్థల నిరసనల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ముందుజాగ్రత్తగా చంపాయ్‌సోరెన్‌ను హౌస్ అరెస్టు చేసినట్లు రాంచీ నగర డిఎస్‌పి కెవి రామన్ తెలిపారు. గిరిజన సంస్థల నిరసనలను దృష్టిలో ఉంచుకుని రాంచీలో భద్రతను కట్టుదిట్టడం చేశారు. వ్యూహాత్మక ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీనికి ముందు సోరెన్ మీడియా సమావేశంలో జెఎంఎం ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. గిరిజన భూములను ప్రభుత్వం ఆక్రమించుకుంటోందని ఆరోపించారు.
రాంచీ నగ్రా ఏరియాలో రూ. 1,000 కోట్లతో రిమ్స్-2 ఆస్పత్రి కోసం బలవంతంగా గిరిజనుల భూములు లాక్కున్నారని, వారికి పరిహారం కానీ, భూములు ఖాళీ చేయమని నోటీసులు ఇవ్వడం కానీ జరగలేదని చంపాయ్‌సోరెన్ ఆరోపించారు. తాము ఆస్పత్రి ప్రాజెక్టుకు వ్యతిరేకం కాదని, రాంచీలో నిరుపయోగంగా ఎన్నో ఎకరాల భూము లున్నాయని, అక్కడ ఆస్పత్రి కట్టవచ్చని అన్నారు. రాష్ట్రంలో గిరిజనులను లక్ష్యంగా చేసుకుంటున్నారని, హక్కుల కోసం అడిగితే ప్రాణాలు తీస్తున్నారని ఆరోపించారు.

# పంజాబ్‌లో పేలిన గ్యాస్ టాంకర్: ఏడుగురు దుర్మరణం

**చండీగఢ్, ఆగస్టు 24:** పంజాబ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి ఓ ఎల్పీజి గ్యాస్ ట్యాంకర్, ట్రక్కు ఢీ కొన్నాయి. దీంతో గ్యాస్ ట్యాంకర్ పేలిపోయింది. భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే చనిపోయారు. ఆదివారానికి మృతుల సంఖ్య ఏడుకు చేరింది. గాయాలపాలైన మరో పదిహేను మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. హోషియార్‌పూర్ జిల్లాలోని మండియాలాలో ఈ ఘోర ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంపై డిప్యూటీ కమిషనర్ ఆషికాజైన్ స్పందిస్తూ.. ప్రమాద సమాచారం అందిన వెంటనే వేగంగా స్పందించామన్నారు. ఘటనాస్థలానికి అగ్నిమాపక వాహనాలు, అంబులెన్స్‌లు మరియు పంజాబ్ పోలీసులు చేరుకుని బాధితులకు సాయం అందించారు. గాయపడిన వారిని అంబులెన్స్‌లలో సమీప ఆసుపత్రులకు తరలించినట్లు వెల్లడించారు. ట్రక్కును ఢీ కొట్టడంతో ట్యాంకర్ నుంచి గ్యాస్ లీక్ అయిందని, దీంతో పేలుడు సంభవించిందని చెప్పారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పంజాబ్ మంత్రి రవ్‌జోత్ సింగ్ పరామర్శించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

# కెసిఆర్‌కు మళ్లీ అస్వస్థత

### పర్యవేక్షిస్తున్న వైద్యులు

### ఫాంహౌస్‌కు చేరుకున్న కెటిఆర్,హరీశ్‌రావులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు24:** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం ఎర్రవల్లిలోని తన ఫాంహౌస్‌లో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనకు ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో హైదరాబాద్ నుంచి ప్రత్యేక వైద్యుల బృందం వెంటనే అక్కడికి చేరుకుంది. కేసీఆర్ రక్తంలో చక్కెర (షుగర్), సోడియం స్థాయుల్లో హెచ్చుతగ్గులు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఈ నేపథ్యంలో వైద్య బృందం ఆయనకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, చికిత్స అందిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. తండ్రి అనారోగ్య వార్త తెలియగానే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తన కుమారుడు హిమాన్షుతో కలిసి ఫాంహౌస్‌కు చేరుకున్నారు. ఆయనతో పాటు మాజీ మంత్రులు హరీశ్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి కూడా ఎర్రవల్లికి వచ్చి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

# చర్లపల్లి జైలు నుండి ఖైదీ పరార్..

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు24:** చర్లపల్లి జైలులో హైటెక్ బ్యారక్‌లో ఉండే ఖైదీ పరారైనట్లు సమాచారం. పరారైన ఖైదీ బీహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా నిర్ధారణ.జైలుకు పెయింటింగ్ వేస్తున్న నేపథ్యంలో పెయింటింగ్ పనుల్లో ఈ ఖైదీ కూడా పాల్గొన్నాడని తెలుస్తోంది. ఆదివారం ప్రహరీ గోడకు పెయింటింగ్ వేస్తున్న సందర్భంలో...పెయింటింగ్ వేస్తూన్నట్లు నటిస్తూ...అదును చూసి జైలు సిబ్బంది కళ్లుగప్పి ప్రహరీ గోడ దుంకి పారిపోయినట్లుగా సమాచారం! పరారైన ఖైదీనీ పోలీసుకు తిరిగి పట్టుకున్నట్లుగా సమాచారం,.ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ అదుపులో నిందితుడు ఉన్నట్లు సమాచారం.

# అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే కేంద్రమంత్రి అమిత్‌షా ఆరోపణలు

### తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్

**చెన్నై, ఆగస్టు 24 :** నక్సలిజంపై ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని కేంద్రమంత్రి అమిత్‌షా లక్ష్యంగా చేసుకోవడాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఖండించారు. కేంద్రం ఈ సమస్యను పరిష్కరించలేక పోయిందని, తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే ఆయనను లక్ష్యంగా చేసుకుందని ఆరోపించారు. ఉపరాష్ట్రపతి పదవికి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పూర్తి అర్హత కలిగిన వ్యక్తి అని స్టాలిన్ పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో డిఎంకె, మిత్రపక్షాల మద్దతు కోరుతూ జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి చెన్నైలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సిఎం స్టాలిన్ ప్రసంగించారు. కేవలం ఇండియా కూటమి నేలతే కాకుండాప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉన్న వారందరూ జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డినే ఉపరాషపతి అభ్యర్థిగా అంగీకరించారన్నారు.

# రూ.62,408కోట్ల ఉత్పత్తుల ఎగుమతి

**హైదరాబాద్,ఆగస్టు24, ప్రభాతవార్త:** గత ఆర్థిక ఏడాదిలో దేశీయసముద్రంలో రూ.64,408.45 కోట్ల (7.44 బిలియన్ డాలర్లు) ఉత్పత్తులు ఎగుమతైనట్లు నమోదైంది. అంతకు ముందు ఏడాది 2023-24లో రూ.60,523.89కోట్లు (7.38 బిలియన్ డాలర్లు)గా ఉన్నాయి. దీంతో స్వల్పంగా పెరిగినట్లు వాణిజ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది.

అయితే పరిమాణం పరంగా పరిశీలిస్తే 2023-24లో భారత్ నుంచి 17,81,602 టన్నుల సముద్ర ఉత్పత్తులు ఎగుమతి కాగా 2024-25లో 16,98,170 టన్నులకు పరిమితమయ్యాయి. భారత సముద్ర ఉత్పత్తుల్లో అత్యధికంగా శీతలికరించిన రొయ్యలు ఉండగా తర్వాత స్థానంలో చేపల విభాగం ఉంది. గత ఆర్థిక ఏడాదిలో 5.17 బిలియన్ డాలర్ల రొయ్యలు ఎగుమతి అయినట్లు వెల్లడించింది. మొత్తం సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో వీటి వాటా 43.67శాతం కాగా డాలర్ల ఆదాయంలో 69.46శాతం ఉంది.

చేపల ఎగుమతులు 622.60 మిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

భారత్‌లో సముద్ర ఉత్పత్తులు అత్యధికంగా విశాఖపట్నం, ముంబాయ్ నుంచి ఎగుమతులు ఉంటున్నాయని వివరించింది. అమెరికాకు 2.71 బిలియన్ డాలర్లు, చైనా 1.27 బిలియన్ డాలర్లు, ఐరోపా కూటమి 1.12 బిలియన్ డాలర్లు, జపాన్ 411.55 మిలియన్ డాలర్లు, పశ్చిమాసియా 278.31 మిలియన్‌డాలర్లుగా ఎగుమతులు జరిగాయని పేర్కొంది.

# ప్రజలను కించపరిస్తే మీకు ఎన్నికల్లో గెలుపు అసాధ్యం

### మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్



**ముంబై, ఆగస్టు 24:** మహారాష్ట్రలో ఓట్ల దొంగతనానికి పాల్పడటం ద్వారా మహాయుతి సర్కారు ఏర్పాటైందని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్పందించారు. ముఖ్యంగా మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన అధ్యక్షుడు రాజ్ థాకరే తాజాగా రాహుల్‌గాంధీ ఆరోపణలకు మద్దతు పలుకడంతో ఫడ్నవీస్ ఆగ్రహించారు. ప్రతిపక్షాలు ప్రజలను కించపర్చడం మానుకునే వరకు వాళ్లు ఎన్నికల్లో గెలువలేరని వ్యాఖ్యానించారు.
ప్రజల ఓట్లతో గెలిచిన ప్రభుత్వంపై అసత్యపు ఆరోపణలు చేస్తూ ప్రతిపక్షాలు ఓటర్లను అవమానిస్తున్నాయని ఫడ్నవీస్ అన్నారు. ప్రజలను కించపర్చడంవల్లనే వాళ్లు ఎన్నికల్లో ఓడిపోతున్నారని చెప్పారు. వాళ్ల ఓటమిపై వాళ్లు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ఆత్మపరిశీలన చేసుకునే వరకు వాళ్లు ఎన్నికల్లో గెలువరని అన్నారు. అదేవిధంగా ప్రజలను కించపర్చడం కూడా మానుకోవాలని, ప్రజలను కించపర్చడం మానకపోయినా వాళ్లు ఎన్నికల్లో గెలువలేరని ఫడ్నవీస్ చెప్పారు. మహారాష్ట్రలో ఓట్ల చోరీ జరిగిందని గత కొన్ని రోజులుగా రాహుల్‌గాంధీ చేస్తున్న ఆరోపణలకు మహారాష్ట్రలో శరద్‌పవార్ ఎన్సీపీ, రాజ్‌థాకరే మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన, ఉద్ధవ్ థాకరే శివసేన పార్టీలు మద్దతు పలికాయి.

పొలిమేర, రజాకార్ వంటి చిత్రాలతో జాతీయ స్థాయిలో కెమెరామెన్‌గా కుశేందర్ రమేష్ రెడ్డికి గుర్తింపు వచ్చింది. ఆయన సినిమాటోగ్రఫర్‌గా పని చేసిన 'త్రిబాణధారి బార్బరిక్' చిత్రం ఆగస్ట్ 29న రాబోతోంది. స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పణలో వానర సెల్యూలాయిడ్ బ్యానర్ మీద విజయ్ పాల్ రెడ్డి అడిదెల నిర్మించిన 'త్రిబాణధారి బార్బరిక్'' చిత్రానికి మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించారు. ఇప్పటికే టీజర్, ట్రైలర్‌లు మూవీపై అంచనాలు పెంచేశాయి. మరీ ముఖ్యంగా విజువల్స్ గురించి అందరూ మాట్లాడుకుంటున్నారు. ఈ క్రమంలో కుశేందర్ రమేష్ రెడ్డి ఈ మూవీకి సంబంధించిన విశేషాలను పంచుకున్నారు.

## 'త్రిబాణధారి బార్బరిక్' లాంటి కంటెంట్ బేస్డ్ చిత్రాలు చాలా అరుదుగా వస్తాయి

### ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కుశేందర్ రమేష్ రెడ్డి



**'త్రిబాణధారి బార్బరిక్'ప్రయాణం ఎలా మొదలైంది?** 'రజాకార్' చివరి షెడ్యూల్‌లో ఉన్నప్పుడు దర్శకుడు మోహన్ ఈ కథ గురించి చెప్పారు. కథ విన్న వెంటనే నాకు చాలా నచ్చింది. కథ విన్న తరువాత నా సలహాలు, సూచనలు చెప్పాను. ఎలాంటి కలర్ గ్రేడింగ్, ప్యాట్రన్ వాడితే బాగుంటుందనే రిఫరెన్సులు కూడా ఇచ్చాను. అవన్నీ కూడా మారుతికి చాలా నచ్చాయి. దీంతో దర్శకుడు మోహన్, నిర్మాత విజయ్, నేను కలిసి ఈ ప్రాజెక్ట్‌ని అలా మొదలు పెట్టాం. **'త్రిబాణధారి బార్బరిక్' చిత్రీకరణ సమయంలో ఎదుర్కొన్న సవాళ్లు ఏంటి?** త్రిబాణధారి బార్బరిక్ మూవీ ఎక్కువగా రాత్రి పూట, రెయిన్ ఎఫెక్ట్స్‌లోనే షూటింగ్ చేశాం. వేసవి కాలంలో రెయిన్ సీజన్ ఎఫెక్ట్‌ను చూపించడం అంత సులభం కాదు. అదే మాకు పెద్ద ఛాలెంజింగ్. ఎండాకాలంలో వానాకాలాన్ని సృష్టించేందుకు చాలా కష్టపడాల్సి వచ్చింది. ఈ విషయంలో మాత్రం నిర్మాత విజయ్ డేరింగ్ స్టెప్ తీసుకున్నారు. కథ కోసం ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. మొదటి సినిమా అయినా కూడా కథ మీద నమ్మకంతో ఆయన భారీ బడ్జెట్‌ను పెట్టారు. **'త్రిబాణధారి బార్బరిక్'లో చిత్రంలోని ప్రత్యేకతలు ఏంటి?** త్రిబాణధారి బార్బరిక్ సినిమాలో ప్రతీ పాత్రకు ఓ ప్రత్యేకత ఉంటుంది. ఒక్కో పాత్రకు సపరేట్ కలర్ గ్రేడింగ్ వాడాము. ఒక్కో పాత్ర రూపాంతరం చెందుతున్న తీరుకి తగ్గట్టుగా కలర్ గ్రేడింగ్ మారుతుంది. ఇక రెయిన్ ఎఫెక్ట్ సీన్లను చూస్తే ఎంతో సహజంగా అనిపిస్తాయి. 'తుంబాడ్', 2018చిత్రాలకు ఏ మాత్రం తగ్గకుండా ఎంతో నేచురల్‌గా కనిపిస్తుంది. **త్రిబాణధారి బార్బరిక్'ప్రధాన బలం ఏంటి?** 'త్రిబాణధారి బార్బరిక్' మూవీకి ప్రధాన బలం కథ. స్క్రిప్ట్ విన్నప్పుడే ఈ మూవీని చేయాలని ఫిక్స్ అయ్యాను. 'పొలిమేర', 'రజాకార్' కథలు విన్నప్పుడు ఎలాంటి ఫీలింగ్ కలిగిందో ఈ మూవీ కథను విన్నప్పుడు కూడా అలాంటి ఫీలింగే కలిగింది. ప్రతీ పాత్రకు ఇంపార్టెన్స్ ఉంటుంది. క్లైమాక్స్‌ని ఎవ్వరూ ఊహించలేరు. **'త్రిబాణధారి బార్బరిక్' చిత్రంలోని ఆర్టిస్టులతో వర్కింగ్ ఎక్స్‌పీరియెన్స్ గురించి చెప్పండి?** త్రిబాణధారి బార్బరిక్‌చిత్రంలో ఉదయ భాను పాత్ర చాలా పవర్ ఫుల్‌గా ఉంటుంది. చాలా ఏళ్ల తరువాత మళ్లీ ఉదయ భాను ఓ అద్భుతమైన పాత్రలో ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. ఈ చిత్రంలో వశిష్టని సరికొత్తగా చూస్తారు. 'బాహుబలి'కి పని చేసినప్పటి నుంచి నాకు సత్య రాజ్‌తో పరిచయం ఉంది. ఆయన ఎప్పుడూ కూడా సెట్స్‌కి ఆన్ టైంలో వస్తుంటారు. నైట్ షూట్స్, రెయిన్ ఎఫెక్ట్ సీన్లంటూ మేం ఆయన్ను చాలా ఇబ్బంది పెట్టాం. **'త్రిబాణధారి బార్బరిక్' పట్ల సంతృప్తిగా ఉన్నారా?** 'త్రిబాణధారి బార్బరిక్' కథ విన్నప్పుడు నేను ఎలా ఊహించుకున్నానో అలానే తీయగలిగాను. అందులో నాకు ఫ్రీడం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. ఖర్చుకి వెనుకాడకుండా నిర్మించారు. ఆయన ప్రతీ రోజూ సెట్స్‌కు వస్తుండేవారు. కథను నమ్మాను.. సినిమా బాగా రావాలి అని నిత్యం అంటుండే వారు. అలాంటి ప్రొడ్యూసర్ ఉండటం వల్లే ఈ మూవీని అనుకున్నట్టుగా, విజువలైజ్ చేసుకున్నట్టుగా తీయగలిగాను.

# 30న దుబాయ్‌లో గామా అవార్డులు

## - గామా సిఇఒ సౌరబ్ కేసరి



ప్రతిష్టాత్మమైన గామా అవార్డ్స్‌కు టాలీవుడ్‌లో స్పెషల్ క్రేజ్ ఉంది. దుబాయ్‌లో ఇప్పటికే నాలుగు ఎడిషన్లు అంగరంగ వైభవంగా జరిగాయి. ఇప్పుడు 5వ ఎడిషన్ వేడుకలు ఆగస్ట్ 30న దుబాయ్‌లోని షార్జా ఎక్స్‌పో సెంటర్‌లో గ్రాండ్‌గా జరగనుంది. ఈ అవార్డ్స్ కార్యక్రమానికి టైటిల్స్ స్పాన్సర్‌గా వైభవ్ జ్యువెలర్స్ సంస్థ వ్యవహరిస్తోంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో కర్టెన్ రైజర్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గామా సిఇఒ సౌరబ్ కేసరి, వైభవ్ జ్యువెలర్స్ ఎండి రాఘవ్, జ్యూరీ సభ్యులు, ప్రముఖ దర్శకులు ఏ. కోదండరామి రెడ్డి, బి గోపాల్, హీరోయిన్స్ ఫరియా అబ్దుల్లా, మానస వారణాసి, దక్షా నాగర్కర్, నటుడు వైవా హర్ష పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గామా సిఇఒ సౌరబ్ కేసరి మాట్లాడుతూ.. "ఇది కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న ఈవెంట్ కాదు. మా నాన్న (త్రిమూర్తులు) గారికి కళాకారులపై ఉన్న అభిమానంతో గామా అవార్డ్స్ నిర్వహిస్తున్నాం. వచ్చే ఏడాది మరింత గ్రాండ్‌గా అవార్డ్స్ ఇచ్చేలా ప్లాన్ చేస్తున్నాం. అలాగే ఇతర దేశాల్లోను గామా అవార్డ్స్ ఇచ్చేలా సన్నాహాలు చేస్తున్నాం. దుబాయ్‌లో ఉన్న తెలుగు వారితోపాటు ప్రపంచంలోని తెలుగు వారందరినీ అబ్బురపరిచేలా ఈవెంట్‌ను నిర్వహించబోతున్నాం. మా జ్యూరీ సభ్యుల సహకారంతో అవార్డు విజేతలను ఎంపిక చేశాం అని అన్నారు.

జ్యూరీ సభ్యులు, ప్రముఖ దర్శకులు ఏ కోదండ రామిరెడ్డి మాట్లాడుతూ, "నేను, బి గోపాల్, కోటి సహా పలువురు ప్రముఖులు కూడా జ్యూరీ సభ్యులుగా వ్యవహరిస్తున్నాం. ఆగస్టు 30న దుబాయ్‌లో జరగనున్న ఈ గామా అవార్డ్స్ విజయవంతం అవ్వాలని కోరుకుంటున్నా అని అన్నారు.

జ్యూరీ సభ్యులు, ప్రముఖ దర్శకులు బి గోపాల్ గారు మాట్లాడుతూ, 'గామా అవార్డ్స్ చైర్మన్ త్రిమూర్తులు ఈ అవార్డ్ ఫంక్షన్‌ను ప్రతి ఏడాది చాలా గ్రాండ్‌గా నిర్వహిస్తున్నారు. అతిరథ మహారధుల సమక్షంలో హీరోయిన్స్ అద్భుతమైన పర్ఫార్మెన్స్‌లతో ఈ ఈవెంట్ జరగనుంది" అని చెప్పారు. గామా అవార్డ్స్ టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న వైభవ్ జ్యువెలర్స్ ఎండి రాఘవ్ మాట్లాడుతూ,'ఇలాంటి ప్రతిష్టాత్మక అవార్డ్స్‌లో భాగమవడం సంతోషంగా ఉంది అన్నారు. హీరోయిన్ ఫరియా అబ్దుల్లా మాట్లాడుతూ, గతేడాది జరిగిన ఫోర్త్ ఎడిషన్ గామా అవార్డ్స్‌లో స్పెషల్ పెర్ఫార్మన్స్ చేశాను. ఈసారికూడా స్పెషల్ పెర్ఫార్మన్స్‌తో అలరించబోతున్నా అని చెప్పారు. హీరోయిన్ మానస వారణాసి మొదటిసారి గామా అవార్డ్స్‌లో స్పెషల్ పెర్ఫార్మన్స్ చేయబోతున్నానని చెప్పారు. ఈ వేడుకలో పాలుపంచుకోవడం చాలా ఆనందంగా ఉందని హీరోయిన్ దక్షా నాగర్కర్ అన్నారు. గామా అవార్డ్స్‌లో యాంకర్ సుమతో పాటు వ్యాఖ్యాతగా వ్యవహరించనున్న నటుడు వైవా హర్ష మాట్లాడుతూ, "సుమతో వ్యాఖ్యాతగా వ్యవహరించడం చాలా ఎక్సైటింగ్‌గా ఉంది. ఈ వేడుక చాలా ఎంటర్టైనింగ్ గా జరగబోతుంది" అని చెప్పారు. ఇప్పటికే దుబాయ్‌లో లాంచ్ చేసిన గామా 5వ ఎడిషన్‌కు సంబంధించి థీమ్ సాంగ్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ ఈ పాటకు అద్భుతమైన ఆకట్టుకునే సాహిత్యం అందించారు. రఘు కుంచె సాంగ్ కంపోజ్ చేయడంతో పాటు తానే స్వయంగా పాడిన తీరు అందరినీ అలరించింది. ఆగస్టు 30న టాలీవుడ్ అవార్డ్స్‌తో పాటు ఆగస్టు 29న ఎక్సలెన్స్ అవార్డ్స్ వేడుకను నిర్వహించేలా భారీ సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి టాలీవుడ్ హీరోలు సిద్దు జొన్నలగడ్డ, తేజ సజ్జ, కిరణ్ అబ్బవరం, శ్రీవిష్ణు, రోషన్, హీరోయిన్స్ మీనాక్షి చౌదరి, దక్ష నాగర్కర్‌తో పాటు తెలుగు చలనచిత్ర పరిశ్రమ నుంచి అగ్ర కథానాయ కులు, టాప్ టెక్నీషియన్స్ పాల్గొనబోతున్నారు. ప్రత్యేక అతిధులుగా బ్రహ్మానందం, దర్శ కులు సుకు మార్, బుచ్చిబాబు, బాబీ, సాయి రాజేష్, సంగీత దర్శకులు దేవిశ్రీప్రసాద్, నిర్మాతలు అశ్విని దత్, డివివి దానయ్య, చంద్రబోస్,వెన్నెల కిషోర్ తదితర ప్రముఖులు హాజరవనున్నారు. 2024లోవిడుదలైన చిత్రాల్లో నామినేట్ అయిన విభాగాలకు జ్యూరీ సభ్యుల ద్వారా అవార్డులను అందుకోనున్నారు.




## 'జటాధర' నుంచి దివ్య ఖోస్లా ఫస్ట్ లుక్ రిలీజ్



నవ దళపతి సుధీర్ బాబు, బాలీవుడ్ పవర్‌హౌస్ సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. అద్భుతమైన సినిమాటిక్ అందించే ఈ పాన్‌ఇండియా ద్విభాషా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. హైఆక్టేన్ విజువల్స్, పౌరాణిక ఇతివృత్తాలతో ఈ చిత్రం గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతుంది. ఇటీవల రిలీజ్ అయిన టీజర్ నేషనల్ వైడ్‌గా వైరల్ అయ్యింది. ఈ రోజు మేకర్స్ సితారగా దివ్య ఖోస్లాను పరిచయం చేశారు. బ్యూటీఫుల్ అండ్ క్లాసిక్‌గా కనిపించిన దివ్యఖోస్లా ఫస్ట్‌లుక్ అదిరిపోయింది. జీ స్టూడియోస్, ప్రెర్ణా అరోరా ప్రెజెంట్ చేస్తున్న ఈ సినిమాను ఉమేష్‌కుమార్ బన్సాల్, ప్రెర్ణా అరోరా ప్రొడ్యూస్ చేస్తున్నారు. విజనరీ టీమ్, జానర్ బౌండరీలు చెరిపేసే కాన్సెప్ట్‌తో, 'జటాధర' ఈ ఏడాది మోస్ట్ అవైటెడ్ థియేట్రికల్ రిలీజ్‌లలో ఒకటిగా వస్తోంది. దేశవ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ ప్లాన్ చేస్తున్న 'జటాధర' ఇండియా సినిమాలో నెక్స్ట్ మైథాలజికల్ ఎపిక్‌గా మారబోతోంది.

## 'సుందరకాండ' బ్యూటీఫుల్ సాంగ్ విడుదల



హీరో నారా రోహిత్ మైల్ స్టోన్ 20వ మూవీ 'సుందరకాండ'. నూతన దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహిస్తున్నారు. సందీప్ పిక్చర్ ప్యాలెస్ (ఎస్‌పిపి) బ్యానర్‌పై సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మిస్తున్నారు. ఇప్పటికే టీజర్, ట్రైలర్, పాటలు స్ట్రాంగ్ బజ్‌ను క్రియేట్ చేశాయి. ఈ రోజు మేకర్స్ ఈ సినిమా నుండి డియర్ ఐరా సాంగ్ ని రిలీజ్ చేశారు. లియాన్ జేమ్స్ డియర్ ఐరా ని బ్యూటీ ఫుల్ లవ్ సాంగ్ గా కంపోజ్ చేశారు. శ్రీ హర్ష ఈమని రాసిన లిరిక్స్ లీడ్ పెయిర్ ఎమోషన్‌ని అద్భుతంగా ప్రజెంట్ చేశాయి. లియోన్ జేమ్స్, కీర్తన వైద్యనాథన్ వోకల్స్ సాంగ్‌ని మరింత లవ్లీగా మార్చాయి. ఈ సాంగ్‌లో లీడ్ పెయిర్ కెమిస్ట్రీ చాలా ఫ్రెష్‌గా వుంది. ఆగస్ట్ 27న ఈ సినిమా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. తారాగణం: నారా రోహిత్, వృతి వాఘాని, శ్రీదేవి విజయ్ కుమార్, నరేష్ విజయ కృష్ణ, వాసుకి ఆనంద్, సత్య, అజయ్, వీటీవీ గణేష్, అభినవ్ గోమటం, విశ్వంత్, రూప లక్ష్మి, సునైనా, రఘు బాబు.

## 'నేను రెడీ'నుంచి హీరోయిన్ కావ్య థాపర్ బర్త్ డే పోస్టర్



నువ్విలా, జీనియస్, రామ్ లీలా, సెవెన్ వంటి చిత్రాలతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న యంగ్ టాలెంటెడ్ హీరో హవీష్, సినిమా చూపిస్తా మావ, నేను లోకల్, ధమాకా, మజాక వంటి సూపర్ హిట్ చిత్రాల దర్శకుడు నక్కిన త్రినాథరావు కాంబోలో రూపొందుతున్న క్రేజీ మూవీ 'నేను రెడీ'. ఈ చిత్రాన్ని హార్నిక్స్ ఇండియా ఎల్‌ఎల్‌పి బ్యానర్‌పై నిఖిల కోనేరు నిర్మిస్తున్నారు. కావ్యథాపర్ హీరోయిన్‌గా నటిస్తోంది. బ్రిలియంట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌గా తెరకెక్కుతున్న 'నేను రెడీ' మూవీ నుంచి ఇటీవల రిలీజ్ చేసిన హీరోయిన్ కావ్య థాపర్ బర్త్ డే పోస్టర్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్రంలో ఆమె క్యారెక్టర్ ప్రేక్షకుల్ని ఆకట్టుకోనుంది. 'నేను రెడీ' మూవీ తన కెరీర్‌లో ది బెస్ట్‌గా నిలుస్తుందని ఆశిస్తోంది కావ్య థాపర్. ప్రస్తుతం 'నేను రెడీ' సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ మూవీకి మంచి ఔట్ పుట్ వస్తోంది. ఇటీవల రిలీజ్ చేసిన 'నేను రెడీ' టైటిల్ గ్లింప్స్‌కు ప్రేక్షకుల నుంచి భారీ స్పందన వచ్చింది. ఈ నేపథ్యంలో మరింత కాన్ఫిడెంట్‌గా చిత్రీకరణ జరుపుతున్నారు.

## 26న 'ది గర్ల్ ఫ్రెండ్' నుంచి లిరికల్ సాంగ్ రిలీజ్



నేషనల్ క్రష్ రశ్మిక మందన్న, టాలెంటెడ్ హీరో దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా "ది గర్ల్ ఫ్రెండ్". ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహిస్తున్నారు. ఈ రోజు 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా నుంచి సెకండ్ సింగిల్ అనౌన్స్ చేశారు. 'ఏం జరుగుతోంది...' లిరికల్ సాంగ్ ను ఈ నెల 26న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ పాటకు రాకేందు మౌళి సాహిత్యాన్ని అందించగా, చిన్మయి పాడారు. ఫీల్ గుడ్ లవ్ సాంగ్‌గా 'ఏం జరుగుతోంది...' రూపొందించారు. "ది గర్ల్ ఫ్రెండ్" సినిమా రిలీజ్ డేట్ ను మేకర్స్ త్వరలోనే అనౌన్స్ చేయబోతున్నారు.



## భారీ పాన్‌ఇండియా ఎంటర్‌టైనర్ 'కట్టలన్' గ్రాండ్ లాంచ్

క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ మాస్ యాక్షన్ థ్రిల్లర్ మార్కో పాన్ ఇండియా హిట్ అయ్యింది. ఇప్పుడు అదే బ్యానర్‌పై ప్రొడ్యూసర్ షరీఫ్ మహమ్మద్ మరో భారీ ప్రాజెక్ట్ కట్టలన్‌ను లాంచ్ చేశారు. మలయాళం, తెలుగు భాషల్లో పాన్ ఇండియా ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ మూవీ పూజా కార్యక్రమం కొచ్చిలో అద్భుతంగా జరిగింది.

బాహుబలిలో కనిపించి ఫేమస్ అయిన చిరక్కల్ కలీదాసన్ ఏనుగు పూజా కార్యక్రమంలో కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. లగ్జరీ కార్లు, బైకులు కూడా ఈవెంట్‌ను మరింత స్పెషల్ చేశాయి. సినిమాలోని కథలైన్‌ను దృష్టిలో పెట్టుకుని పూజా ప్రెజెంటేషన్ కూడా డిజైన్ చేశారు. ఈవెంట్‌లో యాంటోని వర్గీస్, కబీర్ దూహన్ సింగ్, రాజిషా విజయన్, హనన్ షా, జగదీష్, సిద్దిక్, పార్త్ తివారీ లాంటి స్టార్‌లు హాజరై గ్లామర్‌ని మరింత పెంచారు. సుమారు 45 కోట్లు బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ పాన్‌ఇండియన్ యాక్షన్ థ్రిల్లర్ టైటిల్ పోస్టర్ ఇప్పటికే వైరల్ అయ్యింది. డెబ్యూ డైరెక్టర్ పాల్ జార్జ్ దర్శకత్వం వహిస్తుండగా, కాంతార, మహారాజా సినిమాలతో సౌత్‌లో సంచలనం సృష్టించిన కన్నడ మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోకనాథ్ మ్యూజిక్ అందిస్తున్నారు. 'మార్కో'కోసం కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్‌ని తీసుకొచ్చిన క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్, ఇప్పుడు మరో బిగ్ కంపోజర్‌ని పరిచయం చేస్తోంది.

టైటిల్ డిజైన్ కోసం జలర్, లియో, జవాన్, కూలీ సినిమాలకు పనిచేసిన ఐడెంట్ లాబ్స్‌ని తీసుకున్నారు. హీరోయిన్‌గా రాజిషా విజయన్ నటించనున్నారు. నటీనటుల్లో తెలుగు నటుడు సునీల్, 'మార్కో'తో మలయాళంలో పాపులర్ అయిన కబీర్ దూహన్ సింగ్, వ్లాగర్‌సింగర్ హనన్ షా, ర్యాపర్ బేబీ జీన్, తెలుగు నటుడు రాజ్ తిరందాసు, అలాగే సీనియర్ నటులు జగదీష్, సిద్దిక్‌లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పొన్నియన్ సెల్వన్ 1,బాహుబలి2, జవాన్, బాఘీ2 వంటి సినిమాల్లో యాక్షన్ సీక్వెన్స్‌లు డిజైన్ చేసిన వరల్డ్ ఫేమస్ ఫైట్ మాస్టర్ కేచా ఖాంఫక్డీ ఈ సినిమాలో కూడా స్టంట్స్ కంపోజ్ చేస్తున్నారు. డైలాగ్స్ ఉన్నీ ఆర్. ఎడిటర్ షమీర్ మహమ్మద్, ప్రొడక్షన్ కంట్రోలర్ దీపక్ పరమేశ్వరన్. త్వరలో సినిమా కాస్ట్ క్రూ మరిన్ని అప్‌డేట్స్ రివిల్ చేయనున్నారు.

# 'సుందరకాండ' ఫ్యామిలీతో కలసి ఎంజాయ్ చేసే క్లీన్ ఎంటర్‌టైనర్

## డైరెక్టర్ వెంకటేష్ నిమ్మలపూడి



హీరో నారా రోహిత్ మైల్ స్టోన్ 20వ మూవీ 'సుందరకాండ'. నూతన దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహిస్తున్నారు. సందీప్ పిక్చర్ ప్యాలెస్ (ఎస్‌పిపి) బ్యానర్‌పై సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మిస్తున్నారు. వృతి వాఘాని, శ్రీదేవి విజయ్‌కుమార్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. టీజర్, పాటలు, ట్రైలర్ స్ట్రాంగ్ బజ్‌ను క్రియేట్ చేశాయి. ఈ సినిమా ఆగస్టు 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**సుందరకాండ ఐడియా ఎలా జనరేట్ అయింది?** నాకు ఫ్యామిలీ కథలు ఇష్టం. కలిసుందాం రా నా ఫేవరెట్ సినిమా. అలాంటి ఒక క్యూట్ ఫ్యామిలీ స్టోరీ చేయాలని ఉండేది. రోహిత్‌తో నాకు ఎనిమిదేళ్ల జర్నీ వుంది. నా ఫస్ట్ సినిమాని క్యూట్ ఫ్యామిలీ లవ్ స్టోరీగా చేద్దాం అనుకున్నాను. అప్పుడు ఈ ఆలోచన వచ్చింది. రోహిత్‌కి చెప్పాను. కథ రాసి పంపించాను. ఆయన చదివి ఇంప్రెస్ అయ్యారు. అలా ప్రాజెక్టు మొదలైంది. **హీరో క్యారెక్టర్ రాయడానికి ఏదైనా ఇన్స్పిరేషన్ ఉందా?** అందరి ఇన్స్పిరేషన్ ఉంది. 30 దాటాక పెళ్లి కాకపోవడమే పెద్ద పంచాయతీ అనుకుంటే, ప్రత్యేకమైన క్వాలిటీలు వెతుక్కోనే పర్సన్ ఉంటే ఎలా ఉంటుంది, వాళ్ళ ఇంట్లో పరిస్థితి ఎలా ఉంటుందనేదనే ఆలోచన నుంచి వచ్చింది. **మీరు ఇండస్ట్రీలో ఎవరి దగ్గరైనా వర్క్ చేశారా?** పవన్ సాధినేని దగ్గర ఒక వెబ్ సిరీస్ చేశాను. సాగర్‌కే చంద్ర, పల్నాటి సూర్య ప్రతాప్. దగ్గర రైటింగ్‌లో చేశాను. వీర భోగ వసంతరాయులు సినిమాకి అసిస్టెంట్ డైరెక్టర్‌గాపని చేశాను. అలాగే నేల టికెట్ సినిమాకి అప్రెంటిస్‌గా చేశాను. **సుందరకాండ టైటిల్ గురించి చెప్పండి? దీనికి రామాయణంతో లింక్ ఉందా?** రామాయణంలో హనుమంతుడు సీతమ్మ వారి దగ్గరికి వెళ్లి రాముల వారిచ్చిన ఉంగరాన్ని చూపించే ఘట్టం సుందరకాండ. అదొక సెలబ్రేషన్. అయితే సెలబ్రేషన్‌కి ముందు ఎన్నో సవాళ్లు వున్నాయి. హనుమంతులవారు ఎన్నో ఎఫర్ట్స్ పెట్టారు. అలా మా హీరో కూడా ఒక విషయాన్ని ఎచీవ్ చేయాలనుకుంటారు. దానికి ఆయన పెట్టే ఎఫెర్ట్స్ ఎమిటనేది కథ. అలా సుందరకాండ అనే టైటిల్ పెట్టడం జరిగింది. ఇది పాజిటివ్ టైటిల్. రామాయణం నాకు చాలా ఇష్టం. ఆ టైటిల్ కూడా అలా కలిసి రావడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. రోహిత్‌తో వర్క్ చేయడం ఎలా అనిపించింది?నేను రోహిత్‌తోనే ఎనిమిదేళ్లుగా ట్రావెల్ చేస్తున్నాను. ఈ స్క్రిప్ట్ బిగినింగ్ నుంచి చివరి వరకు ఆయన సపోర్ట్ వుంది. మేము ఒక ఫ్యామిలీలానే వుంటాం. **ఈ సినిమా కోసం శ్రీదేవి విజయ్‌కుమార్‌ని ఎంపిక చేయడానికి కారణం?** రెండు డిఫరెంట్ ఏజ్ గ్రూపున్న లవ్ స్టోరీ ఇది. రోహిత్ కంటే ఏజ్‌గా కనిపించాలి అదే సమయంలో బ్యూటిఫుల్‌గా ఉండాలి. అలాంటి అమ్మాయి కోసం వెతుకుతున్నప్పుడు శ్రీదేవి విజయ్‌కుమార్‌ని అనుకున్నాను. శ్రీదేవి రోహిత్‌కి తెలుసు. అయితే ఆమెని ఈ క్యారెక్టర్‌లో ఒప్పించే బాధ్యత మాత్రం రోహిత్ నా మీద పెట్టారు. నేను వెళ్లి కథ చెప్పాను. కథ నచ్చి వెంటనే ఓకే చేశారు. ఈ సినిమా కోసం ఆవిడ చాలా ఎఫర్ట్ పెట్టారు. స్కూల్ అమ్మాయిగా కనిపించడానికి డైట్ కూడా చేశారు. వృతి వాఘాని క్యారెక్టర్‌కి కూడా చాలా మంచి పేరు వస్తుంది. ఆమె స్క్రీన్ ప్రజెన్స్ చాలా బ్యూటిఫుల్‌గా ఉంటుంది. ఈ సినిమాలో నరేష్ చాలా అద్భుతంగా నటించారు. అలాగే సునైనా, వాసుకిపాత్రలు కూడా చాలా బాగుంటాయి. అందరూ చాలా కాంట్రిబ్యూట్ చేశారు. ఒక న్యూ ఫిలిం మేకర్‌కి చాలా సపోర్ట్ చేశారు. ఈరోజుల్లో కామెడీ పండించడం చాలా కష్టం.. **మ్యూజిక్ గురించి?** లియోన్ జేమ్స్ చాలా అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు. మ్యూజిక్ పట్ల నేను చాలా హ్యాపీగా ఉన్నాను.

ఓర్పు సహనం ,నేర్పు ప్రజ్ఞ పర్యాయ పదాలు. .ఏ పని చేయాలన్న ఓర్పు చాలా అవసరం.సహనంతో ఏదైనా సాధించ వచ్చు. ఈ రెండు ఉన్నవారే కాలక్రమంలో నేర్పరులు కాగలరు.



జీవితంలో నేర్పు సంపాదించడానికి ఓర్పు ఎంత అవసరమో, వ్యాపార వాణిజ్య రంగంలో విజేతలుగా ఎదగడానికి ఓర్పు అంతే అవసరం.వీటితో పాటుగా లౌకిక జ్ఞానం పెంచుకోవడం కొరకు సమయనుకూలగంగా వ్యవహరించే సమయస్ఫూర్తి కూడా అవసరం. పురుషులతో సమానంగా స్త్రీలు చదువు ,ఉద్యోగాలు సంపాదనలోనూ సమాన హోదాపొందుతున్నారు. అలాగే వ్యాపార రంగంలో కూడా ఈ నాడు స్త్రీలు పోటీపడి అనేక వ్యాపారాలను నిర్వహిస్తున్నారు శభాష్ అనిపించుకుటున్నారు. ఉద్యోగినులైన, వ్యాపార రంగంలో ఉన్న తమ తాహతకు విజ్ఞతకు తగిన విధంగా ఏదైనా వ్యాపారం ప్రారంభించినా మహిళలు... కొంత కష్టాలలో పాలుపంచుకునే మనస్తత్వాన్ని అలవర్చుకుంటే ,మీ ఉద్యోగులు తమ వంతుగా నిస్వార్థంగా వ్యాపార నిర్వహణకు

# ఓర్పు..సహానం..నేర్పు..ప్రజ్ఞ

నేర్పు ఓర్పు కూడా అలవర్చుకోవాలి. వ్యాపారం నిర్వహించే వారికి ముఖ్యంగా కావలసినవి..పనిలో కొత్తదనం చూపుతూ ముందుకు సాగిపోవాలి. అంటే ఇతరులకంటే భిన్నంగా అందరికి అందుబాటులో ఉండేలా మీ వ్యాపారము ఉండాలి.అలాగే కస్టమర్ తో మాట్లాడేటప్పుడు మీ శారీరక భాష దానినే బాడీ లాంగ్వేజ్ అంటారు ,హావభావాలు ఎదుటివారికి మంచి అభిప్రాయాన్ని కలుగ చేయాలి.మీ కదలికల్లో హుందాతనం ఉండాలి.కస్టమర్ ఆగ్రహించిన చిరునవ్వుతో సమాధానం చెప్పగలగాలి.ఏ అవకాశాన్ని జార విడుచుకున్న ఎదుటి వారికి అది అవకాశంగా మారుతుంది. కనుక ఎప్పటికప్పుడు పనులు చేసుకుంటూ వెళ్ళాలి తప్ప వాయిదా వేసే మనస్తత్వం అస్సలు ఉంచకూడదు.ఓటమి ఎదురైన , నిరాశతో కుంగి పోకుండ కసితో పట్టుదలతో పనులు చేయాలి. అపజయాలను పాఠాలుగా నేర్చుకుని జాగ్రత్తగా భవిష్యత్తు నిర్దేశించుకోవాలి. గిరాకీ పెంచుకోవాలంటే మార్కెట్లో ప్రతి క్షణం సర్వే చేస్తూ ఉండాలి.అవసరమైతే శిక్షణ తీసుకోవడంలో వెనుకాడవద్దు. మీ దగ్గర పని చేస్తున్న సిబ్బందికి సౌకర్యాలు కలుగ చేసి, వారి తోడ్పడతారు, అది వారి బాధ్యతగా భావిస్తారు.వ్యాపారంలో పొగడ్తలు సహజం. ఎదుటివారు పొగిడారుకదా అని పొంగి పోకూడదు.మరింత జగ్రత్తగా ఉండాలి.ఇతరులు ప్రతికూల విమర్శలు చేస్తుంటారు. ఆ విమర్శలకు నిరుత్సాహపడకూడదు. మొక్కవోని ధైర్యంతో మీ పనులు చేసుకోవాలి ఎన్ని అవాంతరాలు వచ్చినా వ్యాపారం మీద పట్టు కోల్పోకూడదు. కొందరు గుర్తింపు కోసం తాపత్రయ పడుతుంటారు. ఆ తాపత్రయాన్ని పక్కన పెట్టేసి,మీ వంతు పనిని సమర్థతగా చేసుకుంటూ వెళితే, ఆదరణ గుర్తింపు వాటంతట అవే వస్తాయి. నాణ్యత, నమ్మకాలే పెట్టుబడిగా ఉంటూ, పోటీని తట్టుకోవచ్చు. మార్కెటింగ్ పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ అదే సమయంలో తప్పొప్పులను బేరీజు వేసుకుంటూ ప్రతి అంశాన్ని సానుకూల దృక్పథంతో చూడటం అలవర్చుకుంటేవ్యాపార రంగంలో విజేతగా నిలబడతారు.వీటి అన్నింటితో పాటుగా మంచి మాట, చాకచక్యంగా ఉండటం ఎంతో అవసరం.మరి ఈ అంశాలను పాటిస్తూ వ్యాపారరంగం లో తమకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకోవాలని ఆకాంక్షి స్తూ....

- పాలపర్తి సంధ్యారాణి

# ఫోరెన్సిక్ నిపుణురాలిగా ఆర్మీలో సేవలు

**ఎక్కడైనా ఓ ప్రమాదం జరిగిందా...? హత్యో, ఆత్మహత్యో చోటుచేసుకుందా?... ఎన్నెన్నో ఊహాగానాలు, మరెన్నో అనుమానాలు... అక్కడ ఫోరెన్సిక్ నిపుణుల రంగంలోకి అసలు నిజాలు బయటకు వస్తాయి. అప్పుడు హత్య... ఆత్మహత్యగా, ప్రమాదం కాస్తా హత్యగానూ మారొచ్చు. ఇంతటి కీలకమైన రాణిస్తున్నారు డాక్టర్ మేజర్ కారుణ్య**



కారుణ్య

చిన్నప్పటి నుంచీ చేసే పనిలో వైవిధ్యం ఉండాలని కోరుకునేదాన్ని. అందుకు తగ్గట్లుగానే కెరియర్ని ఎంచుకోవచ్చు. మాది హైదరాబాద్. నాన్న జాన్ శామ్యూల్ ప్రిన్సిపల్గా పనిచేసేవారు. అమ్మ మీరా ఓ ప్రైవేట్ పాఠశాలను నిర్వహించేవారు. ఇద్దరికీ సేవాభావం ఎక్కువ. పేద విద్యార్థులందరికో ఉచితంగా చదువు చెప్పించారు. వాళ్ల స్ఫూర్తితోనే సైన్యంలోకి వెళ్లాలనుకున్నా. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్లలోని ఎంబీ మెడికల్ సెంటర్‌లో ఎంబీబీఎస్ పూర్తిచేశాక ఆర్మీలో వైద్యురాలుగా చేరారు.



అనుభవాలన్నీ ప్రత్యేకమే..

నాకు సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలనేది. దాంతో ఆ ప్రవేశ పరీక్షలన్నీ రాసేదాన్ని. 2017 జూన్‌లో సైన్యంలో కెప్టెన్‌గా చేరా. మొదట పుణెలో నేషనల్ డిఫెన్స్ అకాడమీలో ఉద్యోగం తర్వాత అసోం, అరుణాల ప్రదేశ్ రాష్ట్రాల్లో చైనా సరిహద్దుల్లో విధులు నిర్వర్తించా. ఈ అనుభవాలన్నీ ప్రత్యేకమే. వైద్య సాయం అందించడానికి ప్రయాణం మొదలు పెడితే... ఒక్కోసారి నాలుగైదు దూరంలో చేరుకోవడానికీ రెండు మూడు రోజులు పట్టొచ్చు. గడ్డకట్టే చలిలో ఎత్తైన కొండలు ఎక్కాలి. క్రిటికల్ కేసులయితే అంత మంచులోనూ వారిని ఆసుపత్రికి తరలించాలి. ఇలా చాలా విధులు సాధారణంగా ఉంటాయి. కాకపోతే అవన్నీ ప్రత్యేకమే. హిమాలయాలతోపాటు అనేక క్లిష్టమైన పర్వతాలు ఎక్కా నాలుగేళ్లపాటు సేవలందించాక మేజర్గా పదోన్నతి అందుకున్నారు. తర్వాత ఫోరెన్సిక్ మెడిసిన్లో పీజీ చేయాలనే ఆలోచనతో మళ్లీ పుస్తకాలతో కుస్తీ పట్టా. స్వచ్ఛందంగా పదవీ విరమణ చేసి... ఆదిలాబాద్ రిమ్స్ వైద్య కళాశాలలో నేర నిర్ధరణలో కీలకమైన ఫోరెన్సిక్ విభాగంలో చేరారు. ప్రస్తుతం జూడా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గానూ కొనసాగుతోంది. ఎన్నెన్నో అనుభవాలు.. సాధారణంగా ఎవరికైనా చావు అన్నా, మృతదేహం అంటే తెలియని భయం ఉంటుంది. నాకూ ఒకప్పుడు అలానే ఉండేది. అయితే, ఎంబీబీఎస్ కడావర్ (మృతదేహం)కి పరీక్షలు నిర్వహించడంతో శవాలంటే భయం పోయింది. నిజానికి చాలా సందర్భాలలో మృతదేహాలను గుర్తించలేము వారి కుటుంబాలకు చివరి చూపు కూడా దక్కని పరిస్థితి. మరణించింది. ఎవరు? ఆడా? మగా... వయసెంత? హత్యా, ప్రమాదమా... వంటి అనేక సందేహాలకు ఫోరెన్సిక్ పరీక్ష ద్వారా సమాధానం లభిస్తుంది. ఆ కుటుంబాలకు ఊరట దక్కుతుంది. ఆ మధ్య ఓ వ్యక్తిని ఖననం చేశాక.. అది హత్యే అన్న ఆరోపణలు వచ్చాయి. దాంతో తిరిగ ఆ ఆడీ వెలికితీశారు. అప్పుడు దాన్ని పరిశోధించి.. అది ఆత్మహత్య అనే ఆధారాలను అందించా. గొంతు కోయడం వల్ల రక్తస్రావమై మరనం ఎలా సంభవిస్తుంది? ఎంతవరకు గొంతు కొసుకుంటే మృతి చెందుతారు అనే కోణంలో చేసిన పరిశోధన పత్రాలను గతేడాది జాతీయ స్థాయిలో జరిగిన సదస్సులో ప్రదర్శించి, రెండో స్థానం సాధించా. తాజాగా వరంగల్ కాకతీయ వైద్య కళాశాలలో జరిగిన తెలంగాణ ఫోరెన్సిక్ మెడిసిన్ అకాడమీ రాష్ట్రస్థాయి సదస్సులో మూడో బహుమతి అందుకున్నా.

# అది మర్చిపోవడం కాదు ..



'ఫ్రెండ్ బర్త్‌డే' ఈ నెలే కానీ.. తేదీ ఎప్పుడు? అని ఫేస్‌బుక్‌లో వెతికేయడం! చిన్న లెక్కకీ మెదడు తికమకపడిపోయి కాల్‌క్యులేటర్‌పై ఆధారపడటం. బాగా ఇష్టమైన సినిమా.. ఆస్వాదించే వంటకం.. మెచ్చిన పాట, నటుడు.. పేర్లు గుర్తుకు తెచ్చుకోవడానికి నానా తిప్పలు పడటం! చివరకు గూగుల్‌లో వెతికి.. అబ్బా.. ఎంత ఆలోచించినా తట్టలేదు అనుకోవడం. ఎప్పుడోకప్పుడు అందరికీ ఎదురయ్యేవే! కానీ తరచుగా జరుగుతోంటేనే డిజిటల్ డిమెన్షియా అయ్యుండొచ్చు అంటున్నారు నిపుణులు. పిల్లలు స్కూలుకి వెళ్లారు. కాస్త సేదతీరుదామనో.. ఆఫీసు పని కోసమనో అస్తమానం 'తెర'కే అతుక్కుపోతోంటే దీని బారిన పడటం ఖాయం. కొన్నిసార్లు ఆలోచించడానికి బద్ధకించి ప్రతిదానికీ ఫోన్ తీయడం వల్ల కూడా మెదడు వేగంగా స్పందించడం, చకచకా జ్ఞాపకాలను వెతికేయడం వంటివి ఆపేస్తుంది. ఫలితమే ఈ మర్చిపోవడమనే సమస్య. చిన్నదే అని పక్కన పెట్టేస్తే.. దీర్ఘకాలంలో మానసిక సమస్యలకు గురికావాల్సి వస్తుంది. కాబట్టి, స్క్రీన్ వాడకాన్ని తగ్గించుకోండి. ఆఫీసులో అయినా సరే.. అస్తమానం కుర్చీకే పరిమితంకాక గంటకోసారి అయినా లేచి అలా నాలుగు అడుగులు వేయండి. వ్యాయామం సంగతేంటి? ఇంట్లో పని ఎక్సర్‌సైజ్‌కి ప్రత్యామ్నాయం కాదు. వారానికి 5 గంటలు వ్యాయామానికి కేటాయించాలినసందే. ఇది శరీరానికే కాదు మెదడునీ దృఢంగా, ఉత్సాహంగా మారుస్తుంది. ధ్యానానికీ అందులో చోటివ్వాలి. ఇక నిద్రకి ఉండే మ్యాజిక్కే వేరు. మెదడుకీ, శరీరానికీ విశ్రాంతినివ్వడమే కాదు జ్ఞాపకాలను జాగ్రత్తగా పొందుపరుస్తుంది. కాబట్టి, దానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సిందే. అమ్మాయిలు.. మీకేం మల్టీ టాస్కింగ్ సులువుగా చేసేయ్యగలరు. అంటే పొగడ్తలా తీసుకుని పనులన్నీ నెత్తిన వేసుకునేరు! ఒక సమయంలో ఒక పనినే చేయండి. మెదడుకు కాస్త భారం తగ్గుతుంది. ఏకాగ్రతా కుదురుతుంది. చివరగా ఫోన్ అయినా.. కంప్యూటర్ తెర అయినా బ్లూ లైట్ ఫిల్టర్ తప్పక వేయండి. నీలికాంతి ప్రభావం మెదడుపై పడకుండా ఉంటుంది.

ఈ రోజుల్లో మానసిక సమస్యలు లేని వారు లేరంటే అతిశయోక్తి కాదు. ఒత్తిడి, యాంగ్జైటీ, కుంగుబాటు.. ఇలా ప్రతి ఒక్కరూ ఏదో ఒక మానసిక సమస్యతో బాధపడుతున్నారు. కారణమేదైనా.. వీరిలో తను బాధను బయటికి చెప్పే వారి కంటే మోనంగా భరిస్తూ లోలోపల కుమిలిపోతున్న వారే ఎక్కువమంది! అయితే ఇలాంటి మానసిక వేదన నుంచి ఎంత త్వరగా బయటపడితే అంత మేలంటున్నారు నిపుణులు. ఈ సైకో థెరపీ ఔషధంలా పనిచేస్తుందని చెబుతున్నారు. మరి, అదెలాగో తెలుసుకుందాం రండి.. తమ బాధను బయట పెడితే చుట్టూ ఉన్న వాళ్ళు ఏమనుకుంటారోనన్న భయం కొందరిని కుంగదీస్తుంటే. ఎవరికి చెప్పుకోవాలో తెలియకపోవడం, ఆయా మానసిక సమస్యల పరిష్కారాల గురించి అవగాహన లేకపోవడం.. స్థిర మరికొందరిని ప్రశాంతతకు దూరం చేస్తున్నారు. ఇలాంటి సమస్యలన్నింటికి ఖిసైకో థెరపీఖి పరిష్కారం చూపుతుందంటున్నారు నిపుణులు. ఎవరికి మేలు? సైకో థెరపీ అనేది మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు చేసే చికిత్స,

# 'సైకోథెరపీ' ప్రయోజనాలెన్నో !

దీన్ని టాక్ థెరపీగానూ పిలుస్తారు. ఇందులో భాగంగా సంబంధిత నిపుణులను సంప్రదించి.. మానసికంగా మిమ్మల్ని ఇబ్బంది పెడుతోన్న ఆలోచనల గురించి వారితో పంచుకోవడం, ఈ కోరిక వాళ్లిచ్చే సలహాలు పాటించడం.. అందుబాటులో ఉండాలి. అయితే ఇది కౌన్సెలింగ్ మాదిరిగానే అనిపించవచ్చు. కానీ ఈ రెండింటికీ మధ్య స్వల్ప వ్యత్యాసం ఉన్నట్లు నిపుణులు. ఒక నిర్దిష్ట సమస్యను పరిష్కరించేందుకు కౌన్సెలింగ్ ఇస్తారని, అది కూడా స్వల్ప కాలంలో పూర్తయ్యే ప్రక్రియ అని చెబుతున్నారు. అదే సైకో చికిత్సలో భాగంగా వివిధ సమస్యలపై దృష్టి సారిస్తారని.. అందుకే కొన్ని సెషన్ల వారిగా ఈ చికిత్సను అందిస్తారని అంటున్నారు. ఇక మీరు సతమతమవుతోన్న మానసిక సమస్యను.. వ్యక్తిగతంగా/బృందంగా /దంపతులకు /కుటుంబ సభ్యులకు.. ఈ నాలుగు రకాల్లో ఏదో ఒక విధంగా వైద్యులు థెరపీ చేస్తారని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు.. ఈ చికిత్స వల్ల ఆయా మానసిక సమస్యల నుంచి విముక్తి పొందడంతో పాటు ఇతర ప్రయోజనాలూ చేకూరుతాయని చెబుతున్నారు. ఈ థెరపీ వల్ల మన ఆలోచనలు, భావాలు, ప్రవర్తనను మరింతగా అర్థం చేసుకోగలుగుతాము.. ఫలితంగా మన గురించి మనం ఎక్కువగా తెలుసుకునే వీలు కలుగుతుందని, మనలోని భావోద్వేగాలను అదుపులో ఉంచుకునే శక్తి పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. జీవితమన్నాక ఏదో ఒక సమస్య మనల్ని వెంటాడుతూనే ఉంటుంది. సైకో థెరపీతో ఇలాంటి సమస్యల్ని ధైర్యంగా ఎదుర్కొనే నేర్పు అలవడుతుందంటున్నారు నిపుణులు. . ఈ టాక్ థెరపీలో భాగంగా మన సమస్యలేంటో వైద్యులతో, ఇతరులతో పంచుకుంటాం. దీనివల్ల కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయని.. భవిష్యత్తులో ఏ సమస్య ఎదురైనా ఇతరులతో పంచుకొని.. స్వయంగా పరిష్కార మార్గం వెతుక్కోగలుగుతున్నారని నిపుణులు చెబుతున్నారు.
4. అనుబంధాల్లోని సమస్యలను పరిష్కరించడంలోనూ ఈ సైకో థెరపీ సమర్థంగా పనిచేస్తుంది.

# ఇవన్నీ బిస్కెట్లే !









జంతికలూ, బూందీ అందరికీ నచ్చకపోవచ్చు. కొబ్బరిబూరెలూ, అరిసెలూ తినకూడని వాళ్లుండొచ్చు. కానీ బిస్కెట్లు అలా కాదు. ఎవరికైనా నచ్చేస్తాయి. ఏ పిండివంటలు ఉన్నా లేకున్నా మనందరి ఇళ్లల్లో బిస్కెట్ ప్యాకెట్లు తప్పనిసరిగా ఉంటాయి. భోజనం ఆలస్యమయ్యేట్లుంటే అవే మనకు తక్షణ ఆహారం. చాయ్ లో ముంచుకుని తింటాం. ఉత్తివే కాలక్షేపానికీ ఆరగిస్తాం. ఒక్కోసారి ఇవే మన స్నాక్స్ వాటిల్లో అసంఖ్యాక రుచులూ ఆకృతులూ ఉన్నాయి. బిస్కెట్లు ఇష్టంగా తింటూనే వాటితో కుర్చీలూ బల్లలూ చేసి ఆనంద చిచ్చరపిడుగులు చేస్తున్నారు. ఎంత కళాహృదయం కదూ! మీ చిన్నారులను ఒకసారి ప్రయత్నించి చూడమనండి!

















# శిరోజాలకు వంట సోడా

**ఆయా సీజన్లకు తగ్గట్లు శరీరమెలా స్పందిస్తుందో, జుట్టు ఆరోగ్యం కూడా మారుతూ ఉంటుంది. చాలమందికి చుండ్రు సమస్య వేధిస్తుంది. దీన్ని దూరంగా ఉంచాలంటే కొన్ని చిట్కాలను నిపుణులు సూచిస్తున్నారు.**



★ ఈ కాలంలో మాడుపై చర్మం పొడారి, చుండ్రు ఎక్కువగా పెరగడానికి కారణమవుతుంది. దీనివల్ల దురద, ఇన్ఫెక్షన్లూ వస్తాయి. నిర్లక్ష్యం చేస్తే శిరోజాలు రాలే ప్రమాదాన్ని ఆపలేం. అందుకే, ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి. అలాగని గాఢత ఎక్కువగా ఉన్న షాంపూల వినియోగం సమస్యను రెట్టింపు చేస్తుంది.

★ వంటసోడాలో తగినన్ని నీళ్ల కలిపి మాడుకి రాసి అయిదు నిమిషాలుంచాలి. ఆ తర్వాత మృదువుగా చేతులతో రుద్దుతూ గోరువెచ్చని నీటితో శుభ్రపరిస్తే మృతకణాలు దూరమవుతాయి. చుండ్రు సమస్య వదిలిపోవడంతో దురద, శిరోజాలు రాలడం వంటివాటికీ చెక్ పెట్టొచ్చు.


★ తలస్నానానికి ముందు తాజా కలబంద గుజ్జును మాడు నుంచి చివర్ల వరకే రాసి అరగంట ఆరనివ్వాలి. తరువాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. ఇలా వారానికి రెండు సార్లైనా చేస్తే.. చుండ్రు దూరమవుతుంది. రక్తప్రసరణ బాగా జరిగి జుట్టు రాలడాన్ని అరికడుతుంది. కలబంద గుజ్జులోని యాంటీ ఫంగల్ గుణాలు పొడారడం, దురద వంటివన్నీ దూరం చేస్తాయి.

★ తలస్నానానికి పది నిమిషాల ముందు నిమ్మరసాన్ని రాసి తర్వాత శుభ్రపరిస్తే చాలు. ఇందులోని ఎసిడిటీ మాడుపై పిహెచ్ స్థాయిలను సమన్వయం చేస్తుంది. చుండ్రు పోవడానికి దోహదపడుతుంది.

★. పెరుగును తలకు పట్టించి అరగంట ఆరనివ్వాలి. ఆ తర్వాత గాఢత తక్కువగా ఉన్న షాంపుతో తలస్నానం చేస్తే చాలు. పెరుగులోని లాక్టిక్ యాసిడ్ చుండ్రును తరిమికొడుతుంది. జుట్టుకు మాయిశ్చరైజర్‌లా పనిచేసి మృదుత్వాన్నిస్తుంది.

# ఆది దైవం

**మానవ లోకంలో, మనుషులకుసాధారణంగా** ఎదురయ్యే ఆటంకాలను అడ్డుకుంటూ, నిర్విఘ్నంగా జీవితం సాగాలంటే, గణాధిపతి అయిన గణపతే శరణ్యం ఏ పుణ్యకార్యాలు జరిగినా పూజలు ఉన్నా మొదటగా, అర్చించబడే దేవుడు వినాయకుడు. ఏటేటా వినాయక చతుర్థి జరగని చోటు ఉండదు. ఉత్సవాలతో, ఊరేగింపులతో, తొమ్మిదిరోజులు గణపతి నవరాత్రులను నిర్వహణలతో, ఆటపాటలతో మారుమ్రోగుతూ, కళాకారుల సందళ్ళతో వినాయక చవితి పందిళ్ళు కలకలాడుతూ, భక్తులందరికీ కనువిందు చేస్తాయి. వ్రతాలు, వివాహాలు మొదలుగా ప్రతి ఇంటిపండుగల్లో, ప్రాతినిధ్యం వహిస్తూ వారి వారికోరికలను తీర్చే ఆది దైవం వినాయకుడు ఆయనే లంబోదరుడు. తల్లియైన పార్వతి చేసిన పసుపు ముద్దతో రూపుదిద్దుకున్న బాలుడు, తండ్రిని అడ్డుకున్న ఆగ్రహానికి గురై తదుపరి ఏనుగు తలతో గుజ్జు రూపంతో, ఎలుక వాహనంగా, అవతరించి అందరినీ ఆదుకునే గజముఖుడిగా, నవగ్రహాధిపతిగా నిలిచి, నీరాజనాలు అందుకునే, ప్రథముడే గణేశుడు. పార్వతీ పరమేశ్వరులు కుమారులైన కుమారస్వామిని, వినాయకుడిని, త్రిలోక ప్రదక్షిణచేసే పరీక్షలో, తెలివిగా సోదరుడితో ఎదురైన పోటీలో, తల్లిదండ్రుల చుట్టూ మూడుసార్లు తిరిగి గెలిచి సకల గణాధిపతిగా, ఆధిక్యం పొందిన విజయుడు వినాయకుడు. ప్రపంచంలో మాతాపితరులను సేవిస్తే దొరికే ఫలితాలు, ఎలా ఉంటాయో, వినాయకుడి ఈ చరిత్ర వింటే అర్థం అవుతుంది. తనను చూసి వికటంగా హేళనగా నవ్విన చంద్రుడికి, కోపంతో శపించిన తల్లి కారణంగా చవితినాడు చంద్రుడిని చూసిన వారు నీలాపనిందలకు గురికాగలరని, గణపతి పూజచేసి ఆయనను చూస్తే ఆ ఆపద ఉండదని వినాయక వ్రతకథలో విశదంగా వివరంగా అందరికీ తెలుస్తుంది. పాలలో చంద్రుడిని చూసిన దోషానికి శ్రీకృష్ణుడు, శమంతకమణిని ఆపహరించిన వాడిగా, నీలాపనిందపాలనడం, తదుపరి మణిని తెచ్చినిందను బాపుకున్న వైనంవిని, కృష్ణుడికి సాధ్యమయిన విషయం సామాన్యులకు ఎలా అని వేడుకొనగా పార్వతీదేవి వినాయక చవితపూజానంతరం , ఆయన కథ చదివి అక్షింతలు వేసుకుని చంద్రుడిని చూస్తే నీలాపనిందలు తొలగిపోతాయని అభయంతో అనుగ్రహిస్తుంది.



ఆధ్యాత్మికం

# తప్పు చేస్తే సారీ చెప్పండి !



అది మర్చిపోవడం కాదు .. 'ఫ్రెండ్ బర్త్‌డే' ఈ నెలే కానీ.. తేదీ ఎప్పుడు? అని ఫేస్‌బుక్‌లో వెతికేయడం! చిన్న లెక్కకీ మెదడు తికమకపడిపోయి కాల్‌క్యులేటర్‌పై ఆధారపడటం. బాగా ఇష్టమైన సినిమా.. ఆస్వాదించే వంటకం.. మెచ్చిన పాట, నటుడు.. పేర్లు గుర్తుకు తెచ్చుకోవడానికి నానా తిప్పలు పడటం! చివరకు గూగుల్‌లో వెతికి.. అబ్బా.. ఎంత ఆలోచించినా తట్టలేదు అనుకోవడం. ఎప్పుడోకప్పుడు అందరికీ ఎదురయ్యేవే! కానీ తరచుగా జరుగుతోంటేనే డిజిటల్ డిమెన్షియా అయ్యుండొచ్చు అంటున్నారు నిపుణులు. పిల్లలు స్కూలుకి వెళ్లారు. కాస్త సేదతీరుదామనో.. ఆఫీసు పని కోసమనో అస్తమానం 'తెర'కే అతుక్కుపోతోంటే దీని బారిన పడటం ఖాయం. కొన్నిసార్లు ఆలోచించడానికి బద్ధకించి ప్రతిదానికీ ఫోన్ తీయడం వల్ల కూడా మెదడు వేగంగా స్పందించడం, చకచకా జ్ఞాపకాలను వెతికేయడం వంటివి ఆపేస్తుంది. ఫలితమే ఈ మర్చిపోవడమనే సమస్య. చిన్నదే అని పక్కన పెట్టేస్తే.. దీర్ఘకాలంలో మానసిక సమస్యలకు గురికావాల్సి వస్తుంది. కాబట్టి, స్క్రీన్ వాడకాన్ని తగ్గించుకోండి. ఆఫీసులో అయినా సరే.. అస్తమానం కుర్చీకే పరిమితంకాక గంటకోసారి అయినా లేచి అలా నాలుగు అడుగులు వేయండి. వ్యాయామం సంగతేంటి? ఇంట్లో పని ఎక్సర్‌సైజ్‌కి ప్రత్యామ్నాయం కాదు. వారానికి 5 గంటలు వ్యాయామానికి కేటాయించాలినసందే. ఇది శరీరానికే కాదు మెదడునీ దృఢంగా, ఉత్సాహంగా మారుస్తుంది. ధ్యానానికీ అందులో చోటివ్వాలి. ఇక నిద్రకి ఉండే మ్యాజిక్కే వేరు. మెదడుకీ, శరీరానికీ విశ్రాంతినివ్వడమే కాదు జ్ఞాపకాలను జాగ్రత్తగా పొందుపరుస్తుంది. కాబట్టి, దానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సిందే. అమ్మాయిలు.. మీకేం మల్టీ టాస్కింగ్ సులువుగా చేసేయ్యగలరు. అంటే పొగడ్తలా తీసుకుని పనులన్నీ నెత్తిన వేసుకునేరు! ఒక సమయంలో ఒక పనినే చేయండి. మెదడుకు కాస్త భారం తగ్గుతుంది. ఏకాగ్రతా కుదురుతుంది. చివరగా ఫోన్ అయినా.. కంప్యూటర్ తెర అయినా బ్లూ లైట్ ఫిల్టర్ తప్పక వేయండి. నీలికాంతి ప్రభావం మెదడుపై పడకుండా ఉంటుంది.



## హాకీ జాతీయ ఛాంపియన్‌గా హర్యానా


**న్యూఢిల్లీ:** హాకీ ఇండియా జూనియర్ పురుషుల జాతీయ ఛాంపియన్‌షిప్-2025లో హర్యానా 3-2 తేడాతో ఒడిశాను ఓడించి ఛాంపియన్‌గా అవతరించింది. పంజాబ్‌లోని జలంధర్‌లో జరిగిన ఈ టోర్నమెంట్ నాలుగు క్వార్టర్లలో 3-3తో డ్రా అయిన తర్వాత పంజాబ్ షూటౌట్‌లో 4-3తో ఉత్తరప్రదేశ్‌తో జరిగిన 3వ/4వ స్థానం మ్యాచ్‌ను గెలుచుకుని కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. రెండవ క్వార్టర్‌లో ఒడిశా దీపక్ ప్రధాన్ (17వ నిముషం) మరియు ప్రతాప్ టోప్పో (19వ నిముషం) వరుసగా రెండు పెనాల్టీ కార్నర్‌లను గోల్‌గా మార్చడం ద్వారా అద్భుత నైపుణ్యాన్ని ప్రదర్శించింది. మూడవ క్వార్టర్‌లో స్కోర్లు అలాగే ఉన్నా, మ్యాచ్ చివరి క్వార్టర్‌లో హర్యానా ఆటను మలుపు తిప్పింది. చిరాగ్ (50వ నిముషం) పెనాల్టీ కార్నర్ ద్వారా తన జట్టుకు మొదటి గోల్ చేశాడు. మరుసటి నిమిషంలోనే, నితిన్ (51వ, 60వ నిముషం) ఫీల్డ్ గోల్ చేసి ఆటను సమం చేశాడు. చివరి నిమిషంలో నితిన్ ఇద్దరు డిఫెండర్లను దాటుకుని షాట్ కొట్టి హర్యానా తరఫున గోల్ చేసి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నాడు. 3వ/4వ స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో, ఉత్తరప్రదేశ్ తొలి క్వార్టర్ ప్రారంభంలోనే గోల్ చేయడంతో సత్యం పాండే (8వ నిముషం) పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి గోల్‌ను ప్రారంభించాడు. రెండో క్వార్టర్‌లో లవ్‌నూర్ సింగ్ (21వ నిముషం), జప్నీత్ సింగ్ (28వ, 59వ నిముషం) రెండు గోల్స్‌తో పంజాబ్ దూసుకెళ్లింది. మూడవ క్వార్టర్‌లో ఉజ్వల్ పాల్ (48వ నిముషం), ఫహాద్ ఖాన్ (57వ నిముషం) గోల్స్ చేసి మళ్లీ ఆధిక్యంలోకి వెళ్లడంతో ఉత్తరప్రదేశ్ జట్టు మలుపు తిరిగింది. ఆట ముగియడానికి కొన్ని సెకన్లు మిగిలి ఉండగానే. పంజాబ్ ఆటగాడు జప్నీత్ సింగ్ పెనాల్టీ స్ట్రోక్ కొట్టి షూటౌట్‌కు నడిపించాడు. షూటౌట్‌లో చరణ్‌జీత్‌సింగ్, లవ్‌నూర్‌సింగ్, ఓం రజనేష్ సైనీ మరియు సన్నీ పంజాబ్ తరఫున గోల్స్ సాధించారు.

## వరల్డ్ చాంపియన్‌గా చికిత



**న్యూఢిల్లీ:** ప్రపంచ యూత్ ఛాంపియన్‌షిప్ 2025లో అద్భుతమైన ప్రదర్శనతో చికిత్సా తనిపర్తి భారతదేశపు మొట్టమొదటి మహిళా వ్యక్తిగత కాంపౌండ్ జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. కెనడాలోని విన్నిపెగ్‌లో ఆదివారం జరిగిన ప్రపంచ యూత్ ఛాంపియన్‌షిప్‌లో 20 ఏళ్ల ఆమె ఫైనల్‌లో కొరియాకు చెందిన యెరిన్ పార్క్‌ను ఓడించి (142-136) అండర్ 21 మహిళల వ్యక్తిగత బంగారు పతకాన్ని గెలుచుకుంది. ప్రస్తుత ఛాంపియన్‌షిప్‌లలో అన్ని వ్యక్తిగత ఈవెంట్లలో భారతదేశం తరఫున మొదటి బంగారు పతకం సాధించింది. అంతకుముందు, ఆమె తన తోటి దేశస్థురాలు, టాప్ సీడ్ పర్నీత్ కౌర్‌ను ఓడించి సెమీస్‌కు చేరుకుంది, ఆపై స్పెయిన్‌కు చెందిన పౌలా డియాజ్‌పై 142-133 తేడాతో ఆధిపత్య విజయంతో ఆమె ఫైనల్స్‌లో తన స్థానాన్ని నిర్ధారించుకుంది. అండర్ 18 మహిళల వ్యక్తిగత ఈవెంట్‌లో ప్రితికా ప్రదీప్ రజతం గెలుచుకోవడంతో భారతదేశం కాంపౌండ్ డబుల్‌ను తృటిలో కోల్పోయింది, ఫైనల్‌లో యుఎస్ఎకి చెందిన సవన్నా ఓడొన్నోహ్యూ చేతిలో 140-143 తేడాతో ఓడిపోయింది. ఇక కాంపౌండ్ పురుషుల వ్యక్తిగత ఈవెంట్లలో భారత్‌కు పతకాలు రాలేదు. ఆర్చర్లలో ఎవరూ అండర్ 21 సెమీఫైనల్స్‌కు చేరుకోలేదు. యోగేష్ జోషి అండర్ 18 విభాగంలో నాల్గవ స్థానంలో నిలిచాడు. ప్రీతికాతో కలిసి యోగేష్, మిక్స్‌డ్ టీమ్ కాంపౌండ్ అండర్ 18 రజత పతకాన్ని గెలుచుకున్నాడు, అత్యధిక స్కోరింగ్ ఫైనల్‌లో 149-150తో అమెరికన్ జంటపై కేవలం 1 పాయింట్ తేడాతో ఓడిపోయాడు. దీంతో భారత్ అండర్ 18, అండర్ 21 విభాగాలలో ఐదు పతకాలతో కాంపౌండ్ పోటీని ముగించింది. వీటిలో 3 స్వర్ణాలు మరియు 2 కాంస్య పతకాలు ఉన్నాయి.

## షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఐశ్వర్యకు బంగారు పతకం



**న్యూఢిల్లీ:** ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్ రైఫిల్ 50 మీటర్ల 3 పి విభాగంలో ఐశ్వర్య తోమర్ బంగారు పతకం సాధించింది. కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్‌లో ఆదివారం జరిగిన 16వ ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్‌లో స్వర్ణ పతకాన్ని గెలు పొందాడు. ఫైనల్లో ఐశ్వర్య మొత్తం 462.5 పాయింట్లు సాధించి, క్వాలిఫికేషన్ రౌండ్‌లో అగ్రగామిగా ఉన్న చైనాకు చెందిన వెన్యు జావోను 0.5 స్వల్ప తేడాతో ఓడించి తన రెండవ ఆసియా వ్యక్తిగత బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు. అంతకుముందు ఐశ్వర్య చైన్ సింగ్, అఖిల్ షెయోరాన్‌లతో కలిసి, పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3పి టీమ్ స్వర్ణాన్ని కోల్పోయి రజత పతకంతో సంతృప్తి చెందింది. ఇందులో ముగ్గురు షూటర్లు వ్యక్తిగత ఫైనల్‌కు చేరారు. చైన్ సింగ్, అఖిల్ కూడా ఫైనల్స్‌లో మంచి ఆరంభాన్ని పొందినా ట్రాక్ కోల్పోయి వరుసగా 4, 5 వ స్థానాలను పూర్తి చేయలేకపోయాడు. దీంతో భారత్ సీనియర్ విభాగంలో ఇప్పట వరకూ 13 పతకాలను కైవసం చేసుకోగా, వీటిలో 5 బంగారు, 2 రజత, 6 కాంస్య పతకాలు సాధించింది.



# లక్కీ ప్లేయర్స్

## ఆసియా కప్ బరిలో తొలిసారి

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ టోర్నమెంట్‌కు మరో పదిహేను రోజుల్లో ప్రారంభమవుతోంది. ఈ ఆసియా కప్ కోసం 15 మంది సభ్యుల భారత జట్టును ఇటీవల ప్రకటించారు. శుభ్‌మన్ గిల్ వైస్ కెప్టెన్‌గా, సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. అయితే తొలిసారి ఆసియా కప్ ఆడుతున్న లక్కీ ఆటగాళ్లు ఉన్నారు. మొత్తంగా ఐదుగురు భారత ఆటగాళ్లు తొలిసారి ఆసియా కప్ బరిలోకి దిగుతున్నారు. వీరిలో ఓపెనర్ అభిషేక్ శర్మ 2024లో అంతర్జాతీయ అరంగేట్రం చేయగా, చివరి ఆసియా కప్ 2023లో జరిగింది. అభిషేక్ టీ20 క్రికెట్‌లో 194 స్ట్రైక్ రేట్ కలిగి ఉన్నాడు. ఇప్పటివరకు తన 17 మ్యాచ్‌ల టీ20 కెరీర్‌లో రెండు సెంచరీలు చేశాడు. అలాగే వరుణ్ చక్రవర్తి 2021 టీ20 ప్రపంచ కప్ ఆడాడు.
కానీ, ఆ తర్వాత జట్టు నుంచి తొలగించబడ్డాడు. 2024లో తిరిగి వచ్చిన తర్వాత, అతను 12 మ్యాచ్‌ల్లో 31 వికెట్లు పడగొట్టాడు. ఆసియా కప్‌లో టీమిండియాకు ప్రధాన, అత్యంత ప్రాణాంతకమైన స్పిన్ బౌలర్‌గా నిరూపించుకోగలడు. ఇక సంజు శాంసన్ 2015లో అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. కానీ, తరచుగా జట్టులోకి రావడం, జట్టులో చోటు కోల్పోవడం వల్ల ఆసియా కప్‌లో ఆడే అవకాశం రాలేదు. అతను ఇంగ్లాండ్‌పై బాగా రాణించలేకపోయాడు. కానీ, అంతకు ముందు 5 ఇన్నింగ్స్‌లలో 3 సెంచరీలు సాధించడం ద్వారా సెలెక్టర్ల నమ్మకాన్ని సంపాదించాడు. భారత జట్టులో ఫినిషర్ పాత్ర పోషిస్తున్న రింకు సింగ్, ఆసియా కప్ జట్టులో చోటు దక్కించుకుంటారనే ఆశ పెద్దగా లేదు. అయినప్పటికీ, అతను జట్టులోకి ఎంపికయ్యాడు. ఎంపికైన కొద్ది రోజులకే, అతను యుపి టీ20 లీగ్‌లో 48 బంతుల్లో 108 పరుగులు చేసి, ఆసియా కప్‌నకు ముందు తన సన్నాహాలు సజావుగా ఉన్నాయని పేర్కొన్నాడు.
చివరిగా వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ అభిషేక్ శర్మ ఐపీఎల్ 2025లో ఆర్‌సీబీ తరఫున అనేక తుఫాను ఇన్నింగ్స్‌లు ఆడటం ద్వారా ఆసియా కప్ జట్టులోకి చేరుకున్నాడు. అయితే, అతను వికెట్ కీపర్‌గా ప్లేయింగ్ ఎలెవెన్‌లో చోటు దక్కించుకుంటాడో లేదో స్పష్టంగా లేదు. ముఖ్యంగా శుభ్‌మాన్ గిల్ జట్టులోకి వచ్చిన తర్వాత, ప్లేయింగ్ ఎలెవెన్ కాంబినేషన్‌లో మార్పు ఖచ్చితంగా ఉంటుందని భావిస్తున్నారు.

# మహిళల ఛాంపియన్‌షిప్‌లో భారత్ విజయం

## ఆతిథ్య భూటాన్ 8-0 తేడాతో ఓటమి




**న్యూఢిల్లీ:** మహిళల ఛాంపియన్‌షిప్-2025లో ఆతిథ్య భూటాన్‌ను భారత్ మహిళల ఫుట్‌బాల్ జట్టు ఓడించింది. ఆదివారం థింపులోని చాంగ్లిమితాంగ్ స్టేడియంలో జరిగిన శాఫ్ అండర్ 17 మహిళల ఛాంపియన్‌షిప్‌లో భారత్‌ఆతిథ్య భూటాన్‌ను 8-0 తేడాతో చిత్తు చేసింది. ఈ టోర్నమెంట్‌లో యంగ్ టైగ్రెస్స్‌కు ఇది వరుసగా మూడోవిజయం. అనుష్క (53,61,73) అద్భుతమైన ప్రదర్శనతో పాటు,అభిస్తా బాస్నెట్ (23,89) రెండుగోల్స్ చేయగా, పెర్ల్ ఫెర్నాండెజ్ (71), దివ్యానిలిండా (77),వలైన ఫెర్నాండెజ్ (90+2) లక్ష్యాన్ని చేరుకున్నారు. హాఫ్ టైం ముగిసే సమయానికి భారత్ 1-0తో ఆధిక్యంలో ఉంది. 23వ నిమిషంలో భూటాన్ ప్రతిఘటన దెబ్బతింది. 40వ నిమిషంలో భూటాన్ ఒక ఆశాజనకమైన క్షణాన్ని సృష్టించింది. షెరింగ్ లామో బంతిని కొట్టగా భారత కీపర్ మున్నీ దానిని అందుకున్నాడు. విరామం తర్వాత 53వ నిమిషంలో భారత్ తన ఆధిక్యాన్ని రెట్టింపు చేసుకుంది. అనుష్క కుమారి 20 గజాల దూరం నుండి ఫ్రీకిక్ కోసం ముందుకు వచ్చి టాప్ కార్నర్‌లోకి విసిరింది, 61వ నిమిషంలో, అనుష్క తన రెండవ గోల్ చేసింది. దివ్యాని ప్రమాదకరమైన క్రాస్ వాంగ్మోను దూరపు పోస్ట్ వద్ద దాటవేయడంతో, మైదానంలో కేవలం మూడు నిమిషాల పాటు ఉన్న ప్రత్యామ్నాయ ఆటగాడు పెర్ల్ ఫెర్నాండెజ్ 71వ నిమిషంలో నాల్గవ గోల్ చేశాడు. అనుష్క తన హ్యాట్రిక్‌తో స్ట్రైక్‌ను విడుదల చేసింది. 25 నిమిషాల్లో ఇది ఆమెకు మూడవ గోల్. చివరిగా వలైన ఫెర్నాండెజ్ 20 గజాల దూరం నుండి గోల్ చేయడంతో భారత్ 8 గోల్స్ చేరి విజయం సాధించింది.

## 56 శాతం ఉండగా 41శాతమే యువత




# 'ఎఐ నైపుణ్యంపై 'మిడిలేజ్ల పోటీ!

**హైదరాబాద్,ఆగస్టు24, ప్రభాతవార్త:** ప్రొఫెషనల్స్ రంగంలో ఉన్న మిడిల్‌ఏజ్ వారే ఏఐ స్కిల్స్‌కు పోటీపడుతున్నారు. నాయకత్వం వహించేందుకు ఆసక్తి చూపుతున్నారని గ్లోబల్ జాబ్‌సైట్ ఇండీడ్ రూపొందించిన 'వర్క్ ఆ హేడ్ రిపోర్టు లో పేర్కొంది. తమ రంగాల్లో అందరి కంటే ముందు ఉండేందుకు అదనపు శిక్షణ కోరుకుంటున్నారు. పోటీగా ఉన్న యువత కంటే మిడిల్‌ఏజ్ ఉద్యోగులు ఉత్సాహం చూపుతున్నారని వివరించింది. అయితే మిడిల్‌ఏజ్‌లో 56శాతం ఉండగా..యువతలో 41శాతమే అదనపు శిక్షణ కావాలని భావిస్తున్నారు. 35 నుంచి 54 వయస్సు ఉన్న వృత్తి నిపుణుల్లో అధిక విశ్వాసం ఉందని, దాదాపు సగం మంది 49శాతం ఏఐ ఇంటిగ్రేటెడ్ వర్క్ ప్లేస్‌లలో పని చేయడానికి సిద్ధంగా ఉన్నారని నివేదికలో వెల్లడించింది. ఇక 18-24 వయస్సు యువత అధిగమిస్తున్నారని అభిప్రాయపడింది. ఇక టెక్నాలజీ, రిటైల్, తయారీ, ప్రయాణ, న్యాయ, ఆరోగ్య, సంరక్షణ, మానవవనరులు వంటి 12రంగాల్లోని 3001 మంది బ్లూకాలర్, వైట్‌కాలర్ ఉద్యోగులను సర్వే చేసి నివేదిక సిద్ధం చేసింది. అదేవిధంగా భవిష్యత్తులో ఏఐని వినియోగించాలనుకుంటున్నామని 34శాతం మంది తెలిపారు. 70శాతం మంది బ్లూకాలర్ ఉద్యోగులు తమ పనుల కోసం సాంకేతికతను ఉపయోగిస్తున్నారని, ప్రతి మందిలో ఇద్దరు ఇప్పటికే జెన్‌రేటివ్ ఏఐను వారి పనుల్లో భాగమయిందని వెల్లడించింది.

airtel


# ఎయిర్‌టెల్.. నో సిగ్నల్

## సోషల్‌మీడియాలో నెటిజన్ల ఆగ్రహం

**హైదరాబాద్,ఆగస్టు24, ప్రభాతవార్త:** భారతీ ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ మరోసారి సిగ్నల్ల సమస్య ఎదురైంది. దీంతో యూజర్లు సోషల్‌మీడియాలో సంస్థపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 8న ఢిల్లీలో ఎన్‌సీఆర్ పరిధిలో ఎయిర్‌టెల్, జియో నెట్‌వర్క్ నిలిచిపోయిన విషయం తెలిసిందే. మళ్లీ ఆదివారం బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్ సహా పలు కీలక నగరాల్లో ప్రభావం కనిపించింది.
దాంతో కాల్స్, ఎస్ఎంఎస్, ఇంటర్‌నెట్ సేవలు స్తంభించాయి. డౌన్‌డెటెక్టర్ నుంచి వచ్చిన డేటా ప్రకారం మధ్యాహ్నం సమయంలో ఫిర్యాదులు వెలువెత్తగా 7,100 మందికి పైగా వినియోగదారులు ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ పనిచేయడం లేదని పేర్కొన్నారు. గంటన్నరల్లో సేవలు పురుద్ధరణయ్యాయని ఎయిర్‌టెల్ కస్టమర్ సపోర్ట్ హ్యాండిల్ ఎయిర్‌టెల్ కేర్స్ ఎక్స్‌వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది. తాత్కాలిక కనెక్టివిటీ సమస్యగా పేర్కొంది. సమస్యను గంటలోగా పరిష్కారమవుతుందని పేర్కొంది. యూజర్లు తమ మొబైల్స్‌ను రీస్టార్ట్ చేయాలని సూచించింది. ఎయిర్‌టెల్ ట్వీట్‌లో 'ఈ అసౌకర్యానికి మమ్మల్ని క్షమించండ్డి.. ఈ సమస్య తాత్కాలిక కనెక్టివిటీ అంతరాయం కారణంగా జరుగుతుంది. సుమారు ఒక గంటలో పరిష్కారమవుతుంది. మీ మొబైల్‌ను ఒకసారి రీస్టార్ట్ చేయండి అని పేర్కొంది.
నెట్‌వర్క్‌లో అంతరాయంపై సోషల్ మీడియా వేదికగా యూజర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీ వినియోగదారులకు ముందుగా సమాచారం ఇవ్వకూడదా? అంటూ ఓ యూజర్ ప్రశ్నించాడు. మరొకరు గత 6 గంటలుగా ఎయిర్‌టెల్ పోస్ట్‌పెయిడ్ సేవలు నిలిచిపోయాయి. కాల్స్ రావడం లేదు.
ఇంటర్నెట్ కూడా స్తంభించింది. కస్టమర్ కేర్ నుంచి కూడా స్పందన లేదని రీట్వీట్ చేశాడు.

# తొలి రుణగ్రహీతలకు

## వర్తించని 'సిబిల్ స్కోర్ల




**హైదరాబాద్,ఆగస్టు24, ప్రభాతవార్త:** సిబిల్ స్కోరు లేదనే కారణంతో బ్యాంకులు లోన్ రెక్వెస్ట్ రిజెక్ట్ చేయకూడదని ఆర్థిక శాఖ పేర్కొంది. తొలిసారి లోన్ కోసం దరఖాస్తు చేసుకున్నవారికి సిబిల్ అవసరం లేదని చెప్పింది. అయితే గతంలో లోన్లు తీసుకున్నవారికి సిబిల్ నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేసింది. పార్లమెంటులో ఇందుకు సంబంధించి అధికారిక ప్రకటన చేసింది. బ్యాంకులకు తమ నిబంధనలకు అనుగుణంగా నిర్ణయం తీసుకునే అధికారం ఉంటుంది. అయితే తొలిసారి లోన్ దరఖాస్తు చేసుకునేవారికి సిబిల్ వర్తించదని చెప్పింది. మొదటి సారి లోన్ కోసం అప్లై చేసివారికి సిబిల్ స్కోరు లేకపోగా.. సున్నా ఉన్నా బ్యాంకులు లోన్ రిజెక్ట్ చేయకూడదని వివరించింది. అయితే ఇప్పటికే రుణాలు తీసుకున్నవారికి మాత్రం సిబిల్ స్కోరు నిబంధనలు వర్తిస్తాయని తెలిపింది. గతంలో ఎక్కడైనా లోన్లు తీసుకున్నాడా, సెటిల్మెంట్లు ఏమైన ఉన్నాయా, రీపేమెంట్ హిస్టరీ వంటి వివరాల గురుంచి బ్యాంకులు ఎంక్వైరీ చేసుకోవచ్చని చెప్పారు. పాత కస్టమర్లకు మాత్రం బ్యాంకులు సిబిల్ స్కోరును ప్రామాణికంగా తీసుకునే అధికారం ఉంటుంది. స్కోరు తక్కువ ఉంటే లోన్ దరఖాస్తును రిజెక్ట్ కూడా చేయవచ్చు. ఇది బ్యాంకు అంతర్గత పాలసీలపై ఆధారపడి ఉంటుంది. రూ.100 వరకు ఫీజుకాగా, సిబిల్ రిపోర్టులను కస్టమర్లకు ఇచ్చేందుకు క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీలు గరిష్టంగా రూ.100 వరకు మాత్రమే ఛార్జీలు వసూలు చేయాలని, అంతకుమించి అనుమతి లేదని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. అయితే ఏడాదికి ఒకసారి మాత్రం క్రెడిట్ రిపోర్టును ఉచితంగా అందించాలనే నిబంధన ఉందని చెప్పింది. సిబిల్ స్కోరు సాధారణంగా 600 నుంచి 900 మధ్య ఉంటుంది. ఈ స్కోరు 750 కంటే ఎక్కువగా ఉంటే మంచి కస్టమర్ అని బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు భావిస్తాయి. వడ్డీ రేటు కూడా తక్కువగా ఉంటుంది. అదే స్కోరు తక్కువగా ఉంటే లోన్ వచ్చే అవకాశాలు తగ్గిపోతాయి. ఒకవేళ లోన్ ఇచ్చినా అధిక వడ్డీ రేట్లు ఉంటాయి. అయితే తొలిసారి లోన్ తీసుకునేవారి సిబిల్ స్కోరు సున్నాగా ఉంటుంది లేదా. కన్పించదు. వీరు లోన్ తీసుకున్న తర్వాత స్కోరు జనరేట్ అవుతుంది. రీపేమెంట్లు టైమ్‌కి చేస్తుంటే స్కోరు పెరుగుతుంది. ఒకవేళ ఆలస్యమైతే స్కోరు తగ్గుతుంది. ఎప్పుడూ సిబిల్ స్కోరును పెంచుకునేందుకే ప్రయత్నించాలి.

## ఓవర్‌టైం డ్యూటీపై ఆరోగ్య ప్రభావం!



**హైదరాబాద్,ఆగస్టు24, ప్రభాతవార్త:** ఉద్యోగంలో కనీసం కాకుండా అధికంగా పని చేస్తే ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని అధికస్థాయిలో చెప్పగా...పరిహారం ఇస్తే అంగీకరిస్తామని ఓ సంస్థ సర్వేలో వెల్లడైంది. పనిగంటల పొడిగింపుపై జరుగుతున్న చర్చనేపథ్యంలో సర్వేనిర్వహించింది. చాలా మంది వ్యతిరేకిస్తున్నారు. అయితే అధిక పనిగంటలు వ్యక్తిగత సమయం, ఆరోగ్యంతోపాటు పని,జీవన సమతుల్యత ప్రతికూల ప్రభావం చూపుతున్నట్లు 44శాతం అభిప్రాయపడినట్లు నివేదిక అందించింది. జీనియస్ డిజిపోల్ అనే మానవ వనరుల కన్సల్టెన్సీ 'పనిగంటల పొడిగింపు' అంశంపైఇటీవల ఆన్ లైన్ సర్వే జరిపింది. జూలై1 నుంచి 31 మధ్య కాలంలో చేసిన ఈ సర్వేలో దాదాపు 2076మంది ఉద్యోగులు పాల్గొన్నారని వివరించింది. ఇందులో మెజారీ ఉద్యోగులు వ్యక్తిగత ఆరోగ్యంపై చెప్పారు. మరో 16శాతం మంది విధానానికి కట్టుడిఉన్నామని, ఉత్పాదకత పెంచేందుకు దోహదం చేస్తుందనిభావిస్తున్నట్లు తెలిపినట్లు వెల్లడించింది. పనిగంటలకు సంబంధించిన విదానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం , పారదర్శకతపై ఉద్యోగులు స్పష్టమైన వైఖరితో ఉన్నట్లు తెలిపింది. ఈ సంప్రదింపుల్లో తమకు కూడా బాగస్వామ్యం ఉండాలని ఇంకో 79శాతం మంది కోరుకుంటున్నారు. అంతేకాదు ఇటువంటి చర్చలు బహిరంగంగా ఉండడంతో పాటు విధాన రూపకల్పన పారదర్శకంగా జరగాలని ఆశిస్తున్నారు. నేటి శ్రామికశక్తి మార్పునకు వ్యతిరేకంగా లేదు. నిష్పక్షపాత, ఆలోచనలను పంచుకోవడం కోరుతుంది. ఆలోచనపరమైన ప్రణాళిక లేకుండా ఎక్కువ పని చేయించడం ఉద్యోగులు, యజమాన్యాల మధ్య దూరాన్ని పెంచుతుంది. ఉత్పాదకత అనేది కేవలం ఉద్యోగులు వెచ్చించే సమయంపైనే కాకుండా వాళ్ల శక్తి యుక్తులపై ఆధారపడి ఉంటుందని సంస్థలు గుర్తించాలని జీనియస్ హెచ్‌ఆర్‌టెక్ వివరించింది.

వాణిజ్యం




## ఎస్ బ్యాంకులో 'జపాన్ల భాగస్వామ్యం

**హైదరాబాద్, ఆగస్టు24, ప్రభాతవార్త:** ఎస్ బ్యాంకులో జపాన్ దేశం భాగస్వామ్యమైంది. 24.99 శాతం వాటా కొనుగోలుకు రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) అనుమతిచ్చింది. ఈ మేరకు సుమిటోమో మిత్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్ (ఎస్ఎంబిఎస్)తో ఒప్పందం కుదుర్చుకోనుంది. 2025 మే 9న స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) నుంచి 13.19శాతం వాట, ఏడుగురు వాటాదార్ల నుంచి 6.81శాతం వాటాను కొనుగోలు చేయడంతో ఎస్ బ్యాంకులో 20శాతం వాటాను కొనుగోలు చేస్తానని కార్పొరేషన్ ప్రతిపాదించింది.
ఇతర వాటాదారులలో యాక్సిస్, బంధన్ బ్యాంకులు, ఫెడరల్, హెచ్‌డిఎఫ్‌సి, ఐసిఐసిఐ, ఐడిఎఫ్‌సి ఫస్ట్‌బ్యాంక్, కోటక్‌మహేంద్ర బ్యాంకులు ఉన్నాయి. బ్యాంక్ పెయిడప్ షేర్ క్యాపిటల్, ఓటింగ్ హక్కుల్లో 24.99వరకు కొనుగోలుకు ఆమోదం లభించిందని ఎస్ బ్యాంక్ నియంత్రణ సంస్థలకు వెల్లడించింది. ఆమోదం లేఖ ఏడాదిపాటు చెల్లుబాటులో ఉంటుందని వివరించింది. కొనుగోలు ప్రకారం ఎస్ఎంబిసిని బ్యాంక్ ప్రమోటర్‌గా పరిగణిం,బోమని ఆర్‌బిఐ స్పష్టం చేసిందని పేర్కొంది.

## త్వరలో ఆకట్టుకునే కొత్త 'వాట్సాప్ ఫీచర్లు'




**హైదరాబాద్,ఆగస్టు24, ప్రభాత వార్త:** ప్రముఖ సోషల్ మెస్సెజ్ వాట్సాప్ యువతను ఆకర్షించే మరికొన్ని ఫీచర్లు త్వరలో అందుబాటులోకి వస్తుంది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ వినియోగదారుల కోసం అప్డేట్స్ ఉంటాయని కంపెనీ వర్గాలు పేర్కొన్నాయి. దీంతో కమ్యూనికేషన్ మరింత సులభతరం అవుతుందని భావిస్తున్నారు. ఇది యువతకు ఎంతో నచ్చుతుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. వాట్సాప్‌లో వాయిస్ మెయిల్, ఎమోజీ రియాక్షన్ ప్యానల్, వాయిస్ మెసేజ్‌లతో మిస్డ్‌కాల్స్‌లాంటి ఆప్షన్స్ ఉంటాయి. ఐఓఎస్ యూజర్ల కోసం వాట్సాప్‌లో సరికొత్త ఫీచర్ ఏర్పాటుకానుంది. ఇక వాయిస్ మెయిల్స్‌కు స్పందించకపోతే స్క్రీన్‌పై ఒక ప్రాంప్ట్ కనిపిస్తుంది, మీరు పంపాలనుకున్న మెసెజ్‌ను వెంటనే రికార్డ్ చేసి పంపిచవచ్చు. ఇది మెసేజ్ చాటింగ్‌లో కనిపిస్తుంది. దీంతో కమ్యూనికేషన్ వేగం పెరుగుతుందని ప్రతినిధులు భావిస్తున్నాయి. యూజర్లు ఏదైన సమాచారాన్ని కాపీ చేసేటప్పుడు భారీ సందేశం కాకుండా తక్కువ ఉన్న వ్యాఖ్యలను కాపీ చేసుకోవచ్చని, ఒకే పదాన్ని, పేరా గ్రాఫ్‌ను కాపీ చేయవచ్చన్నారు. అదేవిధంగా వాట్సాప్ అక్కౌంట్ సెంటర్ ద్వారా ఇన్‌స్టాగ్రామ్‌కు లింక్ చేసుకునే ఫీచరును కూడా మెటా అభివృద్ధి చేస్తుంది. ఒకసారి ఇన్‌స్టాలో అక్కౌంట్‌ను వాట్సాప్‌కు లింక్ చేస్తే వాట్సాప్ ప్రొఫైల్‌లో సోషల్ ఐకాన్ కనిపిస్తుంది. దీంతో అఫీషియల్ ఇన్‌స్టా అక్కౌంట్‌ను వాట్సాప్ వినియోగదారులు సైతం కొనసాగించవచ్చని వివరించాయి. అలాగే ఎమోజీ రియాక్షన్ ప్యానల్ సరికొత్తగా లేఅవుట్‌ను మరింత స్పష్టంగా ఉండేలా అభివద్ధి చేస్తున్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.